VELTHURU TELUGU DAILY

# వెలుతురు

తెలుగు దిన పత్రిక

రంగారెడ్డి, నల్గొండ : మంగళవారం 23.06.2026

సంపుటి : 08 సంచిక : 14 , పేజీలు : 12 , వెల:రూ . 5/-

SRI SHANTHI PUBLICATIONS PUBLISHED FROM TELANGANA | ANDHRAPRADESH

www.velthuru.com

## తెలంగాణ పారిశ్రామిక ప్రగతికి సహకరించండి

- భవ్య స్కీం ఫేజ్ -1 లో రాష్ట్రానికి ప్రత్యేక ప్రాధాన్యమివ్వాలి



2

# అన్ని వసతులతో ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్‌ను అభివృద్ధి చేయండి...

- కార్గో.. ఎంఆర్‌వో వసతులు కల్పించాలి...
- హ్యాంగర్ ఏర్పాటుకు అత్యంత అనుకూలం..
- దేవరకద్రలో డీఆర్‌డీవో ప్రాజెక్టు మంజూరు చేయండి..
- రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వినతి
- గాంధీ సరోవర్ ప్రాజెక్టుకు భూములు బదలాయించినందుకు కృతజ్ఞతలు తెలిపిన సీఎం



**ఢిల్లీ వెలుతురు జూన్ 22:**

భారత వాయు సేన (IAF) ఆధ్వర్యంలో నిర్మించనున్న ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్‌ను అన్ని వసతులతో అభివృద్ధి చేయాలని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలోని రక్షణ శాఖ కార్యాలయం కర్తవ్య భవన్‌లో రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా గాంధీ సరోవర్ ప్రాజెక్టుకు రక్షణ శాఖ భూములు బదలాయించినందుకు కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ అత్యంత ప్రాధాన్య ప్రాజెక్టుల్లో ఒకటైన ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ అభివృద్ధికి సంబంధించి భూ సేకరణ, యుటిలిటీస్ బదలాయింపు అంశాల్లో పూర్తిగా సహకరిస్తామని కేంద్ర మంత్రికి సీఎం తెలియజేశారు. ఆదిలాబాద్‌లో భారతీయ వాయు సేన ఆధ్వర్యంలో రానున్న ఎయిర్‌పోర్ట్ దేశ సమగ్రత, రక్షణకు సంబంధించిన అంశమైనందున, దానిని భారీగా విస్తరిస్తున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తరఫున అన్ని విధాలా సహకరిస్తామని రక్షణశాఖ మంత్రికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలియజేశారు. భారత వాయుసేన టెర్మినల్‌తో పాటు ప్రయాణికుల సౌకర్యార్థం నిర్మించనున్న పౌర విమానయాన శాఖకు చెందిన టెర్మినల్ బిల్డింగ్‌తో పాటుగా కార్గో, ఎంఆర్‌వో (MRO), హ్యాంగర్ (HANGAR) సౌకర్యాలను పెద్ద ఎత్తున ఏర్పాటు చేసేందుకు సహకరించాలని కేంద్ర మంత్రిని సీఎం కోరారు. ఇటీవల మధ్య ఆసియాలో చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో ప్రపంచ ప్రసిద్ధిగాంచిన ఎయిర్‌లైన్స్ తమ హ్యాంగర్స్‌ను ఏర్పాటు చేసుకోవడానికి సరైన ప్రదేశాలను అన్వేషిస్తున్నాయని, హ్యాంగర్ ఏర్పాటుకు ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ అత్యంత అనుకూలమైనందున ఆ దిశగా అభివృద్ధి చేయాలని రక్షణ శాఖ మంత్రికి ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. తమ కీలకమైన ప్రాజెక్టు ఏర్పాటుకు డీఆర్‌డీవో/డీఆర్‌డీఎల్ మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర సమీప ప్రదేశాన్ని ఎంపిక చేసుకున్నందున ఆ ప్రాజెక్ట్‌ను త్వరగా మంజూరు చేయాలని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. సమావేశంలో రాష్ట్ర ఆర్ అండ్ బీ స్పెషల్ సెక్రటరీ వికాస్‌రాజ్, ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ కే.ఎస్.శ్రీనివాసరాజు, ముఖ్యమంత్రి కార్యదర్శి మాణిక్ రాజ్, స్పెషల్ సెక్రటరీ కోఆర్డినేషన్ అద్వైత్ కుమార్ సింగ్ పాల్గొన్నారు.

## మెట్రో నిధులపై ఢిల్లీలో కీలక భేటీ

- కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో సీఎం రేవంత్ రెడ్డి సమావేశం
- సమావేశంలో పాల్గొన్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మెట్రో ప్రాజెక్టు నిధుల విడుదలపై చర్చ



2

**ఢిల్లీ వెలుతురు జూన్ 22:**

మెట్రో రైలు ప్రాజెక్టుకు సంబంధించిన నిధుల విడుదల అంశంపై సోమవారం సాయంత్రం ఢిల్లీలో కీలక సమావేశం జరగనుంది. సాయంత్రం 6.30 గంటలకు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమావేశం కానున్నారు.

## వర్షాకాలంలో ప్రజల భద్రతే ప్రాధాన్యంగా ఆర్ అండ్ బి అధికారులు క్షేత్ర స్థాయిలో పనిచేయాలి: మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

- వరదల సమయంలో తక్షణ స్పందన కోసం ఆర్&బి శాఖ ప్రత్యేక స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్(SOP)అమలు

2

## కీలక సంస్థల భద్రతలో సీఐఎస్ఎఫ్‌కు పెను సవాళ్లు

- దేశ ఆర్థిక వ్యవస్థకు కీలకమైన సంస్థలపై దాడే శత్రువుల ప్రధాన లక్ష్యం
- ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సిద్ధం కండి
- ఆధునిక సాంకేతికతను సమకూర్చుకోండి
- అవసరమైన అన్ని వనరులను అందించేందుకు కేంద్రం సిద్ధం




2

- ప్రపంచంలోనే అత్యాధునిక భద్రతా దళంగా సీఐఎస్ఎఫ్ ను తీర్చిదిద్దుతాం

## సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారంలో వేగం పెంచాలి

- జిల్లాకో మండలంలో ఇంటిగ్రేటెడ్ భూభారతి అమలుకు యోచన
- ఏడాది కాలంలో 3.65 లక్షల పాస్‌బుక్‌ల జారీ
- రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**హైదరాబాద్ వెలుతురు జూన్ 22:**

రైతు భూమికి చట్టబద్ధమైన రక్షణ, స్పష్టమైన హక్కులు కల్పించడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార & పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో భూసమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తూ ముందుకు సాగుతోందన్నారు.

▶ మిగతా 4లో

## మహారాష్ట్ర రాజకీయాల్లో పెను భూకంపం

- సీఎం షిండే వర్గంలోకి 'యూబీటీ' ఆరుగురు రెబెల్ ఎంపీలు..
- పార్లమెంటులో పెరగనున్న సీఎం షిండే వర్గం బలం
- ఆపరేషన్ టైగర్ ఏడాది పొడవునా సాగుతుంది: ప్రతాప్ సర్నాయిక్
- అవమానాలు భరించలేకే పార్టీ వీడుతున్నా: రెబెల్ ఎంపీ నరేశ
- ఠాక్రే ఆగ్రహం
- జూన్ 27 నుంచి మహారాష్ట్రవ్యాప్తంగా ఉద్ధవ్ ఠాక్రే పర్యటనలు

4

# శాంతి బాటలో అమెరికా-ఇరాన్

- స్విట్జర్లాండ్ చర్చలు సఫలం..
- కీలక ఒప్పందాలకు గ్రీన్ సిగ్నల్
- మధ్యవర్తిత్వంలో పాక్ సఫలం
- పర్యవేక్షణకు హై లెవెల్ కమిటీ
- లో కాల్పుల విరమణకు 'డీకాన్ఫ్లిక్షన్' సెల్
- హర్మూజ్ జలసంధిలో వాణిజ్య నౌకలకు రక్షణ
- స్తంభింపజేసిన ఆస్తుల విడుదల..
- నౌకాశ్రయాల దిగ్బంధనం ఎత్తివేత

8

**మెరికా-ఇరాన్ వెలుతురు జూన్ 22:**

అంతర్జాతీయ రాజకీయాల్లో దశాబ్దాలుగా నెలకొన్న ఉద్రిక్తతలకు తెరదించుతూ స్విట్జర్లాండ్ వేదికగా అమెరికా, ఇరాన్ దేశాల మధ్య జరిగిన అత్యంత కీలకమైన దౌత్య చర్చలు ఎట్టకేలకు ముగిశాయి. ఇరు దేశాల మధ్య అత్యంత సానుకూల వాతావరణంలో ఈ శాంతి చర్చలు సాగినట్లు మధ్యవర్తులుగా వ్యవహరించిన పాకిస్థాన్, ఖతార్ దేశాలు అధికారికంగా ప్రకటించాయి. ప్రపంచ శాంతికి ముప్పుగా మారిన అణు కార్యక్రమ నియంత్రణ, ఇరాన్‌పై ఆర్థిక ఆంక్షల ఎత్తివేత, పరస్పర వివాదాల పరిష్కారం కోసం ఇరుపక్షాలు ఒక అంగీకారానికి వచ్చాయి. ఇందుకోసం ప్రత్యేక వర్కింగ్ గ్రూప్‌లను ఏర్పాటు చేసేందుకు ఇరు దేశాలు సమ్మతించాయి.ల

## బ్రిటన్ ప్రధాని రాజీనామా..

- లేబర్ పార్టీ సారధ్యానికీ గుడ్‌బై
- దివాళా తీసిన పార్టీని సంస్కరించాను: కీర్ స్టార్మర్
- రాజు చార్లెస్‌కు సమాచారం.. సెప్టెంబరుకల్లా కొత్త ప్రధాని
- జూలై 9 నుంచి కొత్త నాయకుడి ఎంపిక ప్రక్రియ ప్రారంభం
- రేసులో ముందున్న అండీ బర్న్‌హామ్.. మారిన ఆరుగురు ప్రధానులు

4

## భూపాలపల్లి రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఎంవీఐ వెంకన్నకు నివాళి

- కుటుంబానికి కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ హామీ



**వరంగల్ వెలుతురు జూన్ 22:**

భూపాలపల్లి రోడ్డు ప్రమాదంలో విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ (ఎంవీఐ) వెంకన్న భౌతికకాయానికి టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ నివాసానికి వెళ్లి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, వరంగల్ ఎంపీ కడియం కావ్యతో కలిసి వెంకన్న కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

▶ మిగతా 2లో

## కొలానుపాక సోమేశ్వరాలయాన్ని స్మార్ట్ టెంపుల్‌గా తీర్చిదిద్దుతాం

- ఆలయ అభివృద్ధికి రూ.5 కోట్లు: మంత్రి జూపల్లి కృష్ణారావు
- సోమేశ్వరున్ని దర్శించుకున్న మంత్రి

**కొలానుపాక, వెలుతురు జూన్ 22:**

ప్రముఖ పుణ్యక్షేత్రం కొలానుపాక శ్రీ సోమేశ్వర స్వామివారిని పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సోమవారం సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ చరిత్ర, పురావస్తు ప్రాధాన్యతను అధికారులు వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కొలానుపాక సోమేశ్వరాలయం తెలంగాణలో అత్యంత ప్రాచీన, చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాధాన్యం కలిగిన దేవాలయాల్లో ఒకటని పేర్కొన్నారు. ఆలయాన్ని స్మార్ట్ టెంపుల్‌గా అభివృద్ధి చేస్తామని తెలిపారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు, ఆధునిక మౌలిక వసతులు, పరిశుభ్రత, డిజిటల్ సేవలు కల్పించేలా చర్యలు చేపడతామని చెప్పారు.



2

## ప్రజా పాలన అంటే సినిమా అనుకుంటున్నారా?

- కేటీఆర్ వ్యాఖ్యలకు మంత్రి సీతక్క ఘాటు కౌంటర్
- ప్రజా పాలనను సినిమాలతో పోల్చడం సరికాదు
- బీఆర్ఎస్ పార్టీ అబద్ధాల పుట్టగా మారింది



9

- కేటీఆర్ అజెండా ప్రకారం పాలన సాగదు
- మాది పేదలు, రైతుల పక్షపాత ప్రభుత్వం

# మెట్రో నిధులపై ఢిల్లీలో...

(మొదటి పేజీ తరువాయి)

ఈ సమావేశంలో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి కూడా పాల్గొననున్నారు.మెట్రో రైలు విస్తరణ ప్రాజెక్టుకు కేంద్ర నిధుల విడుదలలో జాప్యం జరుగుతున్న నేపథ్యంలో ఈ భేటీకి ప్రాధాన్యత సంతరించుకుంది. నిధుల విడుదలను వేగవంతం చేయడంతో పాటు ప్రాజెక్టుకు సంబంధించిన పెండింగ్ అంశాలపై సమావేశంలో చర్చించే అవకాశం ఉంది.ఢిల్లీ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో సమావేశం ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని కోరినట్లు సమాచారం. ఈ సమావేశం అనంతరం మెట్రో ప్రాజెక్టుపై కీలక నిర్ణయాలు వెలువడే అవకాశం ఉందని అధికార వర్గాలు భావిస్తున్నాయి.

# కొలానుపాక సోమేశ్వ రాలయాన్ని స్మార్ట్...

(మొదటి పేజీ తరువాయి)

ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కొలానుపాక సోమేశ్వరాలయ అభివృద్ధికి రూ.5 కోట్ల నిధులు కేటాయిస్తున్నట్లు మంత్రి ప్రకటించారు. ఈ నిధులతో ఆలయ పరిసరాల అభివృద్ధి, భక్తులకు అవసరమైన సౌకర్యాల కల్పన, పర్యాటక మౌలిక వసతుల విస్తరణ చేపట్టనున్నట్లు వెల్లడించారు. కొలానుపాకను ఆధ్యాత్మిక, వారసత్వ, పర్యాటక కేంద్రంగా మరింత అభివృద్ధి చేసి దేశ విదేశాల నుంచి వచ్చే భక్తులు, పర్యాటకులను ఆకర్షించేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.కార్యక్రమంలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు, పురావస్తు శాఖ సంచాలకులు డాక్టర్ అర్జున్‌రావు, ఆలయ అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# భూపాలపల్లి రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన...

(మొదటి పేజీ తరువాయి)

వెంకన్న భార్యను ఓదార్చిన నాయకులు, ఈ విషాద సమయంలో తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం కుటుంబానికి అన్ని విధాలుగా అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు.విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన వెంకన్న సేవలను వారు స్మరించుకున్నారు. ఆయన కుటుంబానికి ప్రభుత్వం తరపున అందాల్సిన అన్ని సహాయ సహకారాలను త్వరితగతిన అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. వెంకన్న ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, ఆయన కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆకాంక్షించారు.

# తెలంగాణ పారిశ్రామిక ప్రగతికి సహకరించండి

- భవ్య స్కీం ఫేజ్ -1 లో రాష్ట్రానికి ప్రత్యేక ప్రాధాన్య మివ్వాలి
- ఏరో – డిఫెన్స్ కారిడార్, రెండు మెగా లెదర్ పార్కులను మంజూరు చేయండి

**హైదరాబాద్ వెలుతురు జూన్ 22:**

రాష్ట్ర పారిశ్రామిక ప్రగతికి, 'తెలంగాణ రైజింగ్ విజన్ 2047' లక్ష్య సాధనకు కేంద్ర ప్రభుత్వం సహకరించాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కోరారు. భవిష్యత్తు సవాళ్లను ఎదుర్కొనేలా... వికసిత్ భారత్@ 2047 లక్ష్య సాధనలో కీలక పాత్ర పోషించేలా తెలంగాణ ఇండస్ట్రియల్ 'ఎకో సిస్టం'ను అభివృద్ధి చేస్తున్నామని, అందుకు అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. సోమవారం ఢిల్లీలో కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్‌తో ఆయన ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా... రాష్ట్ర పారిశ్రామిక రంగానికి సంబంధించిన పలు అంశాలపై పీయూష్ గోయల్ కు వినతి పత్రం అందజేశారు. "జహీరాబాద్ ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీలో రూ. 8,500 కోట్ల పెట్టుబడితో గ్లోబల్ ఇన్నోవేషన్, ఆర్ అండ్ డీ సెంటర్‌ను ఏర్పాటు చేసేందుకు హ్యుందాయ్ గ్రూప్ ముందుకొచ్చింది. ఈ నేపథ్యంలో అక్కడ లాజిస్టిక్ హబ్ అభివృద్ధికి కేంద్రం చొరవ చూపాలి" అని మంత్రి శ్రీధర్ బాబు కోరారు. "భవ్య పథకం పేజ్ –1లో భాగంగా రాష్ట్రంలో 15 నుంచి 20 ప్లగ్ అండ్ ప్లే ఇండస్ట్రియల్ పార్కుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే డీపీఆర్‌లను సిద్ధం చేస్తోంది. వీటికి జూన్ – జూలై 2026 దరఖాస్తు విండోలోనే అనుమతి ఇస్తే రాష్ట్రంలో తయారీ రంగం మరింత బలోపేతం అవుతుంది" అని ఆయన కేంద్ర మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. రాష్ట్రానికి 'ఏరో – డిఫెన్స్ కారిడార్'ను మంజూరు చేయాల్సిన అవసరాన్ని మంత్రి శ్రీధర్ బాబు ప్రత్యేకంగా వివరించారు. హైదరాబాద్‌లో 'నేషనల్ డిజైన్ సెంటర్'ను ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని, ఇందుకు కేంద్రం చొరవ చూపాలన్నారు. మెగా లెదర్, ఫుట్‌వేర్ అండ్ యాక్సెసరీస్ క్లస్టర్ డెవలప్‌మెంట్ (ఎంఎల్ఎఫ్ ఏసీడీ) పథకం కింద రెండు మెగా లెదర్ పార్కులను కేటాయించాలని కోరారు. మెదక్ జిల్లా మనోహరాబాద్‌లో రూ. 2,050 కోట్లతో నేషనల్ హైవేస్ లాజిస్టిక్స్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ (ఎన్ హెచ్ఎల్ఎంఎల్) భాగస్వామ్యంతో చేపట్టిన మల్టీ మోడల్ లాజిస్టిక్స్ పార్కుకు అనుమతి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. రంగారెడ్డి జిల్లా కోహెడలో ఏర్పాటు చేస్తున్న ఇర్రేడియేషన్ ఫెసిలిటీకి 'ట్రేడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫర్ ఎక్స్‌పోర్ట్స్' పథకం కింద నిధులను కేటాయించాలన్నారు. పామ్ ఆయిల్ రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని, క్రూడ్ పామ్ ఆయిల్ పై దిగుమతి సుంకాన్ని 44 శాతానికి పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. రామగుండం ఎరువుల కర్మాగారం (ఆర్ఎఫ్ సీఎల్)పై ప్రత్యేక దృష్టి సారించాలని, అక్కడ ఉత్పత్తి అయ్యే మొత్తం యూరియాను తెలంగాణకే కేటాయించేలా ప్రత్యేక చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. గతేడాది ఎరువుల సరఫరాలో ఎదురైన అంతరాయాలను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకోవాలని మంత్రి శ్రీధర్ బాబు కోరారు.

# వర్షాకాలంలో ప్రజల భద్రతే ప్రాధాన్యంగా ఆర్ అండ్ బి అధికారులు క్షేత్ర స్థాయిలో పనిచేయాలి: మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

- వరద ముప్పు ప్రాంతాల్లో అధికారులు పూర్తి అప్రమత్తతతో పనిచేయాలి
- అత్యవసర పరిస్థితుల కోసం యంత్రాలు, సామగ్రిని ముందుగానే సిద్ధం చేయాలి
- రెడ్ అలర్ట్ సమయంలో 24 గంటల పాటు క్షేత్రస్థాయిలో అధికారులు అందుబాటులో ఉండాలి
- నష్టం జరిగిన 24 గంటల్లోపు పూర్తి నివేదికలు సమర్పించాలి
- ఎస్‌డీఆర్ఎఫ్, ఎన్‌డీఆర్ఎఫ్ నిబంధనల మేరకు నిధుల వినియోగానికి స్పష్టమైన మార్గదర్శకాలు ఉన్నాయి
- ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యామ్నాయ మార్గాలను ముందుగానే గుర్తించాలి
- వాతావరణ హెచ్చరికలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అప్రమత్తంగా వ్యవహరించాలి
- వర్షాకాలంలో ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ఆర్&బీ శాఖ పూర్తి సన్నద్ధంగా ఉంది
- రోడ్లు భవనాలు శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

**హైదరాబాద్ వెలుతురు జూన్ 22:**

రాష్ట్రంలో వర్షాకాలం సందర్భంగా ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా రహదారి రవాణా వ్యవస్థను నిరంతరం కొనసాగించడంతో పాటు, వరదల వల్ల రహదారులు, వంతెనలు, కల్వర్టులు తదితర మౌలిక సదుపాయాలకు కలిగే నష్టాన్ని తగ్గించేందుకు సమీక్ష నిర్వహించి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు..రాష్ట్ర రోడ్లు & భవనాల శాఖ ప్రత్యేక స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్ఓపీ)ను విడుదల చేసినట్లు రాష్ట్ర రోడ్లు భవనాలు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు.ఇది వరకే తాను సమీక్షించిన అంశాల మేరకు ఆర్&బీ శాఖ



ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్ జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా అన్ని స్థాయిల ఆర్ అండ్ బి అధికారులు పూర్తి అప్రమత్తతతో పనిచేయాలని మంత్రి సూచించారు. జూన్ నుంచి అక్టోబర్ వరకు వర్షాకాలం ముగిసే వరకు సూపరింటెండింగ్ ఇంజినీర్ నుంచి అసిస్టెంట్ ఇంజినీర్ వరకు అన్ని స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని ఆదేశించారు.

### అత్యవసర పరిస్థితులను..

ఎదుర్కొనేందుకు జేసీబీలు, ఎక్స్కవేటర్లు, టిప్పర్లు, డీ–వాటరింగ్ పంపులు, ఇసుక సంచులు, కంకర, తారు, ఆర్‌సీసీ సామగ్రి, హెచ్‌డీపీఈ పైపులు తదితర అవసరమైన పరికరాలు, సామగ్రిని ముందుగానే సిద్ధంగా ఉంచాలని సూచించారు.రాష్ట్రంలోని వరద ప్రభావిత ప్రాంతాలు, ముంపు ప్రమాదం ఉన్న రహదారులు, వంతెనలు, కల్వర్టులు, కట్టల బలహీన ప్రాంతాలను ముందుగానే గుర్తించి నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని మంత్రి ఆదేశించారు. ప్రతి ప్రమాదకర ప్రాంతానికి ప్రత్యామ్నాయ మార్గాలను ముందుగానే గుర్తించి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.భారత వాతావరణ శాఖ (ఐఎండీ), తెలంగాణ డిజాస్టర్ ప్రివెన్షన్ అండ్ సేఫ్టీ పోర్టల్, తెలంగాణ రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ జారీ చేసే హెచ్చరికలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అధికారులు అప్రమత్తంగా ఉండాలని,పోలీస్,రెవెన్యూ,ఇరిగేషన్,విద్యుత్ శాఖలతో సమన్వయం చేసుకోవాలని మంత్రి పేర్కొన్నారు.భారీ వర్షాలు, వరదల కారణంగా రహదారులు దెబ్బతిన్న వెంటనే హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి ప్రత్యామ్నాయ మార్గాలను అందుబాటులోకి తీసుకురావాలని, వరద నీరు తగ్గిన వెంటనే తాత్కాలిక పునరుద్ధరణ పనులు ప్రారంభించాలని ఆదేశించారు. నష్టం జరిగిన 24 గంటల్లోపు ఫోటోలు, జీపీఎస్ వివరాలతో నష్టం అంచనా నివేదికలు సిద్ధం చేసి సమర్పించాలని సూచించారు.ప్రజల ప్రాణ భద్రతకు సంబంధించిన అత్యవసర పనుల్లో ఎలాంటి ఆలస్యం జరగకుండా ఇంజినీర్లకు అప్పగించిన అధికారాల మేరకు తక్షణ చర్యలు తీసుకోవాలని మంత్రి స్పష్టం చేశారు. వరదల కారణంగా చేపట్టే పునరుద్ధరణ పనుల వ్యయాన్ని ఎస్‌డీఆర్ఎఫ్, ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఎంఎఫ్ నిబంధనల ప్రకారం నిర్వహించాలని పేర్కొన్నారు.వర్షపాతం తీవ్రతను బట్టి రాష్ట్రవ్యాప్తంగా గ్రీన్,ఎల్లో,ఆరెంజ్, రెడ్ కలర్–కోడ్ ఆధారిత హెచ్చరిక వ్యవస్థను అమలు చేయనున్నట్లు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు.

### 204మీ.మీ వర్షం నమోదైతే రెడ్ అలెర్ట్:

24 గంటల్లో 64.5 మిల్లీమీటర్ల కంటే తక్కువ వర్షపాతం నమోదైతే గ్రీన్ అలర్ట్ కింద సాధారణ పర్యవేక్షణ కొనసాగిస్తూ యంత్రాలు, సామగ్రి సిద్ధంగా ఉన్నాయో లేదో నిర్ధారించాలని సూచించారు. 64.5 నుంచి 115 మిల్లీమీటర్ల మధ్య వర్షపాతం నమోదయ్యే యెల్లో అలర్ట్ పరిస్థితుల్లో సున్నితమైన ప్రాంతాలను సహాయ కార్యనిర్వాహక ఇంజినీర్లు (AEEలు) ప్రత్యక్షంగా సందర్శించి, కాంట్రాక్టర్లు అత్యవసర సేవలకు సిద్ధంగా ఉండేలా చూడాలని ఆదేశించారు. 115 నుంచి 204 మిల్లీమీటర్ల మధ్య వర్షపాతం నమోదయ్యే ఆరెంజ్ అలర్ట్ సమయంలో AEEలు క్షేత్రస్థాయిలో నిరంతరం అందుబాటులో ఉండగా, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు (EEలు) ప్రత్యక్ష పర్యవేక్షణ చేపట్టాలని పేర్కొన్నారు. 204 మిల్లీమీటర్లకు పైగా వర్షపాతం నమోదయ్యే రెడ్ అలర్ట్ పరిస్థితుల్లో AEలు, AEEలు,EEలు 24 గంటల పాటు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండి సహాయక చర్యలను సమన్వయం చేయాలని, పరిస్థితులపై వెంటనే సూపరింటెండింగ్ ఇంజినీర్ (SE)కు,ఆపై సి.ఈ లకు సమాచారం అందించాలని మంత్రి స్పష్టం చేశారు. హైదరాబాద్ ఆర్ అండ్ బి ప్రధాన కార్యాలయంలో ఇప్పటికే ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ సెంటర్ కు ఈ వర్షాకాలంలో రోజువారీ పరిస్థితుల నివేదికలు తప్పనిసరిగా సమర్పించాలని, నష్టం జరగకపోయినా 'నిల్ రిపోర్ట్' ఇవ్వాలని ఆదేశించారు. ఫీల్డ్ సిబ్బందికి ప్రత్యేక అనుమతి లేకుండా సెలవులు మంజూరు చేయరాదని ఉన్నతాధికారులకు స్పష్టం చేశారు.ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా రహదారి రవాణా వ్యవస్థను కొనసాగించడం, వరదల వల్ల కలిగే నష్టాన్ని తగ్గించడం, అత్యవసర పరిస్థితుల్లో వేగంగా స్పందించడం ఈ ఎస్ఓపీ(SOP) ప్రధాన లక్ష్యమని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి స్పష్టం చేశారు.

# కీలక సంస్థల భద్రతలో సీఐఎస్ఎఫ్‌కు పెను సవాళ్లు

- మౌలిక సదుపాయాలను మరింత బలోపేతం చేస్తాం
- సీఐఎస్ఎఫ్‌లో మహిళల భాగస్వామ్యం ప్రశంసనీయం
- పర్యావరణ పరిరక్షణలో సీఐఎస్ఎఫ్ సేవలు భేష్
- జవాన్ల సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యతనిస్తున్నాం
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ వ్యాఖ్యలు
- న్యూఢిల్లీలోని సీజీఓ కాంప్లెక్స్‌లో సీఐఎస్ఎఫ్ నూతన ప్రధాన కార్యాలయ భవనానికి శంకుస్థాపన చేసిన కేంద్ర మంత్రి

**న్యూఢిల్లీ వెలుతురు జూన్ 22:**







ప్రస్తుతం ప్రపంచ రాజకీయాలు, భద్రతా పరిస్థితులు అత్యంత సంక్లిష్టంగా మారిన నేపథ్యంలో సీఐఎస్ఎఫ్ కు కొత్త భద్రతా సవాళ్లు ఎదురవుతున్నాయని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. ఆధునిక యుద్ధాలు కేవలం దేశ సరిహద్దులపైనే కాకుండా, ఒక దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలిచే విద్యుత్ కేంద్రాలు, ఓడరేవులు, విమానాశ్రయాలు, విద్యుత్ గ్రిడ్‌లు, వ్యూహాత్మక సంస్థలు శత్రువులకు ప్రధాన లక్ష్యాలుగా మారుతున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో దేశంలోని కీలక సంస్థల భద్రతా బాధ్యత మరింత పెరిగిందన్నారు. యుద్ధాల ముప్పులు కేవలం భౌతిక దాడులకే పరిమితం కావడం లేదని, సైబర్ దాడులు, డిజిటల్ విధ్వంసం, డ్రోన్ సాంకేతికత దుర్వినియోగం వంటి హైబ్రిడ్ ప్రమాదం పొంచి ఉందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని సీఐఎస్ఎఫ్ నిరంతరం ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుని, ఎలాంటి అత్యవసర పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని కోరారు. ఈ దిశగా మోదీ ప్రభుత్వం అవసరమైన అన్ని వనరులను సీఐఎస్ఎఫ్ అందించడానికి కట్టుబడి ఉందన్నారు.న్యూఢిల్లీలోని సీజీఓ కాంప్లెక్స్ లో రూ.75.78 కోట్ల వ్యయంతో నిర్మించనున్న కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం (CISF) నూతన ప్రధాన కార్యాలయ భవనానికి కేంద్ర మంత్రి బండి సంజయ్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఐఎస్ఎఫ్ డైరెక్టర్ జనరల్ ప్రవీర్ రంజన్, హోం మంత్రిత్వ శాఖ సీనియర్ అధికారులు, వివిధ కేంద్ర సాయుధ పోలీసు దళాల అధిపతులు, సీపీడబ్ల్యూడీ సీనియర్ ఇంజినీర్లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి చేసిన ప్రసంగంలోని ముఖ్యాంశాలు.సోమవారం రోజున కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం (CISF) చరిత్రలో ఒక మైలురాయి. న్యూఢిల్లీలోని సీజీఓ కాంప్లెక్స్‌లో సుమారు రూ.75.78 కోట్ల వ్యయంతో నిర్మించబడనున్న ఆధునిక, అన్ని సౌకర్యాలతో కూడిన 9 అంతస్తుల కొత్త సీఐఎస్ఎఫ్ కేంద్ర ప్రధాన కార్యాలయ భవనానికి శంకుస్థాపన చేసే అవకాశం నాకు లభించింది. హైదరాబాద్‌లోని జాతీయ పారిశ్రామిక భద్రతా అకాడమీ (NISA), తమిళనాడులో సుమారు రూ.60.25 కోట్ల వ్యయంతో నిర్మించిన నివాస సముదాయాలు, బ్యారక్ లు, ఆధునిక శిక్షణ సదుపాయాలను కూడా ప్రారంభించుకున్నాం. ప్రస్తుతం ప్రపంచ రాజకీయాలు, భద్రతా పరిస్థితులు అత్యంత సంక్లిష్టంగా మారాయి. ప్రపంచంలోని వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న యుద్ధాలు, భౌగోళిక రాజకీయ సంక్షోభాలు కొత్త భద్రతా సవాళ్లను మన ముందుంచుతున్నాయి. ఆధునిక యుద్ధాలు కేవలం దేశ సరిహద్దులపైనే కాకుండా, ఒక దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలిచే గ్లోబల్ సప్లై చైన్లపైన, కీలక మౌలిక సదుపాయాలపైనా దాడులు జరుగుతున్నాయి. విద్యుత్ కేంద్రాలు, ఓడరేవులు, విమానాశ్రయాలు, విద్యుత్ గ్రిడ్‌లు, వ్యూహాత్మక సంస్థలు శత్రువుల ప్రధాన లక్ష్యాలుగా మారుతున్నాయి.ఈ నేపథ్యంలో దేశంలోని కీలక సంస్థల భద్రత బాధ్యత సీఐఎస్ఎఫ్ భుజాలపై ఉండటంతో తాజా పరిణామాలతో బాధ్యత మరింత పెరిగింది. ఇప్పుడు ముప్పులు కేవలం భౌతిక దాడులకే పరిమితం కావడం లేదు. సైబర్ దాడులు, డిజిటల్ విధ్వంసం, డ్రోన్ సాంకేతికత దుర్వినియోగం వంటి హైబ్రిడ్ ముప్పులు పెరుగుతున్నాయి. అందువల్ల సీఐఎస్ఎఫ్ నిరంతరం ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుని, ఎలాంటి అత్యవసర పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి. ఈ దిశగా ప్రభుత్వం అవసరమైన అన్ని వనరులను అందించడానికి కట్టుబడి ఉంది.దేశ అవసరాలు మారుతున్న కొద్దీ సీఐఎస్ఎఫ్ బాధ్యతలు కూడా విస్తరిస్తున్నాయి. భారత బ్లూ ఎకానమీ రక్షణ కోసం, అంతర్జాతీయ ISPS కోడ్ కింద సీఐఎస్ఎఫ్‌ను గుర్తింపు పొందిన భద్రతా సంస్థ (RSO)గా కేంద్ర హోం మంత్రిత్వ శాఖ గుర్తించింది. దీని ద్వారా భవిష్యత్తులో దేశంలోని 72 ఎగుమతి–దిగుమతి ఓడరేవుల భద్రతలో సీఐఎస్ఎఫ్ కీలక పాత్ర పోషించనుంది. హైదరాబాద్‌లోని NISAలో పోర్ట్ సెక్యూరిటీకి సంబంధించిన ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు ఇప్పటికే ప్రారంభమయ్యాయి.అంతర్గత భద్రత రంగంలోనూ సీఐఎస్ఎఫ్ కొత్త బాధ్యతలను చేపట్టింది. జమ్మూ కాశ్మీర్‌లోని అత్యంత సున్నితమైన జైళ్ల భద్రతను సీఐఎస్ఎఫ్‌కు అప్పగించారు. మహాన్‌పూర్, కథువాలోని అత్యంత భద్రతా జైలు సహా అనేక జైళ్లలో సీఐఎస్ఎఫ్ అభేద్య భద్రతా వలయాన్ని ఏర్పాటు చేస్తోంది. విమానాశ్రయాల నుంచి బొగ్గు గనుల వరకు, అత్యంత సున్నితమైన జైళ్ల వరకు సీఐఎస్ఎఫ్ భద్రతకు ప్రతీకగా నిలిచింది.జవాను తన విధిని పూర్తి ఏకాగ్రతతో నిర్వర్తించాలంటే అతనికి, అతని కుటుంబానికి మంచి సౌకర్యాలు అవసరం. సీహోర్‌లో 12వ రిజర్వ్ బెటాలియన్‌కు రూ.243.73 కోట్లు, నాసిక్‌లో 11వ రిజర్వ్ బెటాలియన్‌కు రూ.195.29 కోట్లు, అసోంలో 9వ రిజర్వ్ బెటాలియన్‌కు రూ.124.73 కోట్లతో మౌలిక సదుపాయాల నిర్మాణానికి ప్రభుత్వం ఆమోదం తెలిపింది. బీహార్‌లోని కిషన్‌గంజ్‌లో కొత్త ప్రాంతీయ శిక్షణ కేంద్రం (RTC) స్థాపనకు కూడా వేగం పెరిగింది. సీఐఎస్ఎఫ్‌లో మహిళల భాగస్వామ్యం అన్ని అర్ధసైనిక దళాల్లో అత్యంత ప్రశంసనీయమైనది. హర్యానాలోని నూహ్‌లో దేశంలోనే తొలి మహిళా రిజర్వ్ బెటాలియన్ స్థాపనకు భూమి సేకరణ మరియు నిధుల ఆమోదం లభించింది. ఇందులో 1,024 మంది మహిళా సిబ్బంది పనిచేస్తారు.సీఐఎస్ఎఫ్ తన శిక్షణ వ్యవస్థను మరింత ఆధునికీకరించింది. భారత సైన్యం మరియు NSG సహకారంతో ప్రత్యేక శిక్షణ అందిస్తున్నారు. ట్రైనింగ్ ఆఫ్ ట్రైనర్స్ పేరిట 595 మంది సిబ్బందిని ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలకు ఎంపిక చేశారు. బెంగళూరులోని 10వ రిజర్వ్ బెటాలియన్‌ను మహిళా కమాండో శిక్షణ కేంద్రంగా అభివృద్ధి చేశారు. 100 గంటల శిక్షణ కార్యక్రమం: సీనియర్ అధికారులు స్వయంగా జూనియర్ అధికారులకు శిక్షణ అందిస్తున్నారు.సీఐఎస్ఎఫ్ ఆధునిక సాంకేతికతను ప్రధాన బలంగా మార్చుకుంటోంది. డ్రోన్ మరియు యాంటీ డ్రోన్ కేంద్రం: ఆర్టీసీ బెహ్రోర్‌ను డ్రోన్ టెక్నాలజీ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా అభివృద్ధి చేస్తున్నారు. 2025–26లో 2,022 మందికి పైగా సిబ్బందికి శిక్షణ ఇవ్వబడింది. వారిలో 44 మంది DGCA సర్టిఫైడ్ డ్రోన్ పైలట్లు ఉన్నారు. 5,000 సైబర్ కమాండోల లక్ష్యం: సైబర్ భద్రత కోసం ప్రత్యేక కోర్సులు ప్రారంభించారు. IITM ప్రవర్తక్, NFSU గాంధీనగర్, C-DAC హైదరాబాద్ వంటి సంస్థలతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నారు. ముఖ్యమైన సంస్థలను డ్రోన్ ముప్పుల నుంచి రక్షించడానికి సీఐఎస్ఎఫ్‌ను కేంద్ర హోం మంత్రిత్వ శాఖ నోడల్ ఏజెన్సీగా ప్రకటించింది.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వం జవాన్ల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. ఆయుష్మాన్ CAPF పథకం ద్వారా నగదు రహిత వైద్య సేవలు. CAPF e-Awas పోర్టల్ ద్వారా పారదర్శక గృహ కేటాయింపు సేవలందిస్తున్నాం. 50 శాతం GST రాయితీ ఇస్తోంది. విధి నిర్వహణలో గాయపడిన జవాన్లను సేవ నుంచి తొలగించడం లేదు. మానసిక ఆరోగ్యానికి కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నాం. e-Service Book, e-Pension పేరిట పారదర్శక డిజిటల్ సేవలందిస్తున్నాం.సీఐఎస్ఎఫ్ కేవలం పరిశ్రమలు లేదా విమానాశ్రయాల భద్రతకే పరిమితం కాలేదు. లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రశాంత ఎన్నికల నిర్వహణ బాధ్యతతోపాటు అమర్‌నాథ్ యాత్ర, కుంభమేళా వంటి కార్యక్రమాల్లో భద్రతా బాధ్యతలను సైతం నిర్వహిస్తోంది. పార్లమెంట్ భవన భద్రతలో ఆధునిక వ్యవస్థలను ఏర్పాటు చేశాం. 3,300 మందికి పైగా సిబ్బంది పార్లమెంట్ భద్రతలో విధులు నిర్వహిస్తున్నారు.ఒక క్రమశిక్షణ కలిగిన సైనికుడు ప్రకృతికి కూడా రక్షకుడే. 2025లో సీఐఎస్ఎఫ్ 5.61 లక్షలకు పైగా మొక్కలు నాటడం అభినందనీయం. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా 60,000 మొక్కలు నాటే ప్రత్యేక కార్యక్రమం నిర్వహించడం స్వాగతించదగ్గ పరిణామం. వర్షపు నీటి సంరక్షణ, వైట్ రూఫ్ కోటింగ్ వంటి పర్యావరణ అనుకూల పద్ధతుల అమలుతోపాటు జవాన్ మెస్‌లలో 30 శాతానికిపైకు పైగా చిరుధాన్యాల వినియోగిస్తుండటం అభినందనీయం. శాస్త్రీయ తేనెటీగల పెంపకం ద్వారా 1,026 కిలోలకుపైగా తేనె ఉత్పత్తి చేయడం సంతోషకరం.విమానాశ్రయాలు, ఢిల్లీ మెట్రోలో సీఐఎస్ఎఫ్ జవాన్ల మర్యాదపూర్వక ప్రవర్తన ప్రజల హృదయాలను గెలుచుకుంటోంది. దేశ ఆర్థిక వ్యవస్థలో కీలకమైన పరిశ్రమలు, విద్యుత్ కేంద్రాలు, గనులతోపాటు ముఖ్యమైన సంస్థల భద్రత సీఐఎస్ఎఫ్ చేతుల్లో సురక్షితంగా ఉంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో భారత్ "విజన్ 2047" దిశగా ముందుకు సాగుతోంది. అభివృద్ధి చెందిన భారత నిర్మాణంలో సీఐఎస్ఎఫ్ "ఆర్థిక సైనికులు"గా కీలక పాత్ర పోషిస్తోంది.ఈ నేపథ్యంలో సీఐఎస్ఎఫ్ ఆధునికీకరణ, మౌలిక సదుపాయాలు, సంక్షేమ కార్యక్రమాలకు మోదీ ప్రభుత్వం నిరంతర మద్దతు అందిస్తాం. సీఐఎస్ఎఫ్‌ను ప్రపంచంలోనే అత్యాధునిక భద్రతా దళంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన వనరులను సమకూరుస్తాం. ఈ రోజు శంకుస్థాపన చేసిన ఈ భవనాలు మీ భవిష్యత్తుకు బలమైన పునాది కాబోతున్నాయి.

# ఖమ్మం జిల్లా మహిళా కాంగ్రెస్ విస్తృత స్థాయి సమావేశం విజయవంతం

- కేంద్ర బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలపై సమరభేరి
- ఇంధన, గ్యాస్ ధరలు తగ్గేవరకు పోరాటం ఆగదు: శ్రీజ్యోతి భీమ్ భరత్

**ఖమ్మం వెలుతురు జూన్ 22:**




ఖమ్మం జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీమతి సౌజన్య జిల్లా ఇంచార్జి శ్రీమతి శైలజా రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ఖమ్మం లో నిర్వహించిన విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశం విజయవంతమైందని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీమతి జ్యోతి భీమ్ భరత్ తెలిపారు.ఈ సమావేశానికి తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి శ్రీ మల్లు భట్టి విక్రమార్క గారు, తెలంగాణ ప్రదేశ్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీమతి ఎర్రవెల్లి స్వర్ణ గారు ముఖ్య అతిథులుగా హాజరై మహిళా కాంగ్రెస్ కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారని ఆమె పేర్కొన్నారు.ఈ సందర్భంగా శ్రీమతి శ్రీజ్యోతి భీమ్ భరత్ మాట్లాడుతూ, "ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క గారు సూచించినట్లుగా, కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రయోజనాలను దెబ్బతీస్తున్న విధానాలను, ముఖ్యంగా ఇంధన, గ్యాస్ ధరల పెంపుతో సామాన్య, మధ్య తరగతి కుటుంబాలు పడుతున్న కష్టాలను ప్రతి గడపకూ తీసుకెళ్లే బాధ్యతను మహిళా కాంగ్రెస్ తీసుకుంటుంది. కాంగ్రెస్ పార్టీ చేస్తున్న పోరాటాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్తాం" అని అన్నారు."తెలంగాణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రవెల్లి స్వర్ణ గారు చెప్పినట్లుగా, కేంద్ర బీజేపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎదుర్కొనే పోరాటంలో మహిళా కాంగ్రెస్ భాగస్వామ్యం కీలకం. మహిళా రిజర్వేషన్ బిల్లు అమలు విషయంలో బీజేపీ చేస్తున్న కుట్రలను ప్రతి మహిళా కాంగ్రెస్ కార్యకర్త సమర్థవంతంగా తిప్పికొట్టేలా చైతన్యం చేస్తాం" అని ఆమె స్పష్టం చేశారు."పెరిగిన ఇంధన, గ్యాస్ ధరలు తగ్గేవరకు దేశవ్యాప్తంగా జరిగే పోరాటంలో తెలంగాణ మహిళా కాంగ్రెస్ తన వంతు బాధ్యతను సమర్థవంతంగా పోషిస్తుంది. బీజేపీ వైఫల్యాలను ఇంటింటికీ తీసుకెళ్లి ప్రజలను జాగృతం చేస్తాం. ఇది మా అందరి సంకల్పం" అని శ్రీమతి శ్రీజ్యోతి భీమ్ భరత్ పేర్కొన్నారు.ఈ సమావేశంలో ఖమ్మం జిల్లా మహిళా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని పోరాటానికి సిద్ధమయ్యారని ఆమె తెలిపారు.ఈ కార్యక్రమం లో ఖమ్మం జిల్లా వ్యాప్తంగా ఉన్న వందలాది మంది మహిళా కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నారు.

# కేజీకేఎస్ ఎంవీ రమణకు మాతృవియోగం: అంతిమ యాత్రలో పాల్గొన్న గోపా డివిజన్ అధ్యక్షులు సమ్మిగౌడ్

- తల్లిని కోల్పోవడం జీవితంలో అత్యంత విషాదకరమైన క్షణం
- సమ్మిగౌడ్ చిలువేరు
- కమలమ్మ పవిత్ర ఆత్మ కి శాంతి చేకూరాలని రాష్ట్ర, జిల్లా ప్రముఖుల నివాళి

**డోర్నకల్ వెలుతురు జూన్ 22:**



మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం గొల్లచర్ల గ్రామంలో కేజీకేఎస్ కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు, సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, రాష్ట్ర అన్ని కుల సంఘాల కన్వీనర్ మేకపోతుల వెంకటరమణ (ఎంవీ రమణ) మాతృమూర్తి మేకపోతుల కమలమ్మ అంత్యక్రియలు ఆమె సొంత భూమిలో కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో విషాద వాతావరణంలో నిర్వహించారు. సుప్రజ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కమలమ్మ కన్నుమూసిన విషయం తెలిసిన వెంటనే మహబూబాబాద్ గోపా డివిజన్ అధ్యక్షులు సమ్మయ్య గౌడ్ చిలువేరు వారి కుటుంబంతో ఉన్న అనుభందాన్ని గుర్తుచేసుకొని ఆవేదధన వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.సోమవారం రోజున ఉదయం గొల్లచర్ల చేరుకొని ఎంవీ రమణ తల్లీ కమలమ్మ గారి పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళి అర్పించిన సమ్మిగౌడ్ వారి పవిత్ర ఆత్మ కు శాంతి చేకూరాలని వేడుకున్నారు ..ఈ సందర్భంగా మహబూబాబాద్ గోపా డివిజన్ అధ్యక్షులు సమ్మయ్య గౌడ్ మాట్లాడుతూ జన్మనిచ్చి, పెంచి, జీవితానికి మార్గదర్శకురాలైన తల్లిని కోల్పోవడం ఏ బిడ్డకైనా భరించలేని వేదన అని పేర్కొన్నారు. తల్లి ప్రేమ, త్యాగం, ఆప్యాయతలకు ప్రపంచంలో ప్రత్యామ్నాయం లేదని, మాతృమూర్తి లేని లోటు జీవితాంతం వెంటాడుతుందని అన్నారు. కుటుంబాన్ని ఏకతాటిపై నిలబెట్టి పిల్లల భవిష్యత్తు కోసం తన జీవితాన్నే అంకితం చేసిన కమలమ్మ మరణం అత్యంత బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామస్థాయి నుండి సోమవారం రోజున రాష్ట్ర స్థాయి వరకు ఎంవీ రమణ ఎదుగుదల లో తన తల్లి గారి తోడ్పాటు ఎంతో ఉందని అభిప్రాయపడ్డారు..ఈ కష్ట సమయంలో కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని కోరారు.ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, సుప్రజ హాస్పిటల్ ఎండీ విజయ్ కుమార్ గౌడ్, కేజీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు, రాష్ట్ర గౌడ సంఘాల అధ్యక్షులు ఐలి వెంకన్న, విజయ కుమార్, గోపా రాష్ట్ర అధ్యక్షులు సాయన్న గౌడ్, గోపా జిల్లా అధ్యక్షులు కుర్ర శ్రీనివాస్ గౌడ్, బెల్లంకొండ శ్రీనివాస్ గౌడ్, సమ్మెట వెంకన్న, గొర్రె వెంకన్న, కేజీకేఎస్ జిల్లా అధ్యక్షులు గౌని వెంకన్న, యమగాని వెంకన్న, బబ్బురు ఉప్పలయ్య, మోడెం వెంకటేశ్వర్లు, రాష్ట్రంలోని అన్ని జిల్లాల అధ్యక్షులు, కార్యదర్శులు, వివిధ కుల సంఘాల రాష్ట్ర, జిల్లా నాయకులు, మండల అధ్యక్షులు, కార్యదర్శులు, కేజీకేఎస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొని మాతృమూర్తి కమలమ్మకు నివాళులు అర్పించారు.

# ఫణిగిరి సమగ్రాభివృద్ధికి రూ.5 కోట్లు

- ఫణిగిరి, గాజులబండ బౌద్ధ కట్టడాల పరిరక్షణ పనులకు మంత్రి జూపల్లి శంకుస్థాపన

**ఫణిగిరి, వెలుతురు జూన్ 22 :**





తెలంగాణలోని ప్రాచీన బౌద్ధ వారసత్వ సంపద పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు సూర్యాపేట జిల్లా నాగారం మండలం ఫణిగిరి, గాజులబండ బౌద్ధ క్షేత్రాల్లో పరిరక్షణ, పునరుద్ధరణ పనులకు ఎమ్మెల్యే మందుల సామేల్ తో కలిసి మంత్రి జూపల్లి కృష్ణారావు సోమవారం శంకుస్థాపన చేశారు. తెలంగాణ జెన్కో (వైటీపీఎస్) సీఎస్ఆర్ నిధులతో ఫణిగిరి బౌద్ధ కట్టడాల పరిరక్షణకు రూ.1.60 కోట్లు, గాజులబండ కట్టడాల సంరక్షణకు రూ.23 లక్షలు వెచ్చించనున్నారు.ఫణిగిరి దక్షిణ భారతదేశంలోనే అత్యంత ప్రాముఖ్యత కలిగిన బౌద్ధ వారసత్వ కేంద్రాల్లో ఒకటని మంత్రి పేర్కొన్నారు. బౌద్ధ ధర్మం శాంతి, అహింస, మానవతా విలువలకు ప్రతీకగా నిలిచిందని, అలాంటి చారిత్రక వారసత్వాన్ని భావితరాలకు అందించడం ప్రభుత్వ బాధ్యత అని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చారిత్రక, పురావస్తు, వారసత్వ సంపద పరిరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు.

## బౌద్ధ పర్యాటక పటంలో తెలంగాణకు మరింత గుర్తింపు

ఫణిగిరి, గాజులబండ వంటి బౌద్ధ క్షేత్రాల అభివృద్ధి ద్వారా తెలంగాణను జాతీయ, అంతర్జాతీయ బౌద్ధ పర్యాటక పటంలో మరింత ప్రముఖంగా నిలిపేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. తవ్వకాలలో వెలుగులోకి వచ్చిన శిల్పాలు, శాసనాలు, నాణేలు తెలంగాణ చరిత్ర వైభవాన్ని ప్రపంచానికి చాటుతున్నాయని అన్నారు. పర్యాటకుల రాక పెరగడం ద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు, గ్రామీణ ఆర్థికాభివృద్ధికి కొత్త మార్గాలు తెరుచుకుంటాయని పేర్కొన్నారు.ఎమ్మెల్యే సామేల్ విజ్ఞప్తిపై స్పందించిన మంత్రి జూపల్లి కృష్ణారావు.. ఫణిగిరి బౌద్ధ క్షేత్ర సమగ్ర అభివృద్ధికి రూ.5 కోట్ల నిధులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ నిధులతో ప్రధాన రహదారి నుంచి క్షేత్రానికి చేరుకునే అప్రోచ్ రోడ్డు అభివృద్ధి, కొండపైకి వెళ్లే మెట్లదారి నిర్మాణం, పర్యాటక మౌలిక సదుపాయాల కల్పన, సందర్శకుల వసతుల మెరుగుదల చేపట్టనున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, ఎస్పీ నరసింహ, పురావస్తు శాఖ డైరెక్టర్ అర్జున రావు, డిప్యూటీ డైరెక్టర్లు పగడం నాగరాజు, నర్సింగ్ నాయక్, ఓఎస్డీ రాజు, అసిస్టెంట్ డైరెక్టర్లు నాగలక్ష్మి , మల్లు నాయక్, ఫణిగిరి, గాజులబండ గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# వరంగల్ వెస్ట్‌లో కాంగ్రెస్ బీఎల్ఏ సమావేశం

- బూత్ స్థాయి సంస్థాగత బలోపేతమే లక్ష్యం: టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్

**వరంగల్ వెలుతురు జూన్ 22:**




వరంగల్ వెస్ట్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బూత్ స్థాయి సంస్థాగత బలోపేతం, సభ్యత్వ విస్తరణ, పార్టీ కార్యక్రమాల సమర్థ అమలే లక్ష్యంగా బీఎల్ఏ సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి టీపీసీసీ అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, ఏఐసీసీ తెలంగాణ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పార్టీ ప్రజాప్రతినిధులు, జిల్లా నాయకులు, బ్లాక్ కాంగ్రెస్ కమిటీ ప్రతినిధులు, బూత్ స్థాయి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ వరంగల్ నగరంతో తనకు ప్రత్యేకమైన అనుబంధం ఉందని పేర్కొన్నారు. దేశంలో ప్రజాస్వామ్య విలువలు ప్రమాదంలో పడుతున్నాయని, ఓటు హక్కును బలహీనపరిచే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.ఎస్ఐఆర్ (Special Intensive Revision) పేరుతో అర్హులైన ఓటర్లను జాబితాల నుంచి తొలగించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. గతంలో కూడా ఓటర్ల జాబితాల సవరణలు జరిగినప్పటికీ ప్రస్తుతం చేపడుతున్న ప్రక్రియ భిన్నంగా ఉందని, ప్రజాస్వామ్యంలో ఓటు హక్కుకు మించిన హక్కు మరొకటి లేదని స్పష్టం చేశారు.ఎన్నికల సంఘం స్వతంత్ర సంస్థగా వ్యవహరించాల్సిన సమయంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కనుసన్నల్లో పనిచేస్తోందని విమర్శించారు. కాంగ్రెస్‌కు మద్దతుగా ఉండే ముస్లింలు, ఎస్సీ, ఎస్టీ, గిరిజన వర్గాల ఓటర్లను లక్ష్యంగా చేసుకుని తొలగించే కుట్ర జరుగుతోందని ఆరోపించారు.గత ఎన్నికల్లో లక్షలాది ఓట్లు తొలగించడం వల్ల ప్రజాస్వామ్యానికి తీవ్ర నష్టం జరిగిందని పేర్కొన్న ఆయన, ప్రజల తీర్పును ప్రభావితం చేసే చర్యలను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని చెప్పారు. మీనాక్షి నటరాజన్‌పై తెలంగాణలో ఎలాంటి కేసులు లేదా ఫిర్యాదులు లేకపోయినా నామినేషన్ దశలోనే అన్యాయంగా తిరస్కరించారని విమర్శించారు.గాంధేయ సిద్ధాంతాలను అనుసరించే నాయకులను లక్ష్యంగా చేసుకోవడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదని, అధికారంలో ఉన్నవారు శాశ్వతం కాదని చరిత్ర ఎన్నోసార్లు నిరూపించిందన్నారు. ప్రజా ఆగ్రహానికి గురైనప్పుడు ఎంతటి శక్తివంతమైన ప్రభుత్వమైనా ఓటమి తప్పదని మహేష్ కుమార్ గౌడ్ వ్యాఖ్యానించారు.బూత్ స్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేసి ప్రజల సమస్యలపై కాంగ్రెస్ శ్రేణులు సమిష్టిగా పోరాడాలని ఆయన కార్యకర్తలకు పిలుపునిచ్చారు.



# మత్తు వదలండి మైదానాలు చేరండి: రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి

**మహబూబ్ నగర్ వెలుతురు జూన్ 22:**




మత్తు వదలండి... మైదానాలు చేరండి అని యువతకు పిలుపునిచ్చారు రాష్ట్ర క్రీడా, పశుసంవర్ధక శాఖ, పాడి పరిశ్రమాభివృద్ధి,మత్స్య,యువజన సర్వీసుల శాఖా మంత్రి వాకిటి శ్రీహరి . మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో ఇండోర్ స్టేడియం గ్రౌండ్ మైదానంలో తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో 12 కోట్ల 53 లక్షల రూపాయల వ్యయంతో పలు ఆధునిక క్రీడా సదుపాయాల నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ.పాలమూరు బిడ్డ అయిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి క్రీడలకు అత్యంత ప్రాధాన్యత నిస్తూ క్రీడా కారులకు అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తున్నారని తెలిపారు .అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా నిర్మించనున్న 400 మీటర్ల 8 లైన్ల సింథటిక్ అథ్లెటిక్స్ ట్రాక్ ద్వారా జిల్లాలోని యువ క్రీడాకారులకు ఉన్నత స్థాయి శిక్షణ అందే అవకాశం కలుగుతుందని అన్నారు.క్రీడలు కేవలం వినోదం మాత్రమే కాకుండా జీవన శైలిని మార్చే శక్తివంతమైన సాధనం అని ఆయన అన్నారు. ప్రతి యువకుడు క్రీడలపై ఆసక్తి పెంపొందించుకుని క్రమ శిక్షణతో ముందుకు సాగాలన్నారు.ఉమ్మడి పాలమూరు జిల్లాలో వివిధ నియోజకవర్గాల్లో ఇప్పటికే సుమారు 80 కోట్ల రూపాయల నిధులు కేటాయించినట్లు తెలిపారు. క్రీడా రంగ అభివృద్ధి కోసం అవసరమైతే వంద కోట్ల రూపాయల వరకు ఖర్చు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి స్పష్టం చేశారు. యువత టైమ్‌పాస్‌గా కాకుండా క్రీడలను సీరియస్‌గా తీసుకుని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరచాలని పిలుపునిచ్చారు. గ్రామ స్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయి వరకు క్రీడాకారులను తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. జిల్లాలో స్విమ్మింగ్ పూల్ ను స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలోనే నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. స్పోర్ట్స్ అసోసియేషన్లు మరింత చురుకుగా పనిచేసి గ్రామ స్థాయి నుండి యువతలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయాలని సూచించారు. క్రీడా ప్రాజెక్టులకు గ్రీన్ ఛానల్ ద్వారా త్వరితగతిన అనుమతులు ఇచ్చి పనులను వేగవంతం చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు. లక్షలాది యువతకు క్రీడల ద్వారా అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ ధ్యేయమని ఆయన పేర్కొన్నారు.ఈ నెల 17 నుండి 26 వరకు నిర్వహించనున్న నషా ముక్త్ భారత్ సప్తాహ్ సందర్భంగా మాదక ద్రవ్యాల కు దూరంగా ఉండాలని మంత్రి విద్యార్థుల చేత మంత్రి ప్రతిజ్ఞ చేయించారు .మాదక ద్రవ్యాల నిర్మూలన పై పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మంత్రి తో పాటు ఎమ్మెల్యే ఎన్నం శ్రీనివాసరెడ్డి, తెలంగాణ ఒలింపిక్ సంఘం అధ్యక్షులు జితేందర్ రెడ్డి, సాట్స్ చైర్మన్ శివసేనా రెడ్డి, జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, జిల్లా ఎస్.పి శ్రీమతి డి.జానకి, మేయర్ శ్రీమతి గుమ్మాల మమత శ్రీనివాస్, రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పోరేషన్ చైర్మన్ ఓబేదుల్లా కొత్వాల్, ఒలింపిక్ సంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేష్,అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ర్యాంకులతో సంబంధం లేకుండా బీసీ విద్యార్థులందరికీ ఫీజు రీయింబర్స్మెంట్ ఇవ్వాలి

- పదివేల లోపు ర్యాంక్ నిబంధనను ఎత్తివేయాలి
- బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్

**హైదరాబాద్ వెలుతురు జూన్ 22:**



ర్యాంకులతో సంబంధం లేకుండా బీసీ విద్యార్థులందరికీ ఫీజు రీయంబర్స్మెంట్ ఇవ్వాలని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ డిమాండ్ చేశారూ.రాష్ట్ర ప్రభుత్వం ఎవరికీ లేని నిబంధనను కేవలం బీసీలకే పెట్టడం సరికాదన్నారు.పదివేల ర్యాంక్ నిబంధనను ఎత్తివేయాలని దీనివల్ల పేరొందిన కళాశాలలో బీసీలు చేరలేకపోతున్నారని అన్నారు. ఇంజనీరింగ్ కౌన్సిలింగ్ ప్రారంభమైనందున ర్యాంకులతో సంబంధం లేకుండా విద్యార్థులందరికీ పూర్తి ఫీజు చెల్లించాలని లింగంగౌడ్ కోరారు.

# ఇసుక కొరత పెరిగే అవకాశం ముందస్తుగా బుక్ చేసుకోవాలి

- గ్రేటర్ హైదరాబాద్ ఇసుక లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సురిగి నర్సింహా గౌడ్
- కాళేశ్వరం నుంచి ఐదు రోజులకు ఒక ట్రిప్ మాత్రమే సరఫరా
- వర్షాకాలం నేపథ్యంలో ధరలు పెరిగే అవకాశమని ఇసుక లారీ ఓనర్స్ అసోసియేషన్ హెచ్చరిక

**హైదరాబాద్ వెలుతురు జూన్ 22:**



కాళేశ్వరం నుంచి ఇసుక సరఫరా ప్రస్తుతం ఐదు రోజులకు ఒక ట్రిప్ మాత్రమే నిర్వహించబడుతున్నందున రానున్న రోజుల్లో ఇసుక కొరత మరింత పెరిగే అవకాశం ఉందని గ్రేటర్ హైదరాబాద్ ఇసుక లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సురిగి నర్సింహా గౌడ్ తెలిపారు. సోమవారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు.ప్రస్తుతం సరఫరాలో ఏర్పడుతున్న అంతరాయం కారణంగా ఇసుక ధరలు కూడా పెరిగే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. మరోవైపు వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో ఇసుక రవాణా, సరఫరాపై మరింత ప్రభావం పడే అవకాశం ఉందని తెలిపారు.ఈ నేపథ్యంలో ఇసుక అవసరం ఉన్న వినియోగదారులు భవిష్యత్తులో ఇబ్బందులు ఎదురుకాకుండా ముందుగానే తమ అవసరాలకు అనుగుణంగా ఇసుకను బుక్ చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

# రాహుల్ గాంధీ తన అమ్మమ్మ దేశం నుండి నేర్చుకోవాలి

ఏ దేశ పౌరుకైనా నాయకుడికైనా ఆదేశ గౌరవం ఆత్మ అభిమానాన్ని కాపాడుకోవడంలో ముందుండాలి. దేశంపై దేశ అధినేతలపై పరాయి దేశస్థులు విమర్శలు చేసిన తరుణంలో తమ రాజకీయ వైరుధ్యాలని పక్కనపెట్టి దేశ గౌరవం కోసం నిలబడటం నిజమైన దేశభక్తులు చేసే పని, దేశ ప్రజలు కూడా ఇటువంటి వైఖరిని సమర్ధిస్తారు ఆకాంక్షిస్తారు.

లోక్ సభ ప్రధాన ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ పార్టీ యువరాజు శ్రీ రాహుల్ గాంధీ గారి ప్రవర్తన ఇందుకు భిన్నంగా ఉండటం మనం ఇటీవల కాలంలో ఎక్కువగా చూస్తున్నాం. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ గారు ఇటీవల కాలంలో భారత దేశ ఆర్థిక వ్యవస్థ గురించి మాట్లాడుతూ "ఇండియా ఇస్ డెడ్ ఎకానమీ" అన్నారు. దీనికి రాహుల్ గాంధీ గారు వంటపాడుతూ అంతేగా అంతేగా అంటూ తాళం వేశారు. ట్రంప్ గారు చెబుతోంది నిజమంటూ వత్తాసు పలికారు. కానీ వాస్తవానికి అంతర్జాతీయ సంస్థలైన ప్రపంచ బ్యాంక్, ఇంటర్నేషనల్ మోనిటరీ ఫండ్ భారతదేశ ఆర్థిక వ్యవస్థ పరిపుష్టంగా ఉందని వృద్ధిరేటు అన్ని దేశాల కన్నా గణనీయంగా ఉందని తేల్చి చెప్పాయి. గత సంవత్సరం పాకిస్తాన్తో జరిగిన ఆపరేషన్ సింధూర్ యుద్ధం తన వల్ల ఆగింది అంటూ డోనాల్డ్ ట్రంప్ గారు అత్యుత్సాహం ప్రదర్శిస్తూ చేసిన వ్యాఖ్యలకి రాహుల్ గాంధీ గారు మద్దతు పలికి మన భారత సైన్యం యొక్క ధీరత్వాన్ని తక్కువ చేసే విధంగా మాట్లాడారు. ఇటువంటి అనేకమైన ఘటనలు మనం కొన్ని సంవత్సరాలుగా రాహుల్ గాంధీ గారి వైఖరిలో చూస్తున్నాము.

రాహుల్ గాంధీ గారి తల్లి గారు సోనియా గాంధీ గారి పుట్టిన దేశమైన ఇటలీలో పరిస్థితులు వేరేగా ఉండటం కొసమెరుపు. ఇటీవల ఫ్రాన్స్ లో ముగిసిన జి 7 దేశాల సదస్సులో అమెరికా అధ్యక్షులు డోనాల్డ్ ట్రంప్ గారు పాల్గొన్నారు. అయితే వారు ఒక పాత్రికేయుడు తో మాట్లాడుతూ ఇటలీ ప్రధానమంత్రి జార్జియా మిలోని నాతో ఛాయాచిత్రం కోసం వేడుకున్నారని, దానివల్ల తనకి ప్రపంచవ్యాప్తంగా ఆదరణ పెరుగుతుందని బ్రతిమిలా డారని అందుకే ఫోటో ఇచ్చానని చెప్పారు. దీనికి జార్జియా మెలోని గారు స్పందిస్తూ తాను గాని తన దేశం ఇటలీ గాని ఇటువంటి చౌకబారు పనులు చేయమని డోనాల్డ్ ట్రంప్ గారిని తీవ్రంగా మంతలిస్తూ వీడియోని విడుదల చేశారు. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ గారి ఇటువంటి దిగజారుడు వైఖరి కారణంగానే అమెరికా మిత్రపక్షాలు దూరమవుతున్నాయని ఇది ఆ దేశ ప్రజలకు గాని ప్రభుత్వానికి గాని మంచిది కాదని హితో పలికారు.

ఇక్కడ గుర్తించవలసిన గొప్ప విషయం ఏంటంటే ఇటలీ దేశంలోని ప్రధాన ప్రతిపక్ష నేతలు ఫిలిప్పో సెన్సి, గాసిప్పి కొంటే తదితరులు అందరూ ఒక తాటి మీదకు వచ్చి డోనాల్డ్ ట్రంప్ గారు తమ దేశంపై తమ దేశ ప్రధానిపై చేస్తున్న దాడిని విమర్శలని ముక్తకంఠంతో ఖండించారు. ఇటలీ దేశ ప్రధాని జార్జియా మెలోడీతో మాకు రాజకీయ విభేదాలు ఉన్నప్పటికీ పరాయి దేశ నేతలు మా దేశ ప్రధాని గాని మా దేశ ప్రజలను గాని విమర్శిస్తే సహించేది లేదని హెచ్చరించారు. రోనాల్డ్ ట్రంప్ గారి వ్యాఖ్యలు ఈ విధంగానే కొనసాగితే భవిష్యత్తులో అమెరికా ఇటలీ మధ్య సంబంధాలపై పునర్విచారణ చేయవలసి వస్తుందని మాట్లాడారు.

రాహుల్ గాంధీ గారిలో ఇటలీ రక్తం ఉన్నప్పటికీ ఇటలీ దేశ ప్రజల నేతల దేశభక్తి వచ్చినట్టు లేదు. పరాయి దేశాలకు వెళ్లి భారతదేశం గురించి తక్కువగా మాట్లాడటం, పరాయి దేశాలు వాళ్ళు భారతదేశాన్ని తక్కువ చేసి మాట్లాడితే వారికి మద్దతుగా నిలవడం రాహుల్ గాంధీ గారికి పరిపాటయిపోయింది. కనీసం ఇప్పటికన్నా తన అమ్మమ్మ దేశమైన ఇటలీ నుండి కొంతైనా దేశభక్తిని అలవర్చుకొని తన పందాన్ని మార్చుకొని సాగుతారని ఆశిద్దాం.



పెద్దిరెడ్డి రవికిరణ్,
బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి,
ఆంధ్రప్రదేశ్

## సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారంలో వేగం పెంచాలి

(మొదటి పేజీ తరువాయి)

సోమవారం నాడు రెవెన్యూ అధికారులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో మంత్రి గారు మాట్లాడుతూ భూభారతి చట్టం అమల్లోకి వచ్చిన 2025 ఏప్రిల్ 14 నుంచి ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 3.65 లక్షల పాస్‌బుక్‌లు జారీ చేసినట్లు వెల్లడించారు. గతంలో పాస్‌బుక్ కోసం రైతులు నెలల తరబడి రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉండేదని, ఇప్పుడు ఆ పరిస్థితులకు ముగింపు పలుకుతూ రైతు దరఖాస్తు చేసిన వెంటనే పాస్‌బుక్ అందే విధంగా వ్యవస్థను పారదర్శకంగా, వేగవంతంగా రూపొందించామని చెప్పారు. రైతు ఒక్కసారి దరఖాస్తు చేస్తే తిరిగి కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా సేవలు అందేలా చూడాలని స్పష్టం చేశారు. భూభారతి చట్టంలో పేర్కొన్న విధంగా వ్యవసాయ భూముల క్రయవిక్రయాల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా రిజిస్ట్రేషన్ సమయంలో సర్వే మ్యాప్ జత చేసే నిబంధనను ప్రస్తుతం ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్న ఐదు మండలాల్లో పరిస్థితులను మంత్రిగారు సమీక్షించారు. ఈ విధానం విజయవంతంగా కొనసాగుతోందని అధికారులు వివరించగా, అక్కడి అనుభవాలు, సమస్యలను పరిగణనలోకి తీసుకుని త్వరలోనే రెండో దశలో ప్రతి జిల్లాకు ఒక మండలంలో అమలు చేసేలా కార్యాచరణ సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారంలో మరింత వేగం పెంచాలని మంత్రి గారు ఆదేశించారు. మొత్తం 9.25 లక్షల సాదాబైనామా దరఖాస్తులలో, ఇప్పటివరకు ఆరు లక్షల దరఖాస్తుదారులకు నోటీసులు జారీ చేసినట్లు అధికారులు తెలియజేశారు. మిగిలిన దరఖాస్తులకు వచ్చే 15 రోజుల్లో నోటీసులు జారీ పూర్తి చేయాలని, ఆ తర్వాత 30 రోజుల గడువు ముగిసిన వెంటనే అర్హులైన దరఖాస్తులను పరిష్కరించే విధంగా ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు.గత ప్రభుత్వం సాదాబైనామా అంశాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. దరఖాస్తులు స్వీకరించినప్పటికీ వాటి పరిష్కారానికి 2020 ఆర్వోఆర్ చట్టంలో సరైన నిబంధనలు లేకపోవడం వల్ల వేలాది మంది రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నారని అన్నారు. కానీ గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు తమ ప్రభుత్వం నిబంధనలను సవరించి దరఖాస్తుదారులకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టిందని తెలిపారు.

## మునుగోడు మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా భీమనపల్లి సైదులు పునర్నియామకం

- **వరుసగా రెండోసారి బాధ్యతలు అప్పగింత**
- **ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్‌గోపాల్ రెడ్డి ఆశీస్సులతో నియామకం**



**మునుగోడు వెలుతురు జూన్ 22:**

మునుగోడు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా భీమనపల్లి సైదులు వరుసగా రెండోసారి నియమితులయ్యారు. మునుగోడు అభివృద్ధి ప్రదాత, ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్‌గోపాల్ రెడ్డి ఆశీస్సులతో ఆయనకు ఈ బాధ్యతలు అప్పగించారు.ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు భీమనపల్లి సైదులుకు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన నాయకత్వంలో మండలంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం కావడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. పార్టీ బలోపేతం, ప్రజాసేవే లక్ష్యంగా పని చేస్తానని భీమనపల్లి సైదులు పేర్కొన్నారు.

# బ్రిటన్ ప్రధాని రాజీనామా..



- **మిత్రుడి నియామక వివాదం.. స్టార్మర్‌పై పెరిగిన ఒత్తిడి**

**బ్రిటన్ వెలుతురు జూన్ 22:**

అంతర్జాతీయ రాజకీయ వేదికపై ఒక అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. యునైటెడ్ కింగ్‌డమ్ ప్రధానమంత్రి కీర్ స్టార్మర్ తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించి ప్రపంచవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించారు. ప్రధాని పదవితో పాటు అధికార లేబర్ పార్టీ నాయకత్వ బాధ్యతల నుంచి కూడా తాను తప్పుకుంటున్నట్లు ఆయన స్పష్టం చేశారు. తన సొంత పార్టీ సభ్యుల నమ్మకాన్ని, అభిప్రాయాలను గౌరవిస్తూ, దేశ ప్రయోజనాల కోసమే తాను ఈ కఠిన నిర్ణయం తీసుకున్నట్లు స్టార్మర్ వెల్లడించారు. అయితే, బ్రిటన్‌కు కొత్త ప్రధాని ఎన్నిక పూర్తయ్యే వరకు తాను ఆపద్ధర్మ ప్రధానిగా బాధ్యతలు నిర్వహిస్తానని ఆయన పేర్కొన్నారు.తాను గతంలో లేబర్ పార్టీ నాయకత్వ బాధ్యతలను చేపట్టినప్పటి పరిస్థితులను కీర్ స్టార్మర్ ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ఆ సమయంలో పార్టీ రాజకీయంగా, ఆర్థికంగా, నైతికంగా పూర్తిగా దివాళా తీసిన స్థితిలో ఉందని ఆయన వ్యాఖ్యానించారు. ముఖ్యంగా పార్టీలో వేళ్లూనుకుపోయిన యూదు వ్యతిరేక విషబీజాలను సమూలంగా పారద్రోలి, పార్టీని పూర్తిగా ప్రక్షాళన చేశానని చెప్పారు. దేశ రక్షణ, జాతీయ భద్రత వంటి అత్యంత కీలకమైన అంశాలపై బ్రిటిష్ ప్రజల్లో లేబర్ పార్టీ పట్ల తిరిగి గట్టి నమ్మకాన్ని కల్పించగలిగానని ఆయన వివరించారు.

10 డౌనింగ్ స్ట్రీట్ (ప్రధాని అధికార నివాసం) వెలుపల కీర్ స్టార్మర్ భావోద్వేగంగా మాట్లాడారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో లేబర్ పార్టీని విజయతీరాలకు చేర్చడానికి, ముందుకు నడిపించడానికి ఎవరు అత్యంత సమర్థులనే ప్రశ్న ఇప్పుడు అందరి మదిలో మెదులుతోం దన్నారు. "నేను పార్టీని నడిపించడానికి సరైన వ్యక్తినా కాదా అని నా సహచరులు ప్రశ్నించారు. వారి మనోభావాలను నేను విన్నాను, గౌరవపూర్వకంగా అంగీకరిస్తున్నాను. అందుకే తప్పుకుంటున్నాను. నా దేశంపై ఉన్న ప్రేమతోనే ఈ నిర్ణయం తీసుకున్నాను" అని స్టార్మర్ స్పష్టం చేశారు.ఈ రాజీనామా నిర్ణయాన్ని అధికారికంగా ప్రకటించడానికి ముందే తాను ఉదయం బ్రిటన్ రాజు చార్లెస్‌తో మాట్లాడి వివరాలను తెలియజేసినట్లు ప్రధాని స్టార్మర్ చెప్పారు. సెప్టెంబరులో జరగబోయే పార్లమెంటు తదుపరి సమావేశాల కంటే ముందే కొత్త నాయకుడిని ఎన్నుకునే ప్రక్రియను పూర్తి చేయాలని లేబర్ నేషనల్ ఎగ్జిక్యూటివ్‌ను కోరతానని వెల్లడించారు. రాబోయే ఎన్నికల్లో లేబర్ పార్టీకి రెండోసారి స్పష్టమైన అధికారం దక్కేలా చూసేందుకు, తన తర్వాత రాబోయే కొత్త నాయకుడికి పూర్తి మద్దతు ఇస్తానని, మరింత బలమైన బ్రిటన్‌ను వారికి వారసత్వంగా అందిస్తున్నానని ఆయన ధీమా వ్యక్తం చేశారు.లేబర్ పార్టీ కొత్త రథసారథిని ఎంపిక చేసేందుకు వీలుగా తక్షణమే చర్యలు ప్రారంభించాలని పార్టీ నేషనల్ ఎగ్జిక్యూటివ్ కమిటీని స్టార్మర్ కోరారు. ఈ ప్రతిపాదన ప్రకారం, బ్రిటన్ కొత్త ప్రధాని ఎంపిక కోసం జూలై 9వ తేదీన అధికారికంగా నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానుంది. అనంతరం జూలై 16 నాటికి నామినేషన్ల గడువు ముగుస్తుంది. ఒకవేళ ఏకాభిప్రాయం కుదిరితే జూలైలోనే కొత్త ప్రధాని పీఠంపై కూర్చుంటారు. లేనిపక్షంలో అంతర్గత ఎన్నికల ద్వారా సెప్టెంబరు నాటికి సరికొత్త నాయకుడు బ్రిటన్ బాధ్యతలు చేపడతారు.కీర్ స్టార్మర్ వైదొలగడంతో లేబర్ పార్టీ తదుపరి అగ్రనేతగా, బ్రిటన్ కాబోయే ప్రధానిగా అండీ బర్న్‌హామ్ పేరు లండన్ రాజకీయాల్లో బలంగా వినిపిస్తోంది. ప్రస్తుత సమాచారం ప్రకారం ఆయనకు మద్దతు ఇస్తున్న అధికార పక్ష ఎంపీల సంఖ్య ఇప్పటికే 300 మార్కుకు చేరుకుంది. ఇదిలా ఉండగా, బ్రిటన్ రాజకీయాల్లో గత దాదాపు పదేళ్ల కాలంలోనే ఆరుగురు ప్రధానులు మారిపోవడం గమనార్హం. ఇప్పుడు స్టార్మర్ రాజీనామాతో బ్రిటన్ దేశం మరో పదేళ్లలోనే ఏడో ప్రధానికి స్వాగతం పలికేందుకు సిద్ధమవుతోంది.2024లో కీర్ స్టార్మర్ భారీ మెజారిటీతో బ్రిటన్ ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. అయితే ఇటీవల కాలంలో లేబర్ పార్టీకి ప్రజాదరణ క్రమంగా తగ్గుతున్నట్లు పలు సర్వేలు వెల్లడించాయి. ముఖ్యంగా నైజెల్ ఫరాజ్ నేతృత్వంలోని 'రిఫార్మ్ యూకే' పార్టీకి ప్రజల్లో ఆదరణ విపరీతంగా పెరుగుతోంది. దీనికి తోడు ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో లేబర్ పార్టీ ఘోరమైన ఫలితాలను మూటగట్టుకుంది. అదే సమయంలో మేకర్‌ఫీల్డ్ పార్లమెంటరీ ఉపఎన్నికలో బర్న్‌హామ్ ఘన విజయం సాధించడంతో, స్టార్మర్ నాయకత్వ సామర్థ్యంపై సొంత పార్టీలోనే అనుమానాలు, అసమ్మతి మొదలయ్యాయి.రాజకీయ వైఫల్యాలతో పాటు స్టార్మర్ తీసుకున్న కొన్ని వివాదాస్పద నిర్ణయాలు కూడా ఆయన పదవిని ముంచాయి. ముఖ్యంగా తీవ్రమైన 'ఎప్‌స్టీన్ కుంభకోణం' ఆరోపణలు ఎదుర్కొంటున్న తన అత్యంత సన్నిహిత స్నేహితుడు పీటర్ మాండెల్సన్‌ను అమెరికాకు యూకే రాయబారిగా నియమించాలని స్టార్మర్ మొండిగా నిర్ణయించారు. ఈ నిర్ణయంపై బ్రిటన్ వ్యాప్తంగా తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ఈ పరిణామాల నేపథ్యంలో స్టార్మర్ వెంటనే ప్రధాని పదవి నుంచి తప్పుకోవాలంటూ క్యాబినెట్ మంత్రులతో పాటు సొంత పార్టీ ఎంపీల నుంచి ఆయనపై ఊహించని స్థాయిలో ఒత్తిడి పెరిగింది.

సొంత పార్టీ నుంచే తిరుగుబాటు మొదలైనప్పటికీ.. మొదట్లో కీర్ స్టార్మర్ ఎక్కడా తగ్గేదే లేదన్నట్లు వ్యవహరించారు. తాను ప్రధాని పదవి నుంచి వైదొలిగే ప్రసక్తే లేదని, ఏ శక్తులకైనా ఎదురొడ్డి పోరాడుతానని ప్రకటించారు. కానీ రోజురోజుకూ మంత్రులు, ఎంపీల మద్దతు తగ్గిపోవడం, తిరుగుబాటు తీవ్రరూపం దాల్చడంతో ఆయనకు వేరే దారి లేకుండా పోయింది. చివరకు ప్రస్తుత రాజకీయ వాస్తవాలను, సంక్షోభాన్ని అంగీకరిస్తూ ప్రధాని పదవికి రాజీనామా చేయక తప్పలేదు. దీంతో బ్రిట రాజకీయాల్లో కొన్ని రోజులుగా నడుస్తున్న ఉత్కంఠకు తెరపడింది.

# మహారాష్ట్ర రాజకీయాల్లో పెను భూకంపం

**మహారాష్ట్ర వెలుతురు జూన్ 22:**

మహారాష్ట్ర రాజకీయ వేదికపై మరో భారీ రాజకీయ ముసా మార్పిడి కలకలం రేపుతోంది. మాజీ ముఖ్యమంత్రి ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని శివసేన (యూబీటీ) పార్టీకి కోలుకోలేని పెద్ద దెబ్బ తగిలింది. ఆ పార్టీకి చెందిన ఆరుగురు తిరుగుబాటు (రెబెల్) లోక్‌సభ సభ్యులు సోమవారం అధికారికంగా ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిందే నేతృత్వంలోని అసలు శివసేన వర్గంలో చేరబోతున్నట్లు ఆ పార్టీ కీలక నేత, మహారాష్ట్ర మంత్రి ప్రతాప్ సర్నాయిక్ సంచలన ప్రకటన చేశారు. ఈ ఆరుగురు ఎంపీల రాకతో దేశ రాజధాని ఢిల్లీలోని పార్లమెంటులో సీఎం షిందే నేతృత్వంలోని శివసేన బలం భారీగా పుంజుకోనుంది. ఈ తిరుగుబాటు ఎంపీలు ఇప్పటికే లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను కలిసి, తమను షిందే వర్గంలో విలీనం చేయాలని కోరుతూ అధికారిక లేఖను కూడా అందజేయడం విశేషం.

మహారాష్ట్ర మంత్రి ప్రతాప్ సర్నాయిక్ సోమవారం ఉదయం మీడియాతో మాట్లాడుతూ ఈ విలీన ప్రక్రియపై పూర్తి స్పష్టతనిచ్చారు. సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు ఆరుగురు యూబీటీ ఎంపీలు అధికారికంగా తమ శివసేన పార్టీ కండువా కప్పుకోనున్నారని వెల్లడించారు. ఈ పరిణామంతో లోక్‌సభలో తమ పార్టీ ఎంపీల సంఖ్య ప్రస్తుతమున్న 7 నుండి ఒక్కసారిగా 13కి పెరుగుతుందని వివరించారు. హిందూ హృదయ సామ్రాట్ బాలాసాహెబ్ ఠాక్రే ఆశయాలు, సిద్ధాంతాలను నిజాయితీగా అనుసరించే వారంతా తమ వైపు వస్తున్నారని, శివసేనను మరింత బలోపేతం చేసేందుకు వారికి ఘన స్వాగతం పలుకుతున్నామని సర్నాయిక్ పేర్కొన్నారు.

ఈ సందర్భంగా ఉద్ధవ్ ఠాక్రే వర్గంపై మంత్రి ప్రతాప్ సర్నాయిక్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. శివసేనలో అసంతృప్తులను చేర్చుకునే 'ఆపరేషన్ టైగర్' అనేది కేవలం ఈరోజుతో ముగిసేది కాదని, ఇది ఏడాది పొడవునా 365 రోజులూ నిరంతరాయంగా కొనసాగుతూనే ఉంటుందని హెచ్చరించారు. ఈ సందర్భంగా యూబీటీ పార్టీ రాజ్యసభ ఎంపీ సంజయ్ రౌత్‌కు ఆయన వ్యంగ్యంగా కృతజ్ఞతలు తెలిపారు. గతంలో సంజయ్ రౌత్ ప్రవర్తన వల్లే విసిగిపోయి మొదట ఎమ్మెల్యేలంతా షిందే వైపు వచ్చారని, ఇప్పుడు ఆయన పుణ్యమా అంటూ ఆరుగురు లోక్‌సభ ఎంపీలు కూడా తమ పార్టీలోకి వస్తున్నారని ఎద్దేవా చేశారు.

యూబీటీ ఎంపీల పార్టీ మార్పు వ్యవహారంపై శివసేన ఎంఎల్‌సీ డాక్టర్ మనీషా కయాండే ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. పార్టీ మారుతున్న ఆరుగురిని తిరుగుబాటుదారులు అనడం కంటే, వారు తమ సొంత గూటికి తిరిగి వస్తున్న 'శివ సైనికులు' అని పిలవడం కరెక్ట్ అని అభిప్రాయపడ్డారు. ఈ విలీనానికి సంబంధించి తనకు ఇంకా పూర్తి స్థాయి అధికారిక సమాచారం అందనప్పటికీ, ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిందే ఈ నిర్ణయాన్ని మనస్ఫూర్తిగా స్వాగతించారని చెప్పారు. ఇప్పటికే ఎంపీ ఓమ్రాజే నింబాల్కర్ వంటి నేతలు తమ నియోజకవర్గాల ప్రజల అభిప్రాయాలను తెలుసుకుని ఈ అడుగు వేశారని, సోమవారం సాయంత్రానికి రాష్ట్ర ప్రజలకు ఒక మంచి శుభవార్త అందుతుందని ఆమె ధీమా వ్యక్తం చేశారు.

మరోవైపు, శివసేన (యూబీటీ) కు గుడ్‌బై చెబుతున్నట్లు తిరుగుబాటు ఎంపీ నగేశ్ పాటిల్ అష్టికర్ అధికారికంగా ప్రకటించారు. ఈ మేరకు ఆయన ఫేస్‌బుక్ వేదికగా ఒక వీడియో సందేశాన్ని విడుదల చేశారు. తనకు పార్టీ అధినేత ఉద్ధవ్ ఠాక్రేపై ఎలాంటి వ్యక్తిగత అసంతృప్తి లేదన్నారు. అయితే, ఇటీవల ఢిల్లీలో జరిగిన పార్లమెంటరీ పార్టీ సమావేశానికి కొన్ని అనివార్య కారణాల వల్ల తాను హాజరుకాలేకపోయానని, దానికి పార్టీ పెద్దలు తనపై తీవ్ర అవిశ్వాసం ప్రదర్శించారని ఆవేదన వ్యక్తం చేశారు. తమపై కఠినమైన, అవమానకరమైన భాషను వాడటం వల్లే తీవ్ర మనస్థాపానికి గురై పార్టీని వీడాల్సి వస్తోందని స్పష్టం చేశారు. కాగా, ఇదే సమయంలో పార్టీ వ్యతిరేక పనులకు పాల్పడుతున్నారంటూ నగేశ్ పాటిల్ కుమారుడు కృష్ణ అష్టికర్‌ను యూబీటీ యాజమాన్యం పార్టీ నుండి బహిష్కరించడం గమనార్హం.

అసలు ఈ సంక్షోభానికి జూన్ 18న ఢిల్లీలో జరిగిన సమావేశమే వేదికగా మారింది. ఉద్ధవ్ ఠాక్రే ఏర్పాటు చేసిన యూబీటీ పార్లమెంటరీ పార్టీ అత్యవసర సమావేశానికి మొత్తం 9 మంది ఎంపీలలో కేవలం నలుగురు మాత్రమే హాజరయ్యారు. అరవింద్ సావంత్, అనిల్ దేశాయ్, రాజాభావూ వాజేలతో పాటు రాజ్యసభ ఎంపీ సంజయ్ రౌత్ మాత్రమే ఆ మీటింగ్‌కు వెళ్లారు. పార్టీ అధిష్ఠానం కఠినమైన విప్ జారీ చేసినప్పటికీ.. నగేష్ ఆష్టికర్, సంజయ్ జాదవ్, సంజయ్ దేశ్‌ముఖ్, సంజయ్ దినపాటిల్, ఓంప్రకాష్ రాజేనింబాల్కర్, భావూసాహెబ్ వాక్‌చౌరే అనే ఆరుగురు ఎంపీలు దానికి పూర్తిగా దూరంగా ఉండి తమ అసమ్మతిని చాటారు. ఆ వెంటనే స్పీకర్‌ను కలిసి విలీన లేఖ ఇచ్చారు.

తమ పార్టీ ఎంపీల వరుస తిరుగుబాటుపై ఉద్ధవ్ ఠాక్రే కుమారుడు, యువ నేత ఆదిత్య ఠాక్రే భారతీయ జనతా పార్టీ (బీజేపీ) పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. దేశంలో బాబాసాహెబ్ అంబేడ్కర్ రాసిన పవిత్ర రాజ్యాంగాన్ని మార్చాలనే కుట్రతోనే బీజేపీ ఇలాంటి నీచ రాజకీయాలకు పాల్పడుతోందని ఆరోపించారు. పార్లమెంటులో రాజ్యాంగ సవరణకు అవసరమైన సంఖ్యా బలాన్ని దొంగదారిలో సాధించేందుకే శివసేన (యూబీటీ) కి చెందిన ఎంపీలు, ఎమ్మెల్యేలను బీజేపీ భయపెట్టి విడదీస్తోందని మండిపడ్డారు.

2024 సార్వత్రిక ఎన్నికల్లో దేశ ప్రజలు బీజేపీ నియంతృత్వ పోకడలను అడ్డుకున్నారని, అందుకే వారికి కేవలం 240 సీట్లు మాత్రమే దక్కాయని ఆదిత్య ఠాక్రే గుర్తు చేశారు. అయినప్పటికీ బుద్ధి తెచ్చుకోకుండా, ఇప్పుడు ప్రాంతీయ పార్టీలను దౌర్జన్యంగా చీల్చడం ద్వారా మళ్లీ అదే రాజ్యాంగ వ్యతిరేక ప్రయత్నాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. విపక్ష మహా వికాస్ అఘాడీ కూటమి మిత్రపక్షాల ఓట్లతో, ప్రజల ఆశీస్సులతో గెలిచిన ఎంపీలు.. ఇప్పుడు ఓటర్ల తీర్పుకు విరుద్ధంగా స్వార్థ ప్రయోజనాల కోసం అధికార పక్షంలోకి మారడం ద్రోహమేనని ఆయన మండిపడ్డారు.

పార్టీలో ఇంత పెద్ద ఎత్తున తిరుగుబాటు నడుస్తున్న నేపథ్యంలో, క్యాడర్‌లో ధైర్యం నింపేందుకు అధినేత ఉద్ధవ్ ఠాక్రే రంగంలోకి దిగాలని నిర్ణయించారు. మహారాష్ట్రవ్యాప్తంగా క్షేత్రస్థాయి కార్యకర్తలను, ప్రజలను నేరుగా కలుసుకునేందుకు భారీ పర్యటనల షెడ్యూల్‌ను ఖరారు చేశారు. ఈ ప్రచారంలో భాగంగా ముఖ్యంగా తిరుగుబాటు ఎంపీల నియోజకవర్గాలపైనే ఆయన ప్రత్యేక దృష్టి పెట్టనున్నారు. యూబీటీ ఎంపీ సంజయ్ రౌత్ వెల్లడించిన వివరాల ప్రకారం.. ఉద్ధవ్ ఠాక్రే జూన్ 27న యవత్మాల్ జిల్లా పర్యటనతో ఈ పోరాటాన్ని ప్రారంభిస్తారు. ఆ తర్వాత వాషిమ్, హింగోలి, జూన్ 28న పర్భానీ, ధరాశివ్‌లతో పాటు జూన్ 29న షిర్డీ నియోజకవర్గాలలో పర్యటించి రెబెల్స్ వ్యూహాలను తిప్పికొట్టనున్నారు.

# ఆధునిక న్యాయ విద్యకు కొత్త దిశ

- ఐసీఎఫ్ఏఐ లా స్కూల్‌లో వారంరోజుల అధ్యాపక శిక్షణ కార్యక్రమం ప్రారంభం

**శంకర్ పల్లి వెలుతురు, జూన్ 22 :**

న్యాయ విద్యలో ఆధునిక బోధనా విధానాలు, అవుట్‌కమ్-బేస్డ్ ఎడ్యుకేషన్ , సాంకేతిక ఆధారిత అభ్యాస పద్ధతులపై అధ్యాపకులకు అవగాహన కల్పించేందుకు ఐసీఎఫ్ఏఐ ఫౌండేషన్ ఫర్ హయ్యర్ ఎడ్యుకేషన్ కు చెందిన ఐసీఎఫ్ఏఐ లా స్కూల్ ఆధ్వర్యంలో వారంరోజుల అధ్యాపక శిక్షణ కార్యక్రమం సోమవారం ఘనంగా ప్రారంభమైంది."ది మోడ్రన్ లా స్కూల్స్: నావిగేటింగ్ అవుట్‌కమ్-బేస్డ్ ఎడ్యుకేషన్ అండ్ ఇన్నోవేటివ్ లీగల్ పెడగాజీ" అనే అంశంపై జూన్ 22 నుంచి 28 వరకు నిర్వహించనున్న ఈ కార్యక్రమాన్ని లక్నోలోని డా. రామ్ మనోహర్ లోహియా నేషనల్ లా యూనివర్సిటీ వైస్-చాన్సలర్ ప్రొఫెసర్ (డా.) అమర్ పాల్ సింగ్ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంకేతిక రంగంలో వేగవంతమైన మార్పులు, సామాజిక అవసరాలు, న్యాయ వ్యవస్థల ప్రపంచీకరణ నేపథ్యంలో న్యాయ విద్యలో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకుంటున్నాయని అన్నారు. సాంప్రదాయ బోధనా విధానాలకు పరిమితం కాకుండా అనుభవాత్మక అభ్యాసం, క్లినికల్ లీగల్ ఎడ్యుకేషన్, అంతరశాఖ విధానాలు, డిజిటల్ బోధనా పద్ధతులను విద్యాసంస్థలు అవలంబించాలని







సూచించారు.కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఐఎఫ్హెచ్ఈ వైస్-చాన్సలర్ ప్రొఫెసర్ (డా.) టి. కోటి రెడ్డి మాట్లాడుతూ విద్యా నాణ్యత సాధనలో అధ్యాపకుల నిరంతర అభివృద్ధి కీలకమని పేర్కొన్నారు. భవిష్యత్ న్యాయవాదులు, విధాన రూపకర్తలను తీర్చిదిద్దడంలో అధ్యాపకుల పాత్ర అత్యంత ముఖ్యమని చెప్పారు.ప్రో వైస్-చాన్సలర్ ప్రొఫెసర్ (డా.) ఎలిజబెత్ రోజ్ మాట్లాడుతూ నాణ్యమైన బోధన, పాఠ్య ప్రణాళికలో ఆవిష్కరణలు, విద్యార్థి కేంద్రిత బోధనా విధానాల అవసరాన్ని వివరించారు. అధ్యాపక శిక్షణ కార్యక్రమాలు ఉత్తమ బోధనా పద్ధతుల మార్పిడి కోసం విలువైన వేదికలుగా నిలుస్తాయని అన్నారు.అంతకుముందు ఐసీఎఫ్ఏఐ లా స్కూల్ డైరెక్టర్ ప్రొఫెసర్ (డా.) పూజారి రవి శేఖరరాజు స్వాగతం పలికి, ఎఫ్‌డీపీ లక్ష్యాలను వివరించారు. న్యాయ విద్యలో సమకాలీన పరిణామాలు, మూల్యాంకన విధానాలు, డిజిటల్ లెర్నింగ్ సాధనాలు, వినూత్న తరగతి గది బోధనా విధానాలపై కార్యక్రమం దృష్టి సారిస్తుందని తెలిపారు.అసోసియేట్ డీన్ ప్రొఫెసర్ (డా.) ఎం.డి. అక్బర్ ఖాన్ ఎఫ్‌డీపీ అంశాన్ని పరిచయం చేస్తూ అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా న్యాయ విద్యను తీర్చిదిద్దాల్సిన అవసరాన్ని వివరించారు. విద్యార్థుల్లో విశ్లేషణాత్మక ఆలోచన, పరిశోధనా నైపుణ్యాలు, నైతిక విలువలు, సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించే బోధనా విధానాలు అవసరమన్నారు.వారంరోజుల పాటు కొనసాగే ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యాయ విద్యావేత్తలు, నిపుణుల ఆధ్వర్యంలో ఉపన్యాసాలు, ప్యానెల్ చర్చలు, పరస్పర మేధోమథన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. దేశంలోని వివిధ విశ్వవిద్యాలయాలు, విద్యాసంస్థల నుంచి అధ్యాపకులు, పరిశోధకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.కార్యక్రమం ముగింపులో అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. సాయన్ దాస్ వందన సమర్పణ చేశారు.

# దత్త్‌నగర్‌లో సీసీ రోడ్డు పనులకు శ్రీకారం

- హిమాయత్‌నగర్ డివిజన్‌లో అభివృద్ధి పనులు వేగవంతం
- మాజీ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్ ఆధ్వర్యంలో పనుల ప్రారంభం

**హైదరాబాద్ వెలుతురు జూన్ 22:**



హిమాయత్‌నగర్ డివిజన్ పరిధిలోని దత్త్‌నగర్‌లో ఇటీవల శంకుస్థాపన చేసిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డివిజన్ మాజీ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్ మాట్లాడుతూ, కాలనీలో మెరుగైన రహదారి సౌకర్యాల కల్పనకు ఈ పనులు దోహదపడతాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు జి. రామన్ గౌడ్, మహేష్, జాకీ, సర్ఫరాజ్, అనీష్, అఖిల్ అహ్మద్, బస్తీ వాసులు మిర్జా తదితరులు పాల్గొన్నారు. స్థానిక ప్రజలు రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం కావడంపై హర్షం వ్యక్తం చేశారు.

# తపస్ రంగారెడ్డి జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి పూజరి రమేశ ఆధ్వర్యంలో సభ్యత్వ అభియాన్ కార్యక్రమం ప్రారంభం

**ఇబ్రహీంపట్నం వెలుతురు జూన్ 22:**




ఇబ్రహీంపట్నం మండలం తపస్ సభ్యత్వ అభియాన్ లో భాగంగా దండుమైలారం జిల్లా పరిషత్ పాఠశాలలో తపస్ సభ్యత్వ అభియాన్ కార్యక్రమంలో పాల్గొన్న తపస్ రంగారెడ్డి జిల్లాప్రధాన కా ర్యదర్శి పూజరి రమేశ మండల మహిళ కన్వీనర్ నివేదిత మండల బాధ్యులు వెంకటరమణ సు జాత.పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి గోవర్ధన్ మరియు పాఠశాల ఉపాధ్యాయులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థి సంక్షేమమే లక్ష్యం కావాలి : జేఎన్‌టీయూహెచ్ నూతన రిజిస్ట్రార్, రెక్టార్‌కు ఎన్టీవీఎస్ విజ్ఞప్తి

**కూకట్ పల్లి, జూన్ 22 వెలుతురు:**

జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం (జేఎన్‌టీయూహెచ్) నూతన రిజిస్ట్రార్‌గా డాక్టర్ ఏ. జయలక్ష్మి , రెక్టార్‌గా డాక్టర్ ఏ. దామోదరం బాధ్యతలు చేపట్టిన సందర్భంగా నవ తెలంగాణ విద్యార్థి శక్తి నాయకులు సోమవారం వారిని ఘనంగా సత్కరించారు. ఎన్టీవీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఈ. పవన్ కుమార్ ఆధ్వర్యంలో నాయకులు విశ్వవిద్యాలయానికి చేరుకుని నూతన రిజిస్ట్రార్, రెక్టార్ లను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో సత్కరించి, పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. విశ్వవిద్యాలయ అభివృద్ధిలో వారి పాత్ర కీలకం కావాలని, వారి అనుభవంతో జేఎన్‌టీయూహెచ్ మరింత



పురోగతి సాధించాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా పవన్ కుమార్ మాట్లాడుతూ, "విద్యార్థి సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా పరిపాలన సాగాలి" అని నూతన పాలకవర్గానికి విజ్ఞప్తి చేశారు. జేఎన్‌టీయూహెచ్ పరిధిలో విద్యార్థులు ఎదుర్కొంటున్న విద్యా, పరిపాలనాపరమైన సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. విద్యా ప్రమాణాల మెరుగుదల, పరీక్షల నిర్వహణ, ఫలితాల వెల్లడి, సర్టిఫికెట్ల జారీ వంటి సేవలను సులభతరం చేయడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. త్వరలోనే జేఎన్‌టీయూహెచ్‌లో నవ తెలంగాణ విద్యార్థి శక్తి నూతన కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు ఆయన ప్రకటించారు. విద్యార్థుల హక్కుల పరిరక్షణకు, వారి సమస్యల పరిష్కారానికి తమ సంస్థ నిరంతరం కృషి చేస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్టీవీఎస్ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు నితిన్ రెడ్డి, నాయకులు రమణ, సుశాంత్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా కొండకల్ల శ్రీనివాస్ రెడ్డి జన్మదిన వేడుకలు

**కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి)**



కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కొండకల్ల శ్రీనివాస్ రెడ్డి జన్మదిన వేడుకలు సూరారం గ్రామంలోని విశ్వకర్మ కాలనీలోని ఆయన నివాసంలో ఘనంగా జరుగగా ఈ వేడుక కార్యక్రమానికి బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజులు ముఖ్యఅతిథులుగా హాజరై కొండకల్ల శ్రీనివాస్ రెడ్డితో కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాసేవలో మరింత అభివృద్ధి చెందాలని శ్రీనివాస్ రెడ్డిని ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు మంత్రి సత్యనారాయణ, సురేష్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు పుప్పాల భాస్కర్, రుద్ర అశోక్, సీనియర్ నాయకులు వారాల వినోద్, కోలా శ్రీకాంత్ ముదిరాజ్, సిద్దిక్, అభిమానులు, మహిళా నాయకురాల్లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పేదల ఆకలి తీరుస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు: రవీందర్ ముదిరాజ్

**కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) జూన్ 22:**




లయన్స్ క్లబ్ సభ్యులు పేదల ఆకలి తీరుస్తున్నారని సామాజిక నేత రవీందర్ ముదిరాజ్ పేర్కొన్నారు. సోమవారం లయన్స్ క్లబ్ సికింద్రాబాద్ సభ్యులు సూరారం మల్లారెడ్డి నారాయణ ఆసుపత్రి ముందు ఈ సభ్యుల ఆధ్వర్యంలో నిరంతరం ఉదయం 8 గంటలకు సూరారం నారాయణ మల్లారెడ్డి హాస్పిటల్ వద్ద, ఆసుపత్రికి వచ్చిన వారికి ఉదయం ఎనిమిది గంటలకు అల్పాహారం ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. నేటికీ 2000 రోజులు దాటి 2001వ రోజులో అడిగిడుతున్న సందర్భంగా సభ్యులందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ నార్త్ లైన్స్ క్లబ్ సికింద్రాబాద్ దినదినాభివృద్ధి చెందాలని ప్రజలకు సేవ చేస్తున్న ఆ సభ్యులకు అధ్యక్ష కార్యదర్శులకు పాల్గొంటున్న బీద వారందరూ కూడా ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

# జీఎస్టీఏటీలో అప్పీళ్ల దాఖలుపై అవగాహన సదస్సు విజయవంతం

**నాంపల్లి జూన్ 22 (వెలుతురు):**

ఆంధ్రప్రదేశ్ సేల్స్ టాక్స్ బార్ అసోసియేషన్ (APSTBA) ఆధ్వర్యంలో హైదరాబాద్ నాంపల్లిలోని కమిషనర్ కార్యాలయం 5వ అంతస్తులో ఉన్న స్టాఫ్ కాలేజీలో "జీఎస్టీఏటీలో అప్పీళ్ల దాఖలు" అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. వస్తు మరియు సేవల పన్ను అప్పీలేట్ ట్రిబ్యునల్ (GSTAT) ముందు అప్పీళ్ల దాఖలుకు సంబంధించిన చట్టపరమైన విధానాలు, ఆచరణాత్మక అంశాలు, విధివిధానాలపై పన్ను నిపుణులు, న్యాయవాదులు, అసోసియేషన్ సభ్యులు విస్తృతంగా చర్చించారు. జీఎస్టీ అప్పీలేట్ వ్యవస్థపై ప్రాక్టీషనర్లు, పన్ను చెల్లింపుదారుల్లో అవగాహన పెంపొందించడం, అప్పీళ్లను సకాలంలో మరియు కచ్చితంగా దాఖలు చేయాల్సిన అవసరాన్ని వివరించడం జరిగిందని అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. ప్రముఖ వక్తలు అప్పీలేట్ విచారణలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అవసరమైన ఆచరణాత్మక మార్గదర్శకాలు, చట్టపరమైన ఉత్తమ పద్ధతులను వివరించారు. ఈ సదస్సులో పెద్ద సంఖ్యలో పన్ను వృత్తి నిపుణులు హాజరై ఆసక్తిగా పాల్గొన్నారని.. నిపుణుల నుంచి విశేష స్పందన వచ్చిందని అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర జీఎస్టీఏటీ సభ్యులతో పాటు , పి.వి. సుబ్బారావు , రిటైర్డ్ జాయింట్ కమిషనర్ ఆఫ్ సేల్స్ టాక్స్ , ఆంధ్రప్రదేశ్ సేల్స్ టాక్స్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు షేక్ జీలానీ బాషా , ఉపాధ్యక్షుడు ఎం. అమరేందర్ , జాయింట్ సెక్రెటరీ కె. నాసింగ్ రావు , జీసి మెంబర్స్ డా. టి. రమేష్ బాబు , కేవీ రమణ మూర్తి ,




ఉదయ్ భగవత్ , అంజలీ అగర్వాల్ మరియు అసోసియేషన్ సీనియర్ మెంబర్స్ వి. నాగేంద్ర ప్రసాద్ , ఎస్. ఎస్ సత్యనారాయణ సభ్యులు బి. దుర్గ ప్రసాద్ , కే. హుస్సేన్ వలి , ఎస్. రామా రావు తదితరులు పాల్గొన్నారు.

# కోహెడ జిల్లా పరిషత్ పాఠశాలలో సృజనాత్మక కార్యక్రమాలు

- విద్యార్థులే నిర్వహించిన బాలసభ ఆకట్టుకుంది

**ఇబ్రహీంపట్నం వెలుతురు జూన్ 22:**

ఇబ్రహీంపట్నం నియోజకవర్గం అబ్దుల్లాపూర్ మెట్ మండలం కోహెడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠ శాల లో నిర్వహించిన బాలసభ కార్యక్రమం విద్యార్థుల ప్రతిభ నాయకత్వ లక్షణాలు సృజనా త్మకతను ప్రతిబింబిస్తూ విజయవంతంగా జరిగింది ఈకార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యా యురాలు ఎన్ తిరుపతిబాయి అధ్యక్షత వహించి పర్యవేక్షించారు పాఠశాల సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు మీలా విజయ్ కుమార్ సమన్వయకర్తగా వ్యవహరిస్తూ కార్యక్రమ రూపకల్పన నిర్వ హణలో కీలక పాత్రపోషించారు ముఖ్యంగా బాలసభను పూర్తిగా విద్యార్థుల చేతనే నిర్వహిచడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది కార్యక్రమం ప్రారంభంలో ఆరవ తరగతి విద్యార్థుల కు ఘనస్వాగతం పలికారు అనంతరం విద్యార్థులు



దేశభక్తి గేయాలు పాటలు ప్రసంగాలు నృత్య ప్రదర్శనలు వినోదాత్మక కార్యక్రమాలు ప్రదర్శించి అందరినీ ఆకట్టుకున్నారు ఫాదర్స్ డే సంద ర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పాటలు నృత్యాలు ప్రేక్షకుల ప్రశంసలుఅందుకున్నాయిబాల సభ ద్వారా విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు వేదికపై మాట్లాడే నైపుణ్యం సృజనాత్మక ఆలోచనలు వ్యక్తిత్వ వికాసం పెంపొందేలా కార్యక్రమాలు నిర్వహించారు పలువురు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు కార్యక్రమంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మీలా శ్రీ య తరఫున బహుమతులు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు ఈకార్యక్రమాన్ని విజ య వంతం చేయడం లో ఉపాధ్యాయులు ఉమామహేశ్వ రి లక్ష్మణ్ గోపాల్ రెడ్డి రాధా మాధ వి కొండయ్య చంద్రమోహన్ గణేష్ తదితరులు మార్గదర్శకులుగా వ్యవహరించి విద్యార్థులను ప్రో త్సహించారు ఈసందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు ఎన్ తిరుపతిబాయి మాట్లాడుతూ విద్యా ర్థులే కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమని ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో ఆ త్మ విశ్వాసం నాయకత్వ లక్షణాలు సమన్వయ నైపుణ్యాలను పెంపొందిస్తాయని తెలిపారు వి ద్యార్థుల చురుకైన భాగస్వామ్యం ఉపాధ్యాయుల సహకారం మీలావిజయ్ కుమార్ సమర్థవం తమైన సమన్వయంతో బాలసభ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడింది ఈకార్య క్ర మంలో ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఆరుట్ల గ్రామంలో శ్రీశ్రీశ్రీ కంఠమహేశ్వరస్వామి దేవాలయంలో శివస్వాముల గురుస్వామి లొంగరీ యాదగిరి ఆధ్వర్యంలో 16వ సోమవారం అన్నదాన కార్యక్రమం

- అన్నదాన ప్రభువు గంట రవీందర్ రెడ్డి

**మంచాల వెలుతురు జూన్ 22:**



మంచాల మండలం ఆరుట్ల గ్రామ ంలోశ్రీశ్రీశ్రీక ంఠ మ హేశ్వ రస్వామి దేవాలయంలో ప్రతిసోమవారం రోజు గౌడ సంఘం పెద్దలు దాతల సహకారంతో శివస్వాముల గురుస్వామి లొంగరీ యాదగిరి అన్నదాన కార్య క్రమం ఏర్పాటుచేస్తున్నారు ఈసోమవారం అన్నదాన ప్రభువు గంట రవీందర్ రెడ్డి ముందుగా కంఠమహేశ్వరస్వామికి శివలింగా నికి ప్రత్యేకపూజలు చేసిన అన్నదాన ప్రభువు గంట రవీందర్ రెడ్డి కుటుంబసభ్యులు స్వాముల గురుస్వామి లొంగరి యాదగిరి అయ్యప్ప స్వా ముల గురుస్వాములు కావలి శ్రీనివాస్ ముదిరాజ్ లొంగరి దాసు భక్తులు వేదిరే రమణరెడ్డి సిద్ధ గోని రమేష్ గౌడ్ కొత్తపల్లి శేఖర్ గౌడ్అనంతరం అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు ఈకార్య క్రమంలోవైయస్సార్ మాధగోని జంగయ్యగౌడ్ మొర్రి ఐలయ్య బుస్సు నరేష్ ముదిరాజ్ అంతటి దశరథ గౌడ్ కొండూరి శేఖర్ భక్తులు పెద్దఎత్తున పాల్గొని అన్నదానప్రసాదం స్వీకరించారు.



# సీఎం రేవంత్‌పై వ్యాఖ్యలు చేస్తే సహించం:కూన శ్రీశైలంగౌడ్

**కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) జూన్ 22:**

సీఎం రేవంత్‌పై వ్యాఖ్యలు చేస్తే సహించామని కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ హెచ్చరించారు. కొలను హనుమత్ రెడ్డి, డిసిసి మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు వజ్రేష్ కుమార్ యాదవ్ తో ఆయన కలసి మాట్లాడుతూ భూ కబ్జాలకు కేరాఫ్ అడ్రస్ ఎమ్మెల్యే వివేకానంద అని ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు పై ఎమ్మెల్యే వివేక్ మరోసారి అనుచిత వ్యాఖ్యలు చేస్తే కుత్బుల్లాపూర్‌లో తిరగనివ్వబోమని హెచ్చరించారు.

టిడిపిలో గెలిచి అదే పార్టీని బేరం పెట్టిన వ్యక్తి వివేక్ అని విమర్శించారు. కమ్యూనిస్టు పార్టీ మినహా దాదాపు అన్ని పార్టీలను ఆయన మార్చారన్నారు. టీడీపీలో చేరి ఆ పార్టీని నిండా ముంచేశారని ఆరోపించారు. వివేకానంద దొంగచాటుగా గెలిచిన ఎమ్మెల్యే అని, మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచినా కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెప్పుకోదగ్గ అభివృద్ధి చేయలేదని విమర్శించారు. కాంగ్రెస్ హయాంలో వేలాది ఇళ్లను పేదలకు అందించామని, కానీ వివేక్ పాలనలో అభివృద్ధి కనిపించలేదన్నారు.

కుత్బుల్లాపూర్‌లోని ప్రభుత్వ భూములను కేటీఆర్, హరీష్ రావులకు అమ్మించిన ఘనత వివేక్ కే దక్కుతుందని ఆరోపించారు. మైనంపల్లి హనుమంతరావు గురించి మాట్లాడే స్థాయి కూడా వివేక్ కు లేదని వారు వ్యాఖ్యానించారు.తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో 60 రేషన్ షాపులు, 200 మంది అంగన్‌వాడీ టీచర్లు, 200మంది ఆయాలను ఉద్యోగాల్లో నియమించామని గుర్తు చేశారు. అలాగే రాజీవ్ గృహకల్ప, ఇందిరమ్మ ఇళ్ల పథకాల ద్వారా వేలాది కుటుంబాలకు లబ్ధి చేకూర్చడంతో పాటు 25వేల ఇళ్ల పట్టాలు అందించామని పేర్కొన్నారు.

అదేవిధంగా 45వేల రేషన్ కార్డులు మంజూరు చేయించామని, పేదల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు అమలు చేశామన్నారు. "నేను చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల వివరాలు ప్రజల ముందు పెట్టడానికి సిద్ధంగా ఉన్నాను. మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన మీరు కుత్బుల్లాపూర్‌కు ఏం చేశారో చెప్పండి. ఎక్కడైనా, ఎప్పుడైనా బహిరంగ చర్చకు నేను సిద్ధం" అని కూన శ్రీశైలం గౌడ్ సవాల్ చేశారు.

# ధరల నియంత్రణ కమిటీ ఏర్పాటు చేయాలి

- **వినియోగదారుల సంఘాల రాష్ట్ర కార్యదర్శి పోచం సోమయ్య**

**మోత్కూర్, జూన్ 22,వెలుతురు న్యూస్ :**



జిల్లా స్థాయిలో ధరల నియంత్రణకు కమిటీని ఏర్పాటు చేయాలని తెలంగాణ వినియోగదారుల సంఘాల రాష్ట్ర కార్యదర్శి పోచం సోమయ్య జిల్లా అడిషనల్ కలెక్టర్ వెంకారెడ్డికి రెవెన్యూ వినతి పత్రం సోమవారం గ్రీవెన్ సెల్సెల్లో అందజేశారు. జిల్లాలో పలు ప్రాంతాల్లో వ్యాపారస్తులు అక్రమార్జనకు అలవాటు పడి వినియోగదారులను మోసగిస్తున్నారని కలెక్టర్కు వివరించారు.కొద్ది మొత్తంలో గ్యాస్ రేటు పెరిగిన సందర్భంలో తినుబండారాలు హోటల్స్ స్వీట్స్ షాపులు బేకరీలు బిర్యాని సెంటర్లు అడ్డగోలుగా రేట్లు పెంచి వినియోగదారులను మోసం చేస్తున్నారని ఆరోపించారు డిజిల్ పెట్రోలు లీటర్ కు పది రూపాయలు పెరగడంతో వ్యాపారస్తులు అధిక మొత్తంలో నిత్యవసర వస్తువులు, కూరగాయలు,కిరాణా సరుకులు, ఆటో చార్జీలు,వ్యవసాయ సంబంధిత యంత్రాలు,కిరాయి ధరలు అధిక మొత్తంలో రేట్లు పెంచి వినియోగదారులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.పెరిగిన ధరల ను కట్టడి చేయుటకు జిల్లా స్థాయిలో ధరల నియంత్రణ కమిటీ ఏర్పాటు చేసి వినియోగదారుల కు న్యాయం చేయాలని ఈ సందర్భంగా కోరారు. ఆయన వెంట భువనగిరి సినీ కన్జ్యూమర్ వెల్ఫేర్ సొసైటీ కదారి వెంకటేశ్వర్లు ఉన్నారు.

# రైతులకు సబ్సిడీపై విత్తనాలు ఎరువులు అందించాలి

- **కల్తీ విత్తనాలు విక్రయించే వారిపై పీడీ యాక్ట్ క్రింద చర్యలు తీసుకోవాలి సిపిఎం**

**మోత్కూర్, జూన్ 22,వెలుతురు న్యూస్ :**




ఖరీఫ్ వ్యవసాయ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో రైతులకు నాణ్యమైన విత్తనాలు ఎరువులు సబ్సిడీపై అందించాలని, సిపిఎం పార్టీ మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. కల్తీ విత్తనాలు ఎరువుల సరఫరాకు పాల్పడుతున్న వ్యాపారులపై పీడీ యాక్ట్ క్రింద కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. సోమవారం రోజున మోత్కూర్ లో ఆయన పత్రికా ప్రతినిధులతో మాట్లాడుతూ..... రాష్ట్రంలో రైతులు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా రభి దాన్యం కొనుగోలు ప్రక్రియ ఇప్పటికి పూర్తి కాలేదని విమర్శించ్చారు. దాన్యం కొనుగోళ్లలో జాప్యం కారణంగా రైతులు తీవ్ర ఆర్థిక మానసిక శారీరక ఇబ్బందులు ఎదుర్కొన్నారని పేర్కొన్నారు. వ్యవసాయానికి కీలకమైన ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనప్పటికి రైతులకు అవసరమైన విత్తనాలు ఎరువుల సరఫరాలో స్పష్టత లేదని ఆందోళన వ్యక్తం చేశారు. గత అనుభవాల దృష్ట్యా కల్తీ విత్తనాలు నాశిరకం ఎరువుల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారని గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి కల్తీ సరుకుల విక్రయాలను అరికట్టాలని కోరారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు ఎరువులను సబ్సిడీపై అందుబాటులో ఉంచి ఖరీఫ్ సాగుకు ఎలాంటి ఆటంకాలు లేకుండా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరారు.

# ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే వేముల వీరేశం చిత్రపటానికి పాలాభిషేకం

**రామన్నపేట. వెలుతురు న్యూస్ జూన్ 22:**



ఆదాని అంబుజా సిమెంట్ కంపెనీ ఏర్పాటు కాకుండా శాయశక్తుల కృషిచేసిన నకిరేకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ వేముల వీరేశం చిత్రపటానికి సోమవారం సుభాష్ సెంటర్ లో పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం పట్టణ కేంద్రంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ కాలుష్య కారకమైన అంబుజ సిమెంట్ పరిశ్రమ ఏర్పాటుకు వ్యతిరేకంగా రామన్నపేట, కోమ్మాయి గూడెం, సిరిపురం, వెల్లంకి, బోగారం, పెద్ద కాపార్తి మండల ప్రజలు, అఖిలపక్షాలు చేసిన ప్రజా పోరాటానికి స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం అండాదండగా నిలబడి అంబుజ సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటు కాకుండా అడ్డుకున్నారని వారన్నారు. ఇప్పుడు రామన్నపేట ప్రజలు ఊపిరి పీల్చుకున్నారని, మాకు ప్రధాన నాయకులు ఉన్నారని ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారని వారన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ గరిక సత్యనారాయణ కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు జింకల ప్రభాకర్, గోదాస్ పృథ్వీరాజ్, పట్టణ అధ్యక్షులు ఎండి జమీరుద్దీన్, జెల్ల వెంకటేష్. మాజీ ఎంపిటిసి ఎండి రెహమాన్, సాల్వేర్ అశోక్, మనం చంద్రశేఖర్ రామన్నపేట ఉపసర్పంచ్ మోటే రమేష్ రామన్నపేట వార్డ్ నెంబర్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# బోగారం గ్రామపంచాయతీ సిబ్బందికి రక్షణగా సర్పంచ్ కునురు సాయి కుమార్ గౌడ్ వ్యక్తిగత ప్రమాద బీమా

**రామన్నపేట వెలుతురు న్యూస్ జూన్ 22:**



గ్రామం బోగారం,గ్రామ ప్రజలకు నిరంతరం సేవలందిస్తూ, పారిశుధ్య నిర్వహణలో కీలక పాత్ర పోషిస్తున్న గ్రామపంచాయతీ సిబ్బంది భద్రత కోసం బోగారం గ్రామ సర్పంచ్ కునురు సాయి కుమార్ గౌడ్ ఒక గొప్ప నిర్ణయం తీసుకున్నారు. పంచాయతీలో పనిచేస్తున్న సిబ్బంది అందరికీ ఆయన 15 లక్షల ఉచిత వ్యక్తిగత ప్రమాద బీమా (యాక్సిడెంటల్ ఇన్సూరెన్స్) చేయించారు. బోగారం గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో సిబ్బందికి బీమా పత్రాలను సర్పంచ్ కునురు సాయి కుమార్ గౌడ్ స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, "ఎండనక, వాననక గ్రామ పారిశుధ్యం, నీటి సరఫరా, ఇతర అత్యవసర సేవల కోసం శ్రమిస్తున్న పంచాయతీ కార్మికుల ఆరోగ్య భద్రత, సంక్షేమం మా బాధ్యత. విధి నిర్వహణలో వారికి ఎలాంటి అవాంఛనీయ ప్రమాదం జరిగినా, వారి కుటుంబాలు రోడ్డున పడకుండా ఆర్థిక భరోసా కల్పించడానికే ఈ ప్రమాద బీమా చేయించడం జరిగింది. అని పేర్కొన్నారు. సర్పంచ్ ఈ మానవతా దృక్పథంపై బోగారం గ్రామపంచాయతీ సిబ్బంది మరియు కార్మికులు తీవ్ర హర్షం వ్యక్తం చేశారు. తమ కుటుంబాలకు పెద్ద దిక్కుగా నిలిచి, ఈ బీమా సౌకర్యం కల్పించినందుకు సర్పంచ్ కునురు సాయి కుమార్ గౌడ్ కి వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో , పంచాయతీ కార్యదర్శి సుధా మరియు గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# స్వదేశానికి తిరిగి వస్తున్న జననేతలకు పార్టీ శ్రేణుల ఘన స్వాగతం

**రామన్నపేట వెలుతురు న్యూస్ జూన్ 22:**



విదేశీ పర్యటనలను విజయవంతంగా పూర్తిచేసుకుని స్వదేశానికి తిరిగి విచ్చేస్తున్న కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ఉమ్మడి సూరారం గ్రామ మాజీ సర్పంచ్, బాచుప్పల గ్రామ అభివృద్ధి ప్రదాత,మరియు గ్రామ తొలి సర్పంచ్ దంపతులైన బొక్క కృష్ణవేణి పురుషోత్తం రెడ్డిలకు గ్రామ ప్రజలు,అభిమానులు మరియు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు హృదయపూర్వక స్వాగతం పలికారు.గ్రామ అభివృద్ధికి నిరంతరం శ్రమించే ఈ దంపతులు, తమ విదేశీ పర్యటన అనుభవాలతో మన ప్రాంతానికి మరిన్ని అభివృద్ధి ఫలాలను అందించాలని ఆకాంక్షిస్తూ, మార్గమధ్యంలో ఉన్న వారికి గ్రామ ప్రజలు మరియు కాంగ్రెస్ కార్యకర్తలు ఘనంగా సుస్వాగతం తెలియజేశారు.

# ఎమ్మెల్యే వేముల వీరేశంకు కృతజ్ఞతలు తెలిపిన సర్పంచ్ మారేపల్లి మల్లారెడ్డి

**రామన్నపేట వెలుతురు న్యూస్ జూన్ 22:**



నకిరేకల్, ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ వేముల వీరేశం గారిని కలిసి కృతజ్ఞతలు తెలియజేసిన కొమ్మాయిగూడెం సర్పంచ్ మారేపల్లి మల్లారెడ్డి రామన్నపేట, కొమ్మాయిగూడెం ప్రజల కృషి, ప్రభుత్వ విప్ నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం చూపిన చొరవతో, ఆధాని కంపెనీ వారు తాము ప్రవేశ పెడదాము అనుకున్న అంబుజ సిమెంట్ ఫ్యాక్టరీ కాకుండా, లాజిస్టిక్ పార్కు మరియు డ్రై పోర్టు పెడుతున్నట్టు నిన్న యాదాద్రి భువనగిరి కలెక్టరేట్ లో జరిగిన సమావేశంలో భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి మరియు ప్రభుత్వ విప్ నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం సమక్షంలో రామన్నపేట ప్రజాప్రతినిధులు, పెద్దల సమక్షంలో లిఖిత పూర్వకంగా లేఖ విడుదల చేయడం జరిగింది. ఇది రామన్నపేట ప్రాంత ప్రజలఅందరి విజయం. ఈ సిమెంట్ ఫ్యాక్టరీ ని ఇక్కడ నెలకొలపకుండా స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం చూపిన చొరవ, ఆయనకి రామన్నపేట ప్రాంత ప్రజల మీద ప్రేమ మరువలేనిది అని ఈ సందర్భంగా కలిసి కృతజ్ఞతలు తెలియచేయడం జరిగింది.ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షులు మోటే మారయ్య, ఉపసర్పంచ్ తీర్పాల ఐలయ్య, ఎర్ర శేఖర్, బాలగోని గణేష్, వార్డు సభ్యులు అంబాల అశోక్, వీరమళ్ళ లింగస్వామి, బోయపల్లి శ్రీనివాస్, యువజన కాంగ్రెస్ మాజీ మండల అధ్యక్షులు గురిజాల మహేష్ రెడ్డి, యువజన కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షులు కల్లూరి శివకుమార్, కొమ్మాయిగూడెం యువజన కాంగ్రెస్ అధ్యక్షులు వీరమళ్ళ పరశురామ్, ఆకిటి శివ తదితరులు పాల్గొన్నారు.

# మేమంతా ఉన్నాం.. స్నేహితుడి కుటుంబానికి అండగా చిన్ననాటి మిత్రులు

**రామన్నపేట వెలుతురు న్యూస్ జూన్ 22:**



తమతో కలిసి మెలిసి తిరిగిన స్నేహితుడు మృతి చెందగా.. అతని కుటుంబానికి అండగా మేమున్నామంటూ తోటి స్నేహితులు ముందుకొచ్చారు. యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం నీర్నెముల గ్రామానికి చెందిన గంగుల అమరేందర్ రెడ్డి మృతి చెందాడు. ఆపదలో ఉన్న అమరేందర్ రెడ్డి కుటుంబానికి స్నేహితులంతా కలిసి తమవంతుగా ఆర్థికసాయం అందజేసి ఎంతోమందికి స్ఫూర్తిగా నిలిచారు.అమరేందర్ రెడ్డి గతవారం మరణించిన విషయం తెలుసుకొని నీర్నెముల ప్రాథమిక కొన్నత పాఠశాలలో 1999- 2000 ఏడవ తరగతి బ్యాచ్ స్నేహితులంతా కలిసి వారి కుటుంబానికి ఆర్థిక సహాయం చేయడం జరిగింది. పూర్వ విద్యార్థి మృతి చెందిన విషయాన్ని వాట్సాప్ గ్రూప్ ద్వారా 1999-2000 ఏడవ తరగతి బ్యాచ్ మిత్రులకు సమాచారం చేరవేయగా అందరూ కలిసి వారికి తోచిన విధంగా ఆర్థిక సహాయం అందజేసి వారి ఔదార్యాన్ని చాటుకున్నారు. మృతి చెందిన స్నేహితుని కుటుంబానికి ఆర్థిక సాయం అందించడం ద్వారా తమ మానవత్వాన్ని చాటుకుంటూనే.. మరోవైపు ఎంతో మందికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు నోముల శివ కుమార్,సుర్వి మల్లేష్ సుర్వి వీరేశం, నోముల లింగస్వామి,నెమనంది రమేష్, గంగుల నవీన్ రెడ్డి, శాంకొండ్ల శ్రవణ్,ఆవుల మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

# నమ్మించి ప్లాట్ అమ్మిన ఘనుడు

- **అదే ప్లాట్ పై రుణం తీసుకున్న మోసగాడు రిమాండ్.**

**కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) జూన్ 22:**

నమ్మించి ప్లాట్ అమ్మి అదే ప్లాట్ పై రుణం తీసుకున్న మోసగాడిని బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. అమాయక దంపతులను నమ్మించి, వారి ఫ్లాట్ను అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకొని రూ. 54 లక్షల బ్యాంకు లోన్ పొంది మోసానికి పాల్పడిన ప్రధాన నిందితుడు బానోత్ ప్రసాద్ రావు (37), ఖమ్మం జిల్లాలో పోలీసులు అరెస్ట్ చేశారు. లోన్ ఏజెంట్ (DSA) గా పనిచేస్తున్న నిందితుడు, నిజాంపేట్లో నివసించే రాపర్తి మనోహర్, గౌరి అనే దంపతుల కుమార్తె పెళ్లి ఖర్చుల అత్యవసరాన్ని, వారి అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకున్నాడు. బాధితులకు రూ. 25 లక్షలు అప్పుగా ఇస్తూ, వారి ఫ్లాట్ ఒరిజినల్ పత్రాలను తాకట్టు పెట్టుకుని, ఆ తర్వాత భయపెట్టి ఆ ఫ్లాట్ను తన సంస్థ పేరిట మార్చుకున్నాడు. అనంతరం ఒక సాఫ్ట్వేర్ ఉద్యోగితో చేతులు కలిపి, ఆ ఫ్లాట్ను అతని పేరు మీదకు మార్చి ICICI బ్యాంక్ నుండి రూ. 54,24,000/- ల హోం లోన్ పొంది సొంతానికి వాడుకున్నాడు. జనవరి 2026లో బ్యాంక్ రికవరీ సిబ్బంది రాకతో ఈ వంచన వెలుగులోకి వచ్చింది. బాధితుల



ఫిర్యాదుతో బాచుపల్లి సిఐ సి.సతీష్ కుమార్ ఆధ్వర్యంలో పోలీస్ ఉన్నతాధికారుల సూచనల మేరకు దర్యాప్తు చేపట్టిన సబ్-ఇన్స్పెక్టర్ ఎం. సాయి విజ్ఞేష్ మరియు సిబ్బంది, 19.06.2026న ఖమ్మంలో నిందితుడిని అరెస్ట్ చేశారు. నిందితుడు నేరాన్ని ఒప్పుకోగా, అతని వద్ద నుండి 'వన్ప్లస్ ఓపెన్' మొబైల్ ఫోన్ను స్వాధీనం చేసుకున్నారు. ఇతనిపై రీసెంట్గా దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో కూడా ఇలాంటిదే ఒక మోసం కేసు నమోదైంది. అనంతరం నిందితుడిని రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరిచి జైలుకు పంపారు. పరారీలో ఉన్న మిగతా నిందితులు గురించి పోలీసు వారు విచారణ జరుపుతున్నారు. ఇలాంటి నిందితుల చేతిలో ఎవరైనా మోసపోయి ఉంటే, ధైర్యంగా ముందుకు వచ్చి సంబంధిత పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయాల్సిందిగా సిఐ తెలిపారు.

# అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలి: మేడ్చల్ కలెక్టర్కు టీయూడబ్ల్యూజే విజ్ఞప్తి

**మేడ్చల్, జూన్ 22 వెలుతురు:**

మేడ్చల్ జిల్లాలో విధులు నిర్వర్తిస్తున్న అర్హులైన వర్కింగ్ జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేయాలని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే) మేడ్చల్ జిల్లా శాఖ డిమాండ్ చేసింది. సోమవారం జిల్లా జర్నలిస్టుల ప్రతినిధుల బృందం టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు గడ్డమీది బాలరాజు ఆధ్వర్యంలో మేడ్చల్ జిల్లా కలెక్టర్ మను చౌదరిని కలిసి వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా బాలరాజు మాట్లాడుతూ, మేడ్చల్ అర్బన్ జిల్లా కావడంతో ప్రధాన పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియా సంస్థల నుంచి ప్రతి మండలంలో ఇద్దరి కంటే ఎక్కువ మంది విలేకరులు పనిచేస్తున్నారని తెలిపారు. అయితే ప్రస్తుత అక్రిడిటేషన్ జీవో 252 ప్రకారం మండలానికి ఒక్కరికే అక్రిడిటేషన్ ఇచ్చే వెసులుబాటు ఉండటంతో మిగిలిన అర్హులైన జర్నలిస్టులు



తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మీడియా సంస్థల సిఫార్సు లేఖలు కలిగి ఉండి, జీవో నిబంధనల మేరకు అర్హత ఉన్న ప్రతి ఒక్కరినీ గుర్తించి న్యాయం చేయాలని కలెక్టర్ను కోరారు. ప్రధాన పత్రికల్లో పనిచేస్తున్న వారికి అన్యాయం జరగకుండా చూడాలని, తద్వారా జిల్లాలోని జర్నలిస్టులందరికీ న్యాయం చేసిన వారవుతారని విజ్ఞప్తి చేశారు.సానుకూలంగా స్పందించిన కలెక్టర్ జర్నలిస్టుల విజ్ఞప్తిపై స్పందించిన కలెక్టర్ మను చౌదరి, జిల్లాలో అక్రిడిటేషన్ల విషయంలో ఏ ఒక్కరికీ అన్యాయం జరగనివ్వబోమని స్పష్టం చేశారు. జర్నలిస్టుల బృందం లేవనెత్తిన అంశాలపై సాధ్యాసాధ్యాలను పరిశీలించి, త్వరలో జరిగే జిల్లా అక్రిడిటేషన్ కమిటీ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట రామిరెడ్డి, జిల్లా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు రవిచంద్ర, జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు రామారావు, రవీందర్, రామకృష్ణ, బాల్ రెడ్డి, సునీల్, శ్రీరాములు, రచ్చ శ్రీనివాస్, హనుమంత రెడ్డి, యూనియన్ జిల్లా నాయకులు భూపాల్, మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఆరుట్ల తెలంగాణ పబ్లిక్ పాఠశాలను సందర్శించిన తెలంగాణ ఉద్యమకారుడు ఆనంగల్ల పరమేష్ వివిధ పార్టీల నాయకులు

- **స్థానిక ఆరుట్ల గ్రామ విద్యార్థులకు మొదటి ప్రాధాన్యత ఇచ్చి తెలంగాణ పాఠశాలలో చేర్చుకోవాలి పేరెంట్స్ కమిటీ రద్దుచేసి కొత్త కమిటీ వేయాలి**
- **తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుడు అనంగళ్ళ పరమేష్ వివిధ పార్టీల నాయకుల డిమాండ్**

**మంచాల వెలుతురు జూన్ 22:**

మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుడు అనంగళ్ళ పరమేష్ ఆ ధ్వర్యంలో వివిధ పార్టీల నాయకులు కలిసి తెలంగాణ పబ్లిక్ పాఠశాలను సందర్శించి పాఠశాల లో చేర్పించని విద్యార్థుల తల్లిదండ్రుల ఆవేదన విన్నారు అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సిద్ధగోని గిరిధర్ గౌడ్ ను కలిసి ఆరుట్లగ్రామానికి చెందిన విద్యార్థులందరికి అడ్మిషన్లు ఇచ్చిపాఠశాలలో చేర్చుకోవాలి పేరెంట్స్ కమిటీ రద్దుచేసి కొత్త కమిటీని ఏర్పాటు చేయాలని వి ద్యార్థుల తల్లిదండ్రులు నాయకులు డిమాండ్ చేశారు వెంటనే స్పందించిన ప్రధాన ఉపాధ్యాయు డు సిద్ధగొని గిరిధర్ గౌడ్ మాట్లాడుతూ క్లాసుల్లో సంఖ్యాకు మించి ఎక్కువ శాతం అడ్మిషన్లు రా వడంతో డ్రాపద్ధతిద్వారా విద్యార్థులను ఎంపిక చేసి విద్యార్థులకు అడ్మిషన్లు ఇచ్చామన్నారు డ్రాలో ఎంపిక కానీ వాళ్లు మాకు కూడా అడ్మిషన్లు కావాలని విద్యార్థుల తల్లిదండ్రులు అడుగు తుంటే ఏమి సమాధానం చెప్పాలో అర్థంకావడం లేదు అనిఅన్నారు కమిటీతో చర్చించి తప్పకుండా స్థానిక ఆరుట్ల గ్రామం విద్యార్థులకు అడ్మిషన్లు తీసుకు



నేలానా వంతుగా అధికారుల దృ ష్టికి తీసుకువెళ్లి కృషి చేస్తాను అన్నారు ఈకార్యక్రమంలో పుల్లగల్ల గోపాల్ నూకం రవి ముదిరాజ్ జోగు శేఖర్ ఆనంగల్ల పరమేష్ చీమర్ల భాస్కర్ బద్దు విజయ్ కుమార్ అనిపటి గణేష్ ప్రజాగళం దామెర భూపాల్ వర్త్య గణేష్ నాయక్ సుంకరి దానయ్యగౌడ్ బోద్రమోని అంజయ్య ముదిరాజ్ విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ బడిలో కుమార్తెను చేర్పించి ఆదర్శంగా నిలిచిన బూచినెల్లి సర్పంచ్



**జహీరాబాద్ వెలుతురు జూన్ 22:**

ప్రభుత్వ పాఠశాలలపై విశ్వాసం చాటుతూ సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండల బూచినెల్లి గ్రామ సర్పంచ్ అలిగే సునీత–శ్రీనివాస్ దంపతులు తమ కుమార్తె స్వీటీని గ్రామ ప్రాథమిక పాఠశాలలో 1వ తరగతిలో చేర్పించి ఆదర్శంగా నిలిచారు. ఈ సందర్భంగా నిర్వహించిన అక్షరాభ్యాస కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్, ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేట్ పాఠశాలలకు ఏమాత్రం తీసిపోవని, గ్రామంలోని ప్రతి ఒక్కరూ తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని పిలుపునిచ్చారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మండల విద్యాధికారి మాణయ్య మాట్లాడుతూ విద్యార్థులకు ఉచిత పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, యూనిఫాంలు, మధ్యాహ్న భోజనం, అల్పాహారం, రాగి జావ వంటి సౌకర్యాలు ప్రభుత్వం పూర్తిగా ఉచితంగా అందిస్తోందని తల్లిదండ్రులకు వివరించారు.పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శోభ హేమలత మాట్లాడుతూ ఈ ఒక్క రోజే 15 మంది విద్యార్థులు పాఠశాలలో నమోదు చేసుకున్నారని, పూర్తిగా ఇంగ్లీష్ మీడియంలోనే బోధన జరుగుతోందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విజయలక్ష్మి, శ్రీపాల్, విజయ్ కుమార్, రమేష్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు లాలయ్య, సంజీవ్ కుమార్, గోపాల్, నర్సింలు, గ్రామస్తులు జి. నర్సింలు, రాజమ్మ, రత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల హామీలు ఎక్కడ?.. రైతు సంక్షేమం ఎక్కడ?

- **కాంగ్రెస్ రైతు వ్యతిరేక ప్రభుత్వం...**
- **కాంగ్రెస్‌ను నిలదీసిన ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ నాయకుడు వై. నరోత్తం...**

**జహీరాబాద్ వెలుతురు జూన్ 22:**



రాష్ట్రంలో రైతులకు బోనస్, పంటల కొనుగోళ్లు, రైతు భరోసా, రైతు బీమా వంటి కీలక పథకాలు అందకుండా కాంగ్రెస్ ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలను అవలంబి స్తోందని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ నాయకుడు వై. నరోత్తం ఆరోపించారు. ప్రభుత్వం ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఆయన విమర్శించారు.సోమవారం జహీరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ప్రస్తుతం వర్షాభావ పరిస్థితుల కారణంగా రైతులు ఖరీఫ్ సాగు చేయలేని పరిస్థితి నెలకొందన్నారు. ప్రభుత్వం సకాలంలో నాణ్యమైన విత్తనాలు అందించకపోవడంతో రైతులు పొరుగున ఉన్న కర్ణాటక రాష్ట్రం నుంచి విత్తనాలు కొనుగోలు చేసి పంటలు వేసినా, వర్షాలు లేక అవి కూడా ఎండిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో అకాల వర్షాల వల్ల పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని అన్నారు.వరంగల్ రైతు డిక్లరేషన్‌లో అన్ని పంటలకు మద్దతు ధరతో పాటు రూ.500 బోనస్ ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చి, ఇప్పుడు బోనస్ లేదని, అన్ని పంటలను కొనుగోలు చేయబోమని చెప్పడం రైతులను మోసం చేయడమేనని విమర్శించారు. కేంద్రం కొనుగోలు చేసే పంటలకే పరిమితమవుతామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడం రైతు డిక్లరేషన్‌కు విరుద్ధమని పేర్కొన్నారు.కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కేంద్రం కొనుగోలు చేసినా, చేయకపోయినా రాష్ట్ర ప్రభుత్వమే అన్ని పంటలను కొనుగోలు చేసి రైతులకు మద్దతు ధర కల్పించిందన్నారు. యూరియా సరఫరాలో కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాలు రెండూ రైతుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు.రైతు భరోసా, రైతు బీమా, బోనస్ చెల్లింపుల్లో ప్రభుత్వం భారీగా బకాయిలు పెట్టిందని, మరణించిన రైతుల కుటుంబాలకు కూడా రైతు బీమా నిధులు అందడం లేదని అన్నారు. దేశానికి అన్నం పెట్టే రైతుకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని, అన్ని పంటలను యథావిధిగా కొనుగోలు చేయాలని బీఆర్ఎస్ పార్టీ తరఫున డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ స్వామిదాస్, ఎస్. గోపాల్, సి. సంఘమేశ్వర్, పవన్ రాథోడ్, మేఘనాథ్ తదితరులు పాల్గొన్నారు.

# షేకాపూర్‌లో రూ.5 లక్షల సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శ్రీకారం



- **ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధులతో గ్రామాభివృద్ధికి ప్రాధాన్యం...**
- **నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టిన కొనింటి మిథున్ రాజ్....**

**జహీరాబాద్, జూన్ 22 (వెలుతురు):**

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలం షేకాపూర్ గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (MGNREGS) నిధులతో రూ.5 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను కొనింటి మిథున్ రాజ్ సోమవారం ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు తట్టు నారాయణ, గ్రామ సర్పంచ్ చెస్మోద్దీన్, మాజీ సర్పంచ్ చిన్నా రెడ్డితో కలిసి ఆయన శంకుస్థాపన నిర్వహించారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని, సీసీ రోడ్ల నిర్మాణంతో ప్రజలకు రాకపోకలు సులభతరం అవుతాయని ఈ సందర్భంగా కొనింటి మిథున్ రాజ్ తెలిపారు.గ్రామాభివృద్ధికి ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు సహకారంతో పలు అభివృద్ధి పనులు చేపడుతున్నామని, ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు నిరంతరం కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. గ్రామాల అభివృద్ధిలో ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు సమన్వయంతో పనిచేస్తేనే సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచులు మచ్చేందర్, గోవర్ధన్ రెడ్డి, మోహన్ రాథోడ్, రాథోడ్ భీమ్‌రావు నాయక్, అరుణ్ కుమార్, మాజీ సర్పంచులు కరుణ్‌రాజ్, అమీత్ కుమార్, రేషన్ డీలర్స్ అసోసియేషన్ జహీరాబాద్ డివిజన్ అధ్యక్షుడు విజేందర్ రెడ్డి, మాజీ డిప్యూటీ సర్పంచ్ మహబూబ్ ఖాన్, సీనియర్ నాయకులు సాదిక్, శ్రీకాంత్, వార్డు సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్ - వరంగల్ జాతీయ రహదారిపై కొత్తగట్టు వద్ద 'ర్యాంప్' ఏర్పాటుకు లైన్ క్లియర్

- **కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ చొరవతో వేగవంతమైన పనులు...**

**కరీంనగర్ వెలుతురు జూన్ 22:**





కరీంనగర్ – వరంగల్ జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా, శంకరపట్నం మండలం కొత్తగట్టు వద్ద ఇరువైపులా ర్యాంప్ ఏర్పాటు చేయాలని స్థానికులు చేస్తున్న విజ్ఞప్తికి మోక్షం లభించింది. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆదేశాలతో హైవే అధికారులుస్పందించి,పనులుచేపట్టేందుకు సిద్ధమయ్యారు. గతంలో కొత్తగట్టు గ్రామ ప్రజలు, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకటరెడ్డి ఆధ్వర్యంలో కేంద్ర మంత్రిని కలిసి తమ ప్రాంతంలో రహదారి ఇరువైపులా ర్యాంప్‌ను ఏర్పాటు చేయాలనివిన్నవించారు. ర్యాంప్ లేకపోవడం వల్ల స్థానికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని వారు వివరించారు.ప్రజల విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్, ఇటీవల హైవే ప్రాజెక్ట్ డైరెక్టర్ భరద్వాజ్ కు కొత్తగట్టు ప్రాంత సమస్య పరిష్కరించాలని సూచించారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని, రహదారికి ఇరువైపులా ర్యాంప్‌ను ఏర్పాటు చేయాలని ఆయన స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.మంత్రి ఆదేశాల మేరకు, అధికారులు క్షేత్రస్థాయిలో పనులను పరిశీలించి, ర్యాంప్ నిర్మాణానికి అవసరమైన చర్యలను ప్రారంభించారు. దీనితో కొత్తగట్టు, చుట్టుపక్కల గ్రామస్తుల రవాణా ఇబ్బందులు తొలగిపోనున్నాయి.

# 27వ డివిజన్ అంబేద్కర్ నగర్‌లో రూ.6.5 లక్షల రూపాయల నిధులతో పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన చేసిన నగర మేయర్ కొలగాని శ్రీనివాస్





**కరీంనగర్ వెలుతురు జూన్ 22:**

కరీంనగర్ నగరపాలక సంస్థ అభివృద్ధి కార్యక్రమాలలో భాగంగా 27వ డివిజన్ అంబేద్కర్ నగర్‌లో రూ.6.5 లక్షల మున్సిపల్ సాధారణ నిధులతో చేపట్టనున్న తాగునీటి పైప్‌లైన్ పనులకు నగర మేయర్ శ్రీ కొలగాని శ్రీనివాస్ గారు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, నగర ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే నగరపాలక సంస్థ ప్రధాన లక్ష్యమని అన్నారు. ప్రతి డివిజన్‌లో ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులను ప్రాధాన్యత ఆధారంగా చేపడుతూ, తాగునీటి సరఫరా, రహదారులు, డ్రైనేజీలు వంటి మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు.అంబేద్కర్ నగర్ ప్రాంత ప్రజలకు తాగునీటి సరఫరా మరింత మెరుగుపడేలా ఈ పైప్‌లైన్ పనులు ఉపయోగపడతాయని, పనులను నాణ్యత ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో 27వ డివిజన్ కార్పొరేటర్ శ్రీమతి బొట్ల శ్యామల కిరణ్, మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.

# టీసీపిఎల్ ఎంప్లాయిస్ యూనియన్‌కు కొత్త నాయకత్వం

- **కంపెనీ అభివృద్ధే కార్మికుల అభివృద్ధికి బాట : ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి**

**తూప్రాన్, వెలుతురు జూన్ 22:**





మెదక్ జిల్లా, తూప్రాన్ మండలం, బ్రాహ్మణపల్లి లోని టాటా కన్స్యూమర్ ప్రొడక్ట్స్ లిమిటెడ్ (టీసీపిఎల్) కంపెనీ కార్మిక సంఘం నూతన అధ్యక్షుడిగా కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా సోమవారం టీసీపిఎల్ ఎంప్లాయిస్ యూనియన్ , మేనేజ్మెంట్ ఘనంగా స్వాగతం పలికి సన్మానించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కామారెడ్డి ఎమ్మెల్యే, టీసీపిఎల్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రెసిడెంట్ కాటిపల్లి వెంకటరమణారెడ్డి గారు కంపెనీ గెట్ ముందు బీఎంఎస్ జెండాను ఆవిష్కరించి కార్మికులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక కుటుంబంలో భార్యాభర్తలు పరస్పర సహకారంతో ముందుకు సాగినట్లే కంపెనీ యాజమాన్యం, కార్మికులు కూడా ఐక్యంగా పనిచేస్తే సంస్థ అభివృద్ధి చెందడంతో పాటు కార్మికుల జీవితాలు కూడా మెరుగుపడతాయని అన్నారు. కంపెనీ బాగుంటేనే కార్మికుల సంక్షేమం సాధ్యమవుతుందని, చిన్న చిన్న సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు.కంపెనీ అభివృద్ధి, కార్మికుల ఎదుగుదల ఒకదానికొకటి విడదీయరాని సంబంధం కలిగి ఉన్నాయని పేర్కొన్నారు. యాజమాన్యం, కార్మికులు పరస్పరం లాగుడుదీతలకు దిగితే సమస్యలు జటిలమై ఇరువర్గాలకు నష్టం జరిగే ప్రమాదం ఉందన్నారు. కార్మిక నాయకుడిగా, యూనియన్ అధ్యక్షుడిగా కార్మికుల సమస్యల పరిష్కారంలో సమర్థవంతమైన మధ్యవర్తిత్వం నిర్వహించి న్యాయం జరిగేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.రాజకీయాల్లో అవినీతికి తాను పూర్తిగా వ్యతిరేకమని, ప్రజల డబ్బును దుర్వినియోగం చేసే వారిని సహించనని స్పష్టం చేశారు. ప్రజల విశ్వాసంతో గత, ప్రస్తుత ముఖ్యమంత్రులపై విజయం సాధించిన ఎమ్మెల్యేగా తన బాధ్యతను ఎల్లప్పుడూ గుర్తుంచుకుంటానని చెప్పారు. అవసర సమయంలో అండగా నిలబడటమే నిజమైన సేవ అని, కష్టకాలంలో ఇచ్చే ధైర్యం ఎన్నో కుటుంబాలకు బలాన్నిస్తుందని పేర్కొన్నారు.కార్మికునికి న్యాయం జరిగితే ఆ కుటుంబం అభివృద్ధి చెందుతుందని, తాను పదవిని ఆడంబరంగా, అలంకారంగా కాకుండా బాధ్యతగా భావించే వ్యక్తినని తెలిపారు. టీసీపిఎల్ మేనేజ్మెంట్, కార్మికులు సానుకూల దృక్పథంతో ముందుకు సాగుతున్నందున సంస్థ మరింత అభివృద్ధి చెందే అవకాశాలు ఉన్నాయని అన్నారు. ఒక ఉద్యోగం పై అతని కుటుంబంలోని నల్గురు సభ్యుల జీవితం ఆధారపడి ఉంటుందని, అందుకే ప్రతి ఉద్యోగి సంక్షేమం సంస్థ పురోగతితో ముడిపడి ఉందన్నారు.ట్రేడ్ యూనియన్ వ్యవహారాలు తనకు కొత్త అయినప్పటికీ కేవలం రెండు నెలల్లోనే యూనియన్ చట్టాలు, నిబంధనలను అధ్యయనం చేసి కార్మికులు, యాజమాన్యం మధ్య వారధిగా పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నానని వెల్లడించారు. సంస్థలోని ప్రతి సమస్యను చర్చల ద్వారా పరిష్కరించి కార్మికులకు న్యాయం జరిగేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. టీసీపిఎల్ కార్మిక సంఘానికి నూతన నాయకత్వం లభించడం సంస్థలో కార్మిక–యాజమాన్య సంబంధాలను మరింత బలోపేతం చేస్తుందని, కార్మిక సంక్షేమంతో పాటు పరిశ్రమ అభివృద్ధికి ఇది దోహదపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీసీపిఎల్ సైట్ హెడ్ శివకుమార్, హెచ్.అర్ కోటేశ్వర రావు, క్వాలిటీ ఆఫీసర్ రాకేష్, ప్రొడక్షన్ మేనేజర్ సుధాకర్ రెడ్డి, మెయింటెనెన్స్ ఇన్‌చార్జి రంగనాయకులు, బీజేపీ రాష్ట్ర నాయకులు ఎం. గిరీష్ రెడ్డి, పార్లమెంట్ ఇన్‌చార్జి వర్గంటి రామ్‌మోహన్ గౌడ్, బిజెపి పట్టణ అధ్యక్షులు భూమన్నగారి జానకిరామ్ గౌడ్, మండల అధ్యక్షులు పిట్ల పోచయ్య ముదిరాజ్, పడాలపల్లి కౌన్సిలర్ సత్యనారాయణ, సంఖ్య యాదగిరి, రఘువీరారెడ్డి, వెంకట నాగేంద్ర గౌడ్, జక్కిడి నరేందర్ రెడ్డి (బుల్లెట్ రాజు), టాటా కంజుమర్ ప్రొడక్ట్ లిమిటెడ్ ఎంప్లాయిస్ యూనియన్ జనరల్ సెక్రెటరీ లంబ లవకుమార్ యాదవ్, జాయింట్ సెక్రెటరీ బొంది శ్రీనివాస్ గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ జి. నర్సింగ్‌రావు, వర్కింగ్ ప్రెసిడెంట్ వి. రఘుపతి రెడ్డి, టి. వీరప్రసన్న, ట్రెజరర్ బి. వెంకట్రావు, ఆర్గనైజింగ్ సెక్రటరీలు పి. ప్రవీణ్, జి. సత్యనారాయణ, వైస్ ప్రెసిడెంట్లు కే. దైవాదీనం, ఎల్. మహేష్ కుమార్, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు ఎం.రామశర్మ, కార్మిక నాయకులు, మహిళా కార్మికులు, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# జహీరాబాద్‌లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో SIR అవగాహన సదస్సు

- **ఓటు చోరీపై అప్రమత్తంగా ఉండాలి...**
- **నెహ్రూ సేవలను వంద జన్మలెత్తినా అధిగమించలేరు....**
- **ఏఐసీసీ కార్యదర్శి, తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జి సచిన్ సావంత్...**

**జహీరాబాద్ వెలుతురు, జూన్ 22:**





ప్రధాని నరేంద్ర మోదీ 12 ఏళ్ల పాలనను మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ పాలనతో పోల్చి బీజేపీ నేతలు గొప్పలు చెప్పుకోవడం హాస్యాస్పదమని ఏఐసీసీ కార్యదర్శి, తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జి సచిన్ సావంత్ విమర్శించారు. దేశ నిర్మాణం, ప్రజాస్వామ్య బలోపేతానికి నెహ్రూ చేసిన సేవలను ఇంకా వంద జన్మలెత్తినా అధిగమించడం సాధ్యం కాదని ఆయన పేర్కొన్నారు.సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని ఫ్రెండ్స్ ఫంక్షన్ హాల్‌లో టీపీసీసీ ఆదేశాల మేరకు ప్రత్యేక సమగ్ర సవరణ (SIR) ఓటర్ల జాబితాపై అవగాహన సదస్సు, శిక్షణ శిబిరం నిర్వహించారు. కార్యక్రమానికి సచిన్ సావంత్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి, ఎంపీ సురేష్ కుమార్ షెట్కార్, పార్లమెంట్ కో–ఆర్డినేటర్ సయ్యద్ అజమతుల్లా హుస్సైని, రాష్ట్ర సెట్విన్ చైర్మన్ గిరిధర్ రెడ్డి, అసెంబ్లీ కో–ఆర్డినేటర్, బీఎల్ఏల మాస్టర్ ట్రైనర్ మహమ్మద్ గౌస్ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జహీరాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి పట్టున్న ప్రాంతాల్లో సానుభూతిపరుల ఓట్లను అక్రమంగా తొలగించే ప్రయత్నాలు జరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. ప్రతి అర్హుడైన పౌరుడు ఓటరు జాబితాలో తన పేరు ఉందో లేదో తప్పనిసరిగా పరిశీలించుకోవాలని సూచించారు. అలాగే అక్రమంగా ఓట్ల తొలగింపు, నకిలీ ఓట్ల చేర్పు లేదా ఓటు చోరీకి సంబంధించిన ప్రయత్నాలు కనిపిస్తే వెంటనే ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.ప్రత్యేక సమగ్ర సవరణ (SIR) ప్రక్రియ ద్వారా కొత్త ఓటర్ల నమోదు, చిరునామా మార్పులు, పేర్ల సవరణలు, మరణించిన లేదా అర్హత కోల్పోయిన వారి పేర్ల తొలగింపు వంటి అంశాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బూత్ స్థాయి ప్రతినిధులు, పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు గ్రామాలు, వార్డుల వారీగా ప్రజలకు అవగాహన కల్పించి ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో ఉండేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జహీరాబాద్ మున్సిపల్ చైర్మన్ యూనుస్, ఆత్మ కమిటీ చైర్మన్ రామలింగారెడ్డి, కోహిర్ మున్సిపల్ చైర్మన్ అశోక్, మాజీ ఇండస్ట్రియల్ చైర్మన్ తన్వీర్, సీడీసీ చైర్మన్ ముబీన్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఉజ్వల్ రెడ్డి, మాజీ మండల అధ్యక్షులు, కౌన్సిలర్లు, సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు, బూత్ స్థాయి ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# కోర్టుకు అల్లు అర్జున్ డుమ్మా!

- షూటింగ్ సాకుతో పిటిషన్
- విచారణ జూలై 6కు వాయిదా
- సంధ్య థియేటర్ కేసు విచారణ
- ఇతర 18 మంది నిందితుల హాజరు
- బాండ్లపై సంతకాలు

**హైదరాబాద్ వెలుతురు జూన్ 22:**



టాలీవుడ్ ప్రముఖ కథానాయకుడు, 'ఐకాన్ స్టార్' అల్లు అర్జున్ సోమవారం నాంపల్లి కోర్టు విచారణకు హాజరు కాలేదు. ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లోని సంధ్య థియేటర్ వద్ద గతంలో జరిగిన ఘోర తొక్కిసలాట ఘటనకు సంబంధించిన కేసులో ఆయన ఈరోజు కోర్టుకు వ్యక్తిగతంగా హాజరు కావాల్సి ఉంది. ఈ మేరకు గతంలోనే న్యాయస్థానం సమన్లు జారీ చేసిన సంగతి తెలిసిందే. అయితే, ప్రస్తుతం తాను సినిమా షూటింగ్‌లో బిజీగా ఉన్నందున భౌతికంగా హాజరు కావడం సాధ్యం కాదంటూ అల్లు అర్జున్ తన న్యాయవాది ద్వారా కోర్టుకు సమాచారం అందించారు. వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరుతూ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు.హైదరాబాద్‌లోని సంధ్య థియేటర్ ప్రాంగణంలో జరిగిన ప్రమాదంపై నమోదైన కేసులో తీవ్రత దృష్ట్యా ఈ నెల 22న అల్లు అర్జున్ ఖచ్చితంగా కోర్టుకు రావాలని నాంపల్లి న్యాయస్థానం గతంలోనే స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. అయితే, కోర్టు గడువు ముగిసే సమయానికి కూడా నటుడు అక్కడ ప్రత్యక్షం కాలేదు. షూటింగ్ బిజీ షెడ్యూల్ కారణంగానే ఆయన రాలేకపోయారని తెలుస్తోంది. కోర్టుకు రాకపోవడంపై సర్వత్రా ఆసక్తికర చర్చ నడుస్తోంది.ఈ కేసుకు సంబంధించి కోర్టు మొత్తం 19 మంది నిందితులకు సమన్లు జారీ చేసింది. జూన్ 22న అందరూ న్యాయమూర్తి ఎదుట హాజరుకావాలని ఆదేశించింది. కోర్టు ఆదేశాల ప్రకారం.. అల్లు అర్జున్ మినహా మిగిలిన 18 మంది నిందితులు సోమవారం ఉదయమే నాంపల్లి కోర్టుకు చేరుకున్నారు. వీరంతా న్యాయమూర్తి సమక్షంలో విచారణకు హాజరై, తమకు కేటాయించిన వ్యక్తిగత షూరిటీ బాండ్లపై సంతకాలు పూర్తి చేశారు.ప్రస్తుతం అల్లు అర్జున్ బాలీవుడ్ పరిధిలోని ముంబై నగరంలో ఒక ముఖ్యమైన సినిమా షూటింగ్‌లో ఉన్నట్లు ఆయన లీగల్ టీమ్ ప్రకటించింది. ముంబై షెడ్యూల్ ఎంతో కీలకమైనది కావడం వల్లే ఆయన హైదరాబాద్ వచ్చి విచారణకు భౌతికంగా హాజరుకాలేకపోతున్నారని జాతీయ వార్తా సంస్థ 'ఏఎన్ఐ' ప్రతినిధులకు ఆయన న్యాయవాదులు ముందుగా తెలియజేశారు.కోర్టుకు స్వయంగా రాలేని పక్షంలో.. అల్లు అర్జున్ వీడియో కాన్ఫరెన్స్ (వర్చువల్ పద్ధతి) ద్వారా నాంపల్లి కోర్టు విచారణలో పాల్గొంటారని మొదట ఆయన లీగల్ టీమ్ ప్రచారం చేసింది. ముంబై షూటింగ్ స్పాట్ నుంచే ఆయన ఆన్‌లైన్ ద్వారా హాజరవుతారని భావించారు. అయితే, సాంకేతిక లేదా ఇతర కారణాల వల్ల ఆయన వర్చువల్‌గా కూడా విచారణకు హాజరుకాలేదు. దీంతో చేసేదేం లేక అల్లు అర్జున్ తరఫు న్యాయవాది కోర్టులో అధికారికంగా 'ఆబ్సెంట్ పిటిషన్' దాఖలు చేయాల్సి వచ్చింది.నిందితుడి స్థానంలో ఉన్న అల్లు అర్జున్ అటు భౌతికంగా, ఇటు వర్చువల్‌గా కూడా కోర్టు విచారణకు రాకపోవడంపై న్యాయస్థానం స్పందించింది. ఆయన వ్యక్తిగతంగా హాజరుకానందున, అందుకు గల సరైన కారణాలను వివరిస్తూ తక్షణమే ఒక సమగ్రమైన 'మెమో' దాఖలు చేయాలని అల్లు అర్జున్ న్యాయవాదులకు కోర్టు గట్టిగా సూచించింది. చట్టం ముందు అందరూ సమానమేనని స్పష్టం చేసింది.రెండు వైపులా వాదనలు విన్న అనంతరం నాంపల్లి న్యాయమూర్తి ఈ కేసు తదుపరి విచారణను వచ్చే నెల జూలై 6వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. కాగా, వచ్చే విచారణ సమయానికైనా అల్లు అర్జున్ అందుబాటులోకి వస్తారా అన్న ప్రశ్నకు ఆయన లాయర్ సమాధానమిచ్చారు. జూలై 6న జరిగే తదుపరి విచారణకు అల్లు అర్జున్ ఖచ్చితంగా వర్చువల్ పద్ధతిలో న్యాయస్థానం ముందు హాజరవుతారని న్యాయమూర్తికి హామీ ఇచ్చారు.అసలు ఈ వివాదం 2024 డిసెంబర్ నెలలో ప్రారంభమైంది. అప్పట్లో మోస్ట్ అవేటెడ్ మూవీ 'పుష్ప 2: ది రూల్' సినిమా ఘనంగా విడుదలవుతున్న సందర్భంగా హైదరాబాద్ ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లోని సంధ్య థియేటర్ ఆవరణలో భారీ ప్రీమియర్ ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ వేడుకకు హీరో అల్లు అర్జున్ వస్తున్నారనే సమాచారంతో వేలాది మంది అభిమానులు ఒక్కసారిగా థియేటర్ ముట్టడించారు. ఈ క్రమంలో జరిగిన ఘోర తొక్కిసలాటలో రేవతి అనే ఒక వివాహిత ప్రాణాలు కోల్పోగా.. ఆమె కుమారుడు శ్రీతేజ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. పలువురు అభిమానులు కూడా క్షతగాత్రులయ్యారు.ఈ ప్రమాదంపై బాధితురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు చిక్కడపల్లి పోలీసులు క్రిమినల్ కేసు నమోదు చేశారు. ఈ కేసులో సంధ్య థియేటర్ యాజమాన్యం మరియు నిర్వాహకులను ఏ1 నుంచి ఏ10 నిందితులుగా చేర్చారు. తొక్కిసలాట జరగడానికి నటుడి రాక, భద్రతా లోపాలే కారణమంటూ అల్లు అర్జున్‌ను ఈ కేసులో ఏ11 నిందితుడిగా పోలీసులు చేర్చడం అప్పట్లో టాలీవుడ్‌లో పెను సంచలనం సృష్టించింది. ఈ కేసు దర్యాప్తులో భాగంగా గతంలో చిక్కడపల్లి పోలీసులు అల్లు అర్జున్‌ను అరెస్ట్ చేయగా, ఆయన ఒక రాత్రి మొత్తం జైలు గదిలో గడపాల్సి వచ్చింది. ఆ మరుసటి రోజు ఉదయమే ఆయనకు కోర్టు నుంచి బెయిల్ లభించింది.

# నేడే గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖలపై రాష్ట్రస్థాయి సమీక్ష

- అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాల పురోగతిపై జిల్లా అధికారులతో మంత్రి సీతక్క సమావేశం

**హైదరాబాద్, వెలుతురు జూన్ 22:**



గ్రామీణ తెలంగాణ అభివృద్ధిని మరింత వేగవంతం చేయడంతో పాటు ప్రభుత్వ పథకాల అమలులో జాప్యాలకు తావులేకుండా చర్యలు తీసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. ఈ క్రమంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల పరిధిలో కొనసాగుతున్న వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పురోగతిని సమీక్షించేందుకు మంగళవారం రాజేంద్రనగర్‌లోని టీజీఐఆర్డీ (TGIRD)లో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క అధ్యక్షతన ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించనున్నారు.ఈ సమావేశానికి జిల్లా అదనపు కలెక్టర్లు (స్థానిక సంస్థలు), జడ్పీ సీఈవోలు, డీఆర్‌డీఓలు, డీపీఓలు, ఇంజినీరింగ్ అధికారులు, మిషన్ భగీరథ ప్రతినిధులతో పాటు సంబంధిత శాఖల జిల్లా స్థాయి అధికారులు హాజరుకానున్నారు.గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలు, కూలీలకు ఉపాధి కల్పన, పెండింగ్ మెటీరియల్ బిల్లుల చెల్లింపులు, అంగన్‌వాడీ భవనాలు, మహిళా శక్తి భవనాలు, గ్రామ పంచాయతీ కార్యాలయాలు, వర్క్ షెడ్లు, గోదాములు, పాఠశాల టాయిలెట్ల నిర్మాణ పురోగతితో పాటు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, జల సంరక్షణ పనుల అమలును మంత్రి సీతక్క సమీక్షించనున్నారు.అదే విధంగా ప్రధానమంత్రి కృషి సించాయీ యోజన కింద చేపడుతున్న సహజ వనరుల పరిరక్షణ, భూసార పరిరక్షణ, వ్యవసాయ ఉత్పాదకత పెంపు చర్యలపై అధికారులతో చర్చించనున్నారు. గ్రామపంచాయతీల పనితీరు, గ్రామ కార్యదర్శుల హాజరు, పారిశుధ్య నిర్వహణ, ఇంటి పన్నుల వసూళ్లు, 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులు, ఆడిట్ ప్రక్రియల పురోగతిని కూడా పరిశీలించనున్నారు.స్వచ్ఛ భారత్ మిషన్ (గ్రామీణ) కింద వ్యక్తిగత మరుగుదొడ్లు, కమ్యూనిటీ సోక్‌పిట్లు, ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ కేంద్రాలు, ఓడీఎఫ్ ప్లస్ లక్ష్యాల సాధనపై ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించనున్నారు. అలాగే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని మిషన్ భగీరథ ద్వారా తాగునీటి సరఫరా, నిర్వహణ వ్యవస్థ, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు నీటి అందుబాటుపై అధికారులకు అవసరమైన సూచనలు చేయనున్నారు.గ్రామీణ రహదారుల నిర్మాణం, మరమ్మతులు, నిర్వహణ పనుల పురోగతిని పీఆర్ ఇంజినీరింగ్ విభాగంతో సమీక్షించనున్న మంత్రి సీతక్క, సెర్ప్ ఆధ్వర్యంలో మహిళా సంఘాల బలోపేతం, మహిళా శక్తి కార్యక్రమాలు, బ్యాంకు అనుసంధానం, జీవనోపాధి అవకాశాల విస్తరణ, పోషకాహారం, మహిళా భద్రత, లింగ సమానత్వ కార్యక్రమాల అమలుపై కూడా సమగ్రంగా చర్చించనున్నారు.గ్రామీణ ప్రాంతాల్లో అమలవుతున్న ప్రతి పథకం ప్రజలకు నేరుగా ప్రయోజనం చేకూరేలా జిల్లా యంత్రాంగం బాధ్యతాయుతంగా పనిచేయాలని, అభివృద్ధి కార్యక్రమాల్లో సమన్వయం పెంచి లక్ష్యాలను వేగంగా పూర్తి చేయాలని మంత్రి సీతక్క సమావేశంలో అధికారులకు దిశానిర్దేశం చేయనున్నారు.

# జాతీయ లోక్ అదాలత్ ద్వారా సైబర్ నేర బాధితులకు రూ.21.90 కోట్ల రీఫండ్

- 24 పోలీస్ స్టేషన్ల పరిధిలో 2232 కేసుల్లో రిఫండ్ ఆదేశాలు
- సైబరాబాద్ పోలీసుల కృషిని అభినందించిన టీజీసీఎస్‌బీ డైరెక్టర్ శిఖా గోయల్, ఐపీఎస్.

**సైబరాబాద్ వెలుతురు జూన్ 22:**



ఈ నెల 20వ తేదీన నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ విశేష ఫలితాలను సాధించింది. సైబర్ నేరాల బారిన పడిన బాధితులకు సత్వర న్యాయం అందించడంతో పాటు, మోసపోయిన నగదును తిరిగి అందించే దిశగా కీలక ముందడుగు వేసింది.జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని 24 పోలీస్ స్టేషన్లలో నమోదైన మొత్తం 2,232 సైబర్ నేర కేసుల్లో బాధితులకు అనుకూలంగా గౌరవ న్యాయస్థానాల నుంచి రీఫండ్ ఆదేశాలు పొందడంలో సైబరాబాద్ పోలీసులు విజయవంతమయ్యారు. దీని ద్వారా బాధితులకు మొత్తం రూ.21.90 కోట్ల నగదు తిరిగి అందేలా చర్యలు చేపట్టారు.

**పోలీస్ స్టేషన్ల వారీగా రీఫండ్ వివరాలు ఇలా ఉన్నాయి:**

సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ – రూ.20.54 కోట్లు
అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ – రూ.45.94 లక్షలు
కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ – రూ.12.55 లక్షలు
ఇతర పోలీస్ స్టేషన్లు – రూ.78.43 లక్షలు

గౌరవ న్యాయస్థానాల ఆదేశాల మేరకు అవసరమైన ప్రక్రియ పూర్తైన అనంతరం సంబంధిత బ్యాంకులు ఈ మొత్తాలను బాధితుల ఖాతాల్లో జమ చేయనున్నాయి.

సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో సైబర్ నేరాల బాధితులకు సంబంధించిన నగదు రికవరీ ప్రక్రియలో భాగంగా ఇప్పటివరకు సైబర్ నేరగాళ్లు కొల్లగొట్టిన కోట్లాది రూపాయలలో గణనీయమైన మొత్తాన్ని గుర్తించి, బాధితులకు తిరిగి అందించడంలో సైబరాబాద్ పోలీసులు ప్రత్యేక విజయం సాధించారు. ఇప్పటివరకు మొత్తం రూ.21.90 కోట్ల మేర నగదు రీఫండ్ చేయడం ద్వారా సైబరాబాద్ పోలీసులు విశిష్టమైన రికార్డు నెలకొల్పారు.ఈ విజయానికి ప్రధాన కారణం సైబరాబాద్ పోలీసుల సమగ్ర ఆర్థిక దర్యాప్తు. దర్యాప్తు అధికారులు వివిధ బ్యాంకులు, ఆర్థిక సంస్థలతో సమన్వయం చేసుకుంటూ ఖాతాల వివరాలు, లావాదేవీల రికార్డులు, కేవైసీ సమాచారాన్ని సేకరించారు. నేరగాళ్లు నగదును ఏయే ఖాతాల ద్వారా బదిలీ చేశారనే అంశంపై దశలవారీగా విశ్లేషణ నిర్వహించి, సేకరించిన ఆధారాలతో గౌరవ న్యాయస్థానాల్లో రీఫండ్ పిటిషన్లు దాఖలు చేయడం ద్వారా బాధితులకు సత్వర ఆర్థిక ఉపశమనం కల్పించారు.జాతీయ లోక్ అదాలత్ విజయవంతం కావడంలో న్యాయవ్యవస్థ, పోలీసు శాఖ, బ్యాంకులు, ఇతర సంబంధిత విభాగాల సమన్వయం కీలక పాత్ర పోషించింది. ఈ విధమైన సమిష్టి కృషి ద్వారా సైబర్ నేరాల బాధితులకు త్వరితగతిన న్యాయం అందుతోందని అధికారులు తెలిపారు.ఈ సందర్భంగా సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్, ఐపీఎస్‌ను మరియు ఈ ప్రక్రియలో పాల్గొన్న పోలీసు సిబ్బందిని తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీఎస్‌బీ) డైరెక్టర్ మరియు హోంశాఖ ముఖ్య కార్యదర్శి శిఖా గోయల్, ఐపీఎస్ ప్రత్యేకంగా అభినందించారు. సైబర్ నేరాల బాధితులకు ఆర్థిక ఉపశమనం కల్పించడంలో సైబరాబాద్ పోలీసుల సేవలు ప్రశంసనీయమని ఆమె పేర్కొన్నారు.

**ప్రజలకు సూచనలు:**

ఆన్‌లైన్ పెట్టుబడి మోసాలు, టాస్క్ ఫ్రాడ్‌లు, డిజిటల్ అరెస్ట్ మోసాలు, నకిలీ కస్టమర్ కేర్ మోసాలు, ఫిషింగ్ దాడుల పట్ల అప్రమత్తంగా ఉండాలి.ఓటీపీలు, బ్యాంకింగ్ వివరాలు, సీవీవీ నంబర్లు, యూపీఐ పిన్‌లు, పాస్‌వర్డ్‌లు ఎవరికీ తెలియజేయకూడదు.ఏదైనా చెల్లింపు చేసే ముందు వెబ్‌సైట్లు, మొబైల్ యాప్‌లు, పెట్టుబడి వేదికల ప్రామాణికతను ధృవీకరించాలి.సైబర్ నేరాలకు గురైన వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేయడం లేదా www.cybercrime.gov.in పోర్టల్‌లో ఫిర్యాదు నమోదు చేయాలి.లావాదేవీల వివరాలు, స్క్రీన్‌షాట్‌లు, మొబైల్ నంబర్లు, చాట్ రికార్డులను భద్రపరచాలి.లోక్ అదాలత్‌కు సంబంధించిన నోటీసులు అందినప్పుడు తప్పనిసరిగా హాజరై సహకరించాలి.

# నషా ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం

**సైబరాబాద్ వెలుతురు జూన్ 22:**



నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం రోజున సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ ప్రధాన కార్యాలయంలోని మెయిన్ కాన్ఫరెన్స్ హాల్‌లో అవగాహన పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ అడ్మినిస్ట్రేషన్ డీసీపీ టి. అన్నపూర్ణ, క్రైమ్ డీసీపీ ముత్యం రెడ్డి, సైబర్ క్రైమ్స్ డీసీపీ సాయి మనోహర్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొని పోస్టర్‌ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ యువతను మత్తు పదార్థాల బారిన పడకుండా కాపాడేందుకు ప్రభుత్వం, పోలీసు శాఖ వివిధ విభాగాల సమన్వయంతో విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమాజంలో మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.అలాగే సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ల ఎస్‌హెచ్‌ఓలు తమ పరిధిలో పాఠశాలలు, కళాశాలలు, యువజన సంఘాలు మరియు ప్రజలతో కలిసి డ్రగ్ అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారు. డ్రగ్స్ వల్ల కలిగే దుష్పరిణామాలపై ప్రజలకు అవగాహన కల్పించి, డ్రగ్ రహిత సమాజ నిర్మాణానికి కృషి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు, సిబ్బంది మరియు ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## రూ.1.53 లక్షల విలువైన ఎండిఎంఏ స్వాధీనం.. ఇద్దరి అరెస్ట్

**సికింద్రాబాద్, వెలుతురు జూన్ 22:**

సికింద్రాబాద్‌లో డ్రగ్స్ విక్రయాలపై నిర్వహించిన దాడిలో రూ.1.53 లక్షల విలువైన 51 గ్రాముల ఎండిఎంఏను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి, వారి వద్ద ఉన్న బైక్, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. సికింద్రాబాద్ రసూల్‌పుర ప్రాంతంలోని ఓ అపార్ట్‌మెంట్‌లో డ్రగ్స్ విక్రయాలు జరుగుతున్నట్లు అందిన సమాచారంతో సికింద్రాబాద్ డిటీఎఫ్ సీఐ సౌజన్య ఆధ్వర్యంలో అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాజస్థాన్‌కు చెందిన ఎం. ప్రజాపతి, హరేంద్ర అనే ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 51 గ్రాముల ఎండిఎంఏను స్వాధీనం చేసుకున్నారు.

విచారణలో నిందితులు రాజస్థాన్‌లో గ్రాము రూ.1,000 చొప్పున కొనుగోలు చేసిన డ్రగ్స్‌ను హైదరాబాద్‌లో గ్రాము రూ.3,000 చొప్పున విక్రయిస్తున్నట్లు వెల్లడించినట్లు అధికారులు తెలిపారు. స్వాధీనం చేసుకున్న ఎండిఎంఏ విలువ సుమారు రూ.1.53 లక్షలు ఉంటుందని అంచనా వేశారు.నిందితులు, స్వాధీనం చేసుకున్న డ్రగ్స్, బైక్‌ను సికింద్రాబాద్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌కు అప్పగించినట్లు ఐఈఎస్ శ్రీనివాసరావు తెలిపారు.

# శాంతి బాటలో...

(మొదటి పేజీ తరువాయి)

మధ్యప్రాచ్యంలో యుద్ధ మేఘాలు కమ్ముకున్న వేళ.. ప్రపంచ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీస్తున్న అమెరికా–ఇరాన్ వివాదాన్ని పరిష్కరించేందుకు పాకిస్థాన్, ఖతార్ దేశాలు ప్రత్యేక చొరవ తీసుకున్నాయి. స్విట్జర్లాండ్‌లోని బర్గెన్‌స్టాక్ రిసార్ట్ వేదికగా జరిగిన ఈ రహస్య దౌత్య సమావేశంలో ఇరు దేశాలను ఒకే టేబుల్ పైకి తీసుకురావడంలో మధ్యవర్తులు విజయం సాధించారు. చర్చల అనంతరం విడుదల చేసిన ఉమ్మడి ప్రకటనలో.. రాబోయే 60 రోజుల్లో (రెండు నెలల్లో) ఒక చారిత్రాత్మక తుది శాంతి ఒప్పందానికి చేరుకునేలా స్పష్టమైన రోడ్‌మ్యాప్‌ను సిద్ధం చేసుకున్నట్లు వెల్లడించారు.ఈ శాంతి చర్చల ప్రక్రియ నిరంతరాయంగా సాగేందుకు, తీసుకున్న నిర్ణయాలను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించేందుకు ఒక ప్రత్యేక హై లెవల్ (ఉన్నత స్థాయి) కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ కమిటీలో అమెరికా తరఫున వైస్ ప్రెసిడెంట్ జేడీ వాన్స్, ఇరాన్ దేశం తరఫున పార్లమెంట్ స్పీకర్ మహమ్మద్ బాఘర్ ఘాలిబాఫ్ ప్రధాన చర్చాకర్తలుగా బాధ్యతలు తీసుకోనున్నారు. అణు కార్యక్రమాల నియంత్రణ, ఆర్థిక ఆంక్షల సడలింపు, ఒప్పందాల అమలు తీరును ఈ ఉన్నత స్థాయి కమిటీ ఎప్పటికప్పుడు సమీక్షిస్తుంది.గత కొన్ని నెలలుగా లెబనాన్ సరిహద్దుల్లో జరుగుతున్న భీకర సైనిక దాడులకు ముగింపు పలకడం ఈ చర్చల్లో అత్యంత ప్రధానమైన అంశంగా మారింది. అక్కడ తక్షణమే శాంతిని నెలకొల్పేందుకు మరియు కాల్పుల విరమణను పక్కాగా అమలు చేసేందుకు 'డీకాన్ఫ్లిక్షన్ సెల్' పేరిట ఒక ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయడానికి అమెరికా, ఇరాన్, లెబనాన్ దేశాలు అంగీకరించాయి. మధ్యవర్తి దేశాల సమన్వయంతో పనిచేసే ఈ సెల్.. సరిహద్దుల్లో రక్తపాతాన్ని ఆపడానికి నిరంతరం శ్రమిస్తుంది.ప్రపంచ చమురు రవాణాకు అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధిలో గత కొంతకాలంగా అంతర్జాతీయ వాణిజ్య నౌకలపై దాడులు జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ సమస్యకు పరిష్కారంగా, సముద్ర మార్గంలో నౌకలు ఎలాంటి భయం లేకుండా సురక్షితంగా ప్రయాణించేలా చూసేందుకు ఒక ఉమ్మడి సమాచార వ్యవస్థను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. దీనివల్ల అంతర్జాతీయ చమురు రవాణాకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా భద్రత లభిస్తుంది.

స్విట్జర్లాండ్ చర్చల ఫలితాలపై ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చీ సోషల్ మీడియా వేదికగా హర్షం వ్యక్తం చేశారు. లెబనాన్ సంక్షోభానికి ముగింపు పలికే దిశగా తమ చర్చలు గొప్ప పురోగతి సాధించాయన్నారు. ఈ చర్చల వల్ల ఇరాన్ ఆర్థిక రంగానికి ఊరట లభించిందని, ఇరాన్ చమురు, పెట్రోకెమికల్ ఉత్పత్తుల ఎగుమతులపై అమెరికా విధించిన కఠినమైన ఆర్థిక ఆంక్షలకు మినహాయింపులు లభించాయని వెల్లడించారు. ఇరాన్ పునర్నిర్మాణానికి ఈ నిర్ణయం ఎంతో దోహదపడుతుందన్నారు.

ఆంక్షల సడలింపుతో పాటు ఇరాన్ నౌకాశ్రయాలపై (పోర్టులపై) ఉన్న అమెరికా నౌకాదళ దిగ్బంధనాన్ని పూర్తిగా ఎత్తివేసేందుకు అగ్రరాజ్యం ఒప్పుకుంది. అలాగే గతంలో వివిధ అంతర్జాతీయ బ్యాంకులు, విదేశీ ఖాతాల్లో అమెరికా ఒత్తిడితో స్తంభింపజేసిన (ఫ్రీజ్ చేసిన) ఇరాన్ దేశానికి చెందిన కొన్ని వేల కోట్ల విలువైన సొంత ఆర్థిక ఆస్తులను తిరిగి విడుదల చేసేందుకు కూడా అమెరికా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇరాన్ దేశ ఆర్థిక పురోభివృద్ధికి ఇవి ఎంతో కీలకం కానున్నాయి.

అయితే, ఈ చర్చలు జరుగుతున్న సమయంలోనే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ఒక ప్రకటన



చర్చల్లో తీవ్ర కలకలం రేపింది. లెబనాన్‌లోని ఇరాన్ మద్దతు గల సాయుధ ముఠాలు తమ దాడులను తక్షణమే ఆపకపోతే ఇరాన్‌పై అంతకుమించిన కఠిన చర్యలు తీసుకుంటామని ట్రంప్ హెచ్చరించారు. ఈ బెదిరింపు వ్యాఖ్యలపై ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి ఇస్మాయేల్ బఘాయీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అమెరికా వైఖరికి నిరసనగా చర్చల నుంచి తాత్కాలికంగా తప్పుకోవాలని భావించినప్పటికీ, పాకిస్థాన్, ఖతార్ ప్రతినిధులు ఇరాన్ బృందాన్ని నచ్చజెప్పి తిరిగి చర్చల టేబుల్ ముందుకు తెచ్చారు.

ప్రస్తుతానికి ప్రధానాంశాలపై ప్రాథమిక అంగీకారం కుదిరినందున, స్విట్జర్లాండ్‌లోని ప్రసిద్ధ బర్గెన్‌స్టాక్ రిసార్ట్‌లో ఈ వారం మొత్తం ఇరు దేశాల అంతర్జాతీయ చట్ట నిపుణులు, సాంకేతిక బృందాల మధ్య అంతర్గత చర్చలు కొనసాగనున్నాయి. మిగిలిపోయిన చిన్నచిన్న సాంకేతిక వివాదాలపై పూర్తి స్పష్టత తెచ్చుకుని, వచ్చే రెండు నెలల గడువులోగా ఎలాంటి లోపాలు లేని ఒక శాశ్వత చారిత్రాత్మక శాంతి ఒప్పందంపై సంతకాలు చేయడమే లక్ష్యంగా ఇరు దేశాలు ముందుకు సాగుతున్నాయి.

# చాల్కి ప్రభుత్వ పాఠశాలలో డిజిటల్ క్లాస్‌రూమ్, ఆర్‌ఓఆర్ వాటర్ ప్లాంట్, టాయిలెట్ల ప్రారంభం





- **పెగా సిస్టమ్స్, టీచ్ ఫర్ చేంజ్ ఆధ్వర్యంలో ఆధునిక సౌకర్యాల కల్పన...**
- **AI యుగంలో ప్రభుత్వ పాఠశాలలు కూడా కార్పొరేట్ స్కూళ్లకు ధీటుగా ఉండాలి....**
- **టీచ్ ఫర్ చేంజ్ సంస్థ వ్యవస్థాపకురాలు, నటి మంచు లక్ష్మి....**

**జహీరాబాద్ వెలుతురు జూన్ 22:**

ప్రభుత్వ పాఠశాలలు కూడా కార్పొరేట్ పాఠశాలలకు ఏమాత్రం తీసిపోకుండా ఆధునిక సౌకర్యాలతో తీర్చిదిద్దాలని, కృత్రిమ మేధస్సు (AI) యుగంలో విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించడంలో ప్రభుత్వ పాఠశాలలు వెనుకబడకూడదని టీచ్ ఫర్ చేంజ్ సంస్థ వ్యవస్థాపకురాలు, నటి మంచు లక్ష్మి పేర్కొన్నారు.సంగారెడ్డి జిల్లా న్యాల్కల్ మండలం చాల్కి గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో పెగా సిస్టమ్స్, టీచ్ ఫర్ చేంజ్ సంస్థల ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన డిజిటల్ క్లాస్‌రూమ్, ఆర్‌ఓఆర్ వాటర్ ప్లాంట్, ఆధునిక టాయిలెట్లను సోమవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణను పరిశీలించి విద్యార్థులతో ముచ్చటించారు. విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.అనంతరం నిర్వహించిన సమావేశంలో మంచు లక్ష్మి మాట్లాడుతూ, సంగారెడ్డి జిల్లాలో ఇప్పటికే పది ప్రభుత్వ పాఠశాలలను టీచ్ ఫర్ చేంజ్ సంస్థ దత్తత తీసుకుని పెగా సిస్టమ్స్ సంస్థ CSR నిధుల సహకారంతో డిజిటల్ క్లాస్‌రూమ్‌లు, తాగునీటి సౌకర్యాలు, టాయిలెట్లు తదితర మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నట్లు తెలిపారు.తెలంగాణలో వేలాది ప్రభుత్వ పాఠశాలల్లో లక్షలాది మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని, గ్రామీణ ప్రాంతాల్లోని పిల్లలకు కూడా నాణ్యమైన విద్యతో పాటు ఆధునిక సాంకేతిక సదుపాయాలు అందించడం సమాజ బాధ్యత అని పేర్కొన్నారు. ప్రపంచం ఇప్పటికే AI వైపు వేగంగా పయనిస్తోందని, అయితే మనం ఇంకా డిజిటల్ క్లాస్‌రూమ్‌ల దశలోనే ఉండడం ఆందోళన కలిగించే విషయమన్నారు. ఈ సాంకేతిక అంతరాన్ని తగ్గించేందుకు ప్రభుత్వ, కార్పొరేట్ సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు.జిల్లాలోని పెద్ద పెద్ద సంస్థలు, పారిశ్రామికవేత్తలు, దాతలు ముందుకొచ్చి గ్రామీణ ప్రాంత ప్రభుత్వ పాఠశాలలను దత్తత తీసుకుని విద్యాభివృద్ధికి చేయూతనివ్వాలని ఆమె పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పెగా సిస్టమ్స్ సంస్థ ప్రతినిధి డా. ధరణికోట సుయోధన్, టీచ్ ఫర్ చేంజ్ ప్రతినిధులు, ఉపాధ్యాయులు, గ్రామ ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాల రహిత మండలమే లక్ష్యం

- **తిమ్మాపూర్‌లో విద్యార్థులకు అవగాహన...**

**తిమ్మాపూర్ వెలుతురు జూన్ 22:**

తిమ్మాపూర్ మండలంలోని రామకృష్ణ కాలనీలో గల మహాత్మ జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలో 'నషాముక్త్ భారత్ అభియాన్' (వ్యసన రహిత భారతం) వారోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. జూన్ 17 నుండి 26 వరకు జరుగుతున్న ఈ ప్రత్యేక అవగాహన కార్యక్రమాల్లో భాగంగా, విద్యార్థులకు మాదకద్రవ్యాల వల్ల కలిగే దుష్పరిణామాల పట్ల అవగాహన కల్పించారు.ప్రస్తుత కాలంలో సోషల్ మీడియా ప్రభావంతో యువత, విద్యార్థులు మాదకద్రవ్యాల వైపు ఆకర్షితులయ్యే ప్రమాదం ఉందని వక్తలు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ దురలవాట్ల బారిన పడకుండా విద్యార్థులను అప్రమత్తం చేయడం, వారిలో నైతిక విలువలను పెంపొందించడం లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. "మాదకద్రవ్యాలు కేవలం వ్యక్తిగత ఆరోగ్యానికే కాకుండా, కుటుంబాలను , సమాజాన్ని సైతం ఛిన్నాభిన్నం చేస్తాయనీ,తిమ్మాపూర్ మండలాన్ని మాదకద్రవ్యాల వినియోగ రహిత మండలంగా మార్చేందుకు ప్రతి విద్యార్థి బాధ్యతగా వ్యవహరించాలి" అని పిలుపునిచ్చారు. ఎలాంటి ఒత్తిడికైనా లోనై తప్పుడు మార్గంలోకి వెళ్లవద్దని, ఏదైనా సమస్య ఉంటే పెద్దలకు లేదా అధికారులకు తెలియజేయాలని విద్యార్థులకు సూచించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, మిషన్ వాత్సల్య ప్రతినిధి సాదినేని రమేష్, చైల్డ్ హెల్ప్ లైన్ ప్రతినిధి సుందరగిరి సాయి కిరణ్



గౌడ్, పాఠశాల ఉపాధ్యాయులు మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

# మంచి పని చేసే అధికారులు రైతుల మనస్సులో చిరస్థాయిగా నిలిచిపోతారు

- **బదిలీపై వెళ్తున్న ఫీల్డ్ ఆఫీసర్ నీలేష్ రౌత్ నీ అభినందించిన అభిలాష్ రెడ్డి, సుధాకర్ రెడ్డి....**

**జహీరాబాద్ వెలుతురు, జూన్ 22:**

ఉద్యోగ జీవితంలో బదిలీలు సహజమని, అయితే విధి నిర్వహణలో నిబద్ధతతో సేవలు అందించే అధికారులు రైతులు, ఖాతాదారుల మనస్సుల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని సర్పంచ్ ప్రతినిధి అభిలాష్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు పట్లోళ్ల సుధాకర్ రెడ్డి అన్నారు.ఝరాసంగం



మండల కేంద్రంలోని కెనరా బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ నీలేష్ రౌత్ విట్టల్ బదిలీపై వెళ్తున్న సందర్భంగా పట్లోళ్ల సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆయనకు పూలమాలలు వేసి, శాలువా కప్పి ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ, ఉద్యోగంలో చేసిన సేవలు రైతులకు, ఖాతాదారులకు ఇబ్బందులు లేకుండా ఉంటే వారు ఎప్పటికీ గుర్తుంచుకుంటారని అన్నారు. బ్యాంకు అధికారులు నియమ నిబంధనలకు అనుగుణంగా పనిచేస్తూనే, కొన్ని సందర్భాల్లో మానవతా దృక్పథంతో ఖాతాదారుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు.కార్యక్రమంలో భాస్కర్ రెడ్డి, రవి, రమేష్, అశోక్, ఖిరు పటేల్, నర్సింలు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# మేయర్ల శిక్షణ కార్యక్రమానికి హాజరుకానున్న నగర మేయర్ కొలగాని శ్రీనివాస్

**కరీంనగర్ వెలుతురు జూన్ 22:**

హైదరాబాదులోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అర్బన్ మేనేజ్‌మెంట్ (NIUM), తెలంగాణ కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ (CDMA) ఆధ్వర్యంలో 23-06-2026 మంగళవారం నిర్వహించనున్న మేయర్ల శిక్షణ కార్యక్రమానికి కరీంనగర్ నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ గారు హాజరుకానున్నారు.రాష్ట్రంలోని మున్సిపల్ కార్పొరేషన్ల మేయర్లకు పట్టణాభివృద్ధి, నగర పాలన, ప్రజా సేవల మెరుగుదల, మౌలిక వసతుల ప్రణాళిక, సుస్థిర పట్టణాభివృద్ధి అంశాలపై అవగాహన కల్పించేందుకు ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.



# ప్రజా పాలన అంటే సినిమా అనుకుంటున్నారా?

- **రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదే**
- **నిర్మాణాత్మక ప్రతిపక్ష పాత్ర పోషించాలని సూచన**

**హైదరాబాద్ వెలుతురు జూన్ 22:**

రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వంపై గులాబీ పార్టీ (బీఆర్‌ఎస్) వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు చేసిన విమర్శలను రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ పాలనను "సగం సినిమా అట్టర్ ఫ్లాప్ అయింది, మిగిలిన సగం మాత్రమే ఉంది" అంటూ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై ఆమె ఘాటుగా స్పందించారు. రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన ఎంపీడీవో కార్యాలయ భవనాన్ని మంత్రి సీతక్క రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. కేటీఆర్ వ్యాఖ్యలపై నిప్పులు చెరిగారు. ప్రజల కోసం సాగుతున్న ప్రజా పాలనను సినిమాతో పోల్చడం కేటీఆర్ అపరిపక్వ ఆలోచనా విధానానికి, అహంకారానికి అద్దం పడుతోందని దుయ్యబట్టారు.రాత్రింబవళ్లు ప్రజల సంక్షేమం, రాష్ట్ర ప్రగతి కోసం కష్టపడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని సినిమాల కోణంలో చూడటం కేటీఆర్ దిగజారుడు రాజకీయ సంస్కృతికి నిదర్శనమని మంత్రి సీతక్క విమర్శించారు. ప్రభుత్వం అంటే ఏదో మూడు గంటల సినిమా కాదని, కోట్ల మంది ప్రజల జీవితాలతో ముడిపడి ఉన్న బాధ్యత అని గుర్తు చేశారు. కల్పిత కథలతో నడిచే సినిమాలకు, క్షేత్రస్థాయిలో ప్రజల కష్టాలను తీర్చే ప్రభుత్వానికి ఉన్న తేడాను కేటీఆర్ తెలుసుకోవాలని హితవు పలికారు. ఇటువంటి చౌకబారు వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని సూచించారు.గడిచిన కొన్ని నెలలుగా బీఆర్‌ఎస్ పార్టీ పూర్తిగా అబద్ధాల పుట్టగా మారిపోయిందని మంత్రి సీతక్క ఆరోపించారు. రాష్ట్రంలో ప్రజా సమస్యలపై ఫోకస్ పెట్టి, వాటి పరిష్కారానికి ప్రభుత్వానికి మంచి సూచనలు చేయాల్సిన ప్రధాన ప్రతిపక్షం.. ఆ బాధ్యతను పూర్తిగా విస్మరించిందని మండిపడ్డారు. కేవలం నిరంతర విమర్శలు చేయడం, సోషల్ మీడియా వేదికగా రాజకీయ డ్రామాలకు తెరతీయడానికే పరిమితం అవుతోందని ధ్వజమెత్తారు. వాస్తవాలను పక్కనపెట్టి ప్రజలను తప్పుదోవ పట్టించడమే ధ్యేయంగా గులాబీ నేతలు పని చేస్తున్నారని దుయ్యబట్టారు.ఒక ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజల గొంతుకను వినిపించాల్సిన బాధ్యత ప్రతిపక్షానిదే అయినప్పటికీ, తెలంగాణలో ఆ పరిస్థితి లేదని సీతక్క వ్యాఖ్యానించారు. క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుతున్న ఫలాలను చూసి ఓర్వలేక, ఏదో ఒక రకంగా గందరగోళం సృష్టించాలని చూస్తున్నారన్నారు. నిజమైన సమస్యలను ప్రస్తావించి, వాటికి పరిష్కార మార్గాలు సూచిస్తే ప్రభుత్వం ఖచ్చితంగా స్వీకరిస్తుందని, కానీ బీఆర్‌ఎస్ నేతలు కేవలం తమ రాజకీయ ఉనికిని కాపాడుకోవడానికే అసత్య ప్రచారాలు ఆశ్రయిస్తున్నారని ఆరోపించారు."కేటీఆర్ అనుకున్న ఆలోచనలు, వారి పార్టీ అజెండాలు మా ప్రభుత్వంలో అమలు కాకపోతే.. మా పాలన విఫలమైనట్లా?" అని మంత్రి సీతక్క నిలదీశారు. తెలంగాణలో అధికారంలో ఉన్నది కాంగ్రెస్ ప్రభుత్వమని, ఇది కేవలం ప్రజల అవసరాలు, రాష్ట్ర ప్రయోజనాలకే అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని స్పష్టం చేశారు. ఎవరిదో వ్యక్తిగత లేదా ఒక కుటుంబ రాజకీయ ప్రయోజనాల కోసం ఈ ప్రభుత్వం నడవదని తేల్చి చెప్పారు. అబద్ధాలను పదే పదే ప్రచారం చేయడంలో బీఆర్‌ఎస్ నాయకులు దిట్టలుగా మారారని విమర్శించారు.ప్రస్తుత రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పక్కాగా పేదలు, రైతుల సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తోందని మంత్రి సీతక్క గర్వంగా ప్రకటించారు. దేశంలోనే రైతు సంక్షేమం మరియు వ్యవసాయాభివృద్ధి విషయాల్లో కాంగ్రెస్ పార్టీకి ఒక ప్రత్యేకమైన చరిత్ర, విశ్వసనీయత ఉన్నాయని గుర్తుచేశారు. గత పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో రైతులు పడిన కష్టాలను తీరుస్తూ, వారి ముఖాల్లో ఆనందం చూడటమే తమ ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని వివరించారు.భారతదేశంలోనే రైతులను అప్పుల ఊబి నుంచి గట్టెక్కించేందుకు భారీ ఎత్తున రుణమాఫీ చేసిన ఘనత ఒక్క కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందని సీతక్క అన్నారు. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ రాజశేఖర్ రెడ్డి (వైఎస్సార్) ప్రభుత్వంలో ఏకకాలంలో రైతు రుణమాఫీని విజయవంతంగా అమలు చేసి చూపించామని గుర్తు చేశారు. అదే రీతిలో ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఇచ్చిన మాట ప్రకారం రైతు రుణమాఫీని పక్కాగా అమలు చేసి అన్నదాతలకు అండగా నిలిచిందని స్పష్టం చేశారు.వ్యవసాయ రంగాన్ని మరింత లాభసాటిగా మార్చడానికి మరియు బలోపేతం చేయడానికి ప్రభుత్వం అనేక విప్లవాత్మక చర్యలు చేపడుతోందని సీతక్క వెల్లడించారు. మార్కెట్‌లో మంచి డిమాండ్ మరియు గిట్టుబాటు ధర ఉన్న పంటలను సాగు చేసేలా రైతులను శాస్త్రీయంగా ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. దీనివల్ల రైతులకు దళారీల భయం లేకుండా మంచి ఆదాయం పెరిగే అవకాశం ఉంటుందన్నారు. గ్రామీణ ప్రాంతాల ఆర్థిక వ్యవస్థను మార్చడమే తమ లక్ష్యమన్నారు.ఇప్పటికైనా బీఆర్‌ఎస్ నాయకత్వం తమ పంథాను మార్చుకుని, ప్రజల సమస్యలపై నిజాయితీతో కూడిన నివేదికలతో రాణించాలని, సమాజానికి ఉపయోగపడేలా ఒక నిర్మాణాత్మక ప్రతిపక్ష పాత్ర పోషించాలని సీతక్క సూచించారు. నిరంతరం విమర్శలు చేయడం కంటే ప్రజలకు ఉపయోగపడే మంచి సలహాలు ఇవ్వడం ద్వారా ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై వస్తున్న ప్రతి విమర్శను ప్రజలు గమనిస్తున్నారని, తాము చేపడుతున్న సంక్షేమ, గ్రామస్థాయి అభివృద్ధి కార్యక్రమాలే తమ ప్రభుత్వ తిరుగులేని పనితీరుకు నిదర్శనమని సీతక్క స్పష్టం చేశారు.

# పాక్ ఐఎస్ఐ స్లీపర్ సెల్ గుట్టురట్టు

- **ఛత్తీస్‌గఢ్‌లో పంజాబ్ యువకుడి అరెస్ట్..**
- **పవర్ ప్లాంట్ల వీడియోలు విదేశాలకు సరఫరా**
- **పవర్ కంపెనీలో కాంట్రాక్ట్ కార్మికుడిగా ఉంటూ గూఢచర్యం**
- **అద్దెదారుల తనిఖీల్లో దొరికిపోయిన సేవక్ సింగ్**
- **మొబైల్ డేటాలో పాకిస్థాన్ వాట్సాప్ చాటింగ్‌లు లభ్యం**
- **సోషల్ మీడియా ద్వారా ఐఎస్ఐ వలలో పడిన యువకుడు**
- **ఎన్‌టీపీసీ, జేఎస్‌డబ్ల్యూ ప్లాంట్ల లొకేషన్లు శత్రువుల చేతికి**
- **డ్రోన్ల ద్వారా ఆయుధాల సరఫరా.. 'టార్గెట్ కిల్లింగ్స్' కు ప్లాన్**

**ఛత్తీస్‌గఢ్ వెలుతురు జూన్ 22:**

దేశంలో భారీ విధ్వంసానికి వ్యూహం పన్నుతున్న పాకిస్థాన్ గూఢచారి సంస్థ 'ఐఎస్ఐ' కి చెందిన ఒక ప్రమాదకరమైన స్లీపర్ సెల్ సభ్యుడిని ఛత్తీస్‌గఢ్ పోలీసులు శనివారం అత్యంత చాకచక్యంగా అరెస్ట్ చేశారు. నిందితుడిని పంజాబ్ రాష్ట్రానికి చెందిన సేవక్ సింగ్ (23) గా అధికారులు గుర్తించారు. నిందితుడి వద్ద ఉన్న మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకుని కాల్ రికార్డులను పరిశీలించగా, అంతర్జాతీయ అనుమానాస్పద నంబర్లతో నిరంతరం వీడియో కాల్స్, వాట్సాప్ చాటింగ్ జరిపినట్లు పక్కా ఆధారాలు లభించాయి. దీంతో జాతీయ భద్రతకు భంగం కలిగించేలా పాక్ ఐఎస్ఐతో అక్రమ సంబంధాలు నడుపుతున్న ఈ వ్యక్తిపై పోలీసులు దేశద్రోహం కింద కేసు నమోదు చేసి, జ్యుడిషియల్ కస్టడీకి తరలించారు. ఈ అరెస్ట్‌తో దేశంలోని ప్రధాన విద్యుత్ కేంద్రాలపై జరగబోయే పెద్ద ప్రమాదం తప్పిందని రక్షణ వర్గాలు భావిస్తున్నాయి.

**పవర్ కంపెనీలో కాంట్రాక్ట్ కార్మికుడిగా ఉంటూ గూఢచర్యం**

పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. పంజాబ్ రాష్ట్రంలోని సరిహద్దు జిల్లా తర్న్ తారన్‌కు చెందిన సేవక్ సింగ్ గత నాలుగు నెలల క్రితం ఛత్తీస్‌గఢ్‌కు వచ్చాడు. జాంజ్‌గిర్ చంపా జిల్లా పరిధిలోని అకల్తారా నగరంలో గల మినీ మాతా చౌక్ ప్రాంతంలో రాజీవ్ కేడియా అనే వ్యక్తికి చెందిన ఇంట్లో అద్దెకు దిగాడు. ఇక్కడ ఉంటున్న ఒక బంధువు సాయంతో స్థానికంగా ఉన్న ప్రముఖ 'జేఎస్‌డబ్ల్యూ' పవర్ కంపెనీలో ఉద్యోగం సంపాదించాడు. ఆ సంస్థలో ఒక సాధారణ కాంట్రాక్ట్ కార్మికుడిగా చేరి, ఎవరికీ ఎలాంటి అనుమానం రాకుండా లోపల తిరుగుతూ రహస్యంగా గూఢచర్యానికి పాల్పడటం ప్రారంభించాడు.జాంజ్‌గిర్ చంపా జిల్లాలో ఇటీవల కాలంలో అపరిచిత నేరాలు పెరుగుతుండటం, ఇతర రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో వలస కార్మికులు వస్తుండటంతో జిల్లా ఎస్పీ విజయ్ కుమార్ పాండే ఒక కీలక నిర్ణయం తీసుకున్నారు. జిల్లాలోని అద్దెదారులు, బయటి వ్యక్తుల వివరాలను పూర్తి స్థాయిలో వెరిఫికేషన్ చేయాలని స్థానిక పోలీసులను ఆదేశించారు. ఈ తనిఖీల్లో భాగంగానే అకల్తారా పోలీసులు సేవక్ సింగ్ ఉంటున్న అద్దె ఇంటికి వెళ్లి విచారించారు. ఆ సమయంలో పోలీసుల ప్రశ్నలకు సమాధానం చెప్పలేక సేవక్ సింగ్ తీవ్ర భయాందోళనకు గురయ్యాడు. అతని ప్రవర్తన తేడాగా అనిపించడంతో పోలీసులు అతని మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకుని తనిఖీ చేయగా అసలు నిజం బయటపడింది.పోలీసులు సేవక్ సింగ్ మొబైల్ ఫోన్‌ను లోతుగా స్కానింగ్ చేయగా విస్తుపోయే విషయాలు వెల్లడయ్యాయి. ఆ మొబైల్ ద్వారా నిందితుడు పాకిస్థాన్‌కు చెందిన పలు అనుమానాస్పద కోడ్ నంబర్లతో నిరంతరం టచ్‌లో ఉన్నట్లు తేలింది. ఐఎస్ఐ ఏజెంట్లతో రహస్యంగా మాట్లాడిన వీడియో కాల్ రికార్డులు, దేశ రక్షణకు నష్టం కలిగించేలా ఉన్న వాట్సాప్ చాటింగ్‌లు లభ్యమయ్యాయి. ఈ కాల్ రికార్డులు, ఆడియో, వీడియో సంభాషణల పక్కా ఆధారాలతో అతడు ఐఎస్ఐ స్లీపర్ సెల్ సభ్యుడేనని పోలీసులు తేల్చారు. తదుపరి లోతైన విచారణ కోసం ఈ వ్యవహారాన్ని రాష్ట్ర యాంటీ టెర్రరిజం స్క్వాడ్ కు బదిలీ చేశారు.అరెస్ట్ అనంతరం పోలీసులు నిందితుడు సేవక్ సింగ్‌ను తమదైన శైలిలో విచారించగా విస్తుపోయే నిజాలు ఒప్పుకున్నాడు. సోషల్ మీడియాలో దేశ వ్యతిరేక ఐఎస్ఐ వీడియోలను చూసి తాను ప్రభావితమయ్యానని తెలిపాడు. ఆ వీడియోల కింద ఉన్న ఒక అపరిచిత నంబర్‌కు తన వ్యక్తిగత వివరాలను పంపినట్లు పేర్కొన్నాడు. ఆ తర్వాత అవతలి వైపు ఉన్న ఐఎస్ఐ హ్యాండ్లర్ ఇతనితో మాట్లాడి, తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించవచ్చని ఆశ చూపించాడు. అందులో భాగంగానే ప్రాథమిక ఖర్చుల నిమిత్తం సేవక్ సింగ్ అకౌంట్‌కు రూ.20,000 ఆన్‌లైన్ ద్వారా పంపినట్లు నిందితుడు విచారణలో అంగీకరించాడు.నిందితుడికి అడ్వాన్స్ డబ్బులు పంపిన పాక్ ఏజెంట్.. అతను ప్రస్తుతం ఉంటున్న లొకేషన్, ఆ పరిసర ప్రాంతాల రహస్య వీడియోలను పంపాలని ఆదేశించాడు. దీంతో డబ్బు ఆశకు లోనైన సేవక్ సింగ్.. తాను కాంట్రాక్ట్ కార్మికుడిగా పనిచేస్తున్న జేఎస్‌డబ్ల్యూ పవర్ కంపెనీ ఆవరణతో పాటు, బిలాస్‌పూర్ జిల్లాలో దేశానికే ఎంతో కీలకమైన ఎన్‌టీపీసీ థర్మల్ పవర్ ప్లాంట్‌కు సంబంధించిన అత్యంత సున్నితమైన భద్రతా లొకేషన్ వివరాలను, ప్లాంట్ల లోపలి దృశ్యాలను వీడియోలు తీసి పాకిస్థాన్‌కు చేరవేశాడు.ఈ స్లీపర్ సెల్ కేవలం సమాచారాన్ని సేకరించడమే కాకుండా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో ఒక పెద్ద కుట్రను అమలు చేయడానికి ఐఎస్ఐ ప్లాన్ చేసిందని జాంజ్‌గిర్ చంపా జిల్లా ఎస్పీ విజయ్ కుమార్ పాండే అధికారికంగా ధృవీకరించారు. నిందితుడు సేవక్ సింగ్ కేవలం పవర్ ప్లాంట్ల సమాచారమే కాకుండా.. రాష్ట్రంలోని కీలక భద్రతా ప్రాంతాలు, ఆర్మీ వాహనాల కదలికలు మరియు ఛత్తీస్‌గఢ్‌లోని పలువురు ప్రముఖ రాజకీయ, సామాజిక నాయకులకు సంబంధించిన వ్యక్తిగత వివరాలను, వారి నివాసాల రూట్ మ్యాప్‌లను కూడా పాకిస్థాన్ నంబర్లకు పంపినట్లు చాటింగ్‌ల ద్వారా స్పష్టమైందని ఎస్పీ వెల్లడించారు.పోలీసుల విచారణలో అత్యంత ప్రమాదకరమైన ఉగ్రవాద కోణం కూడా వెలుగులోకి వచ్చింది. సేవక్ సింగ్ త్వరలోనే పంజాబ్‌లోని తన సొంత గ్రామానికి వెళ్లాల్సి ఉంది. అతను అక్కడికి చేరుకున్నాక, భారత్–పాక్ అంతర్జాతీయ సరిహద్దుల గుండా పాకిస్థాన్ నుంచి అత్యాధునిక డ్రోన్ల ద్వారా భారీగా ఆయుధాలు, పేలుడు పదార్థాలు మరియు ఉగ్రవాద కార్యకలాపాలకు సంబంధించిన సామగ్రిని ఇతనికి పంపేందుకు ఐఎస్ఐ ప్రణాళికలు సిద్ధం చేసింది. ఈ ఆయుధాలను ఉపయోగించి ఛత్తీస్‌గఢ్, పంజాబ్‌లలో ప్రముఖ వ్యక్తులను లక్ష్యంగా చేసుకుని హత్యలు చేయాలని, తద్వారా దేశంలో అలజడి సృష్టించాలని భావించినట్లు పోలీసులు గుర్తించారు.సాధారణంగా నక్సలైట్ల సమస్య ఉండే ఛత్తీస్‌గఢ్‌లోని జాంజ్‌గిర్ చంపా వంటి అత్యంత ప్రశాంతమైన జిల్లాలో.. ఇలా అంతర్జాతీయ పాకిస్థానీ నిఘా సంస్థకు చెందిన స్లీపర్ సెల్ సభ్యుడు పట్టుబడటం దేశవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపుతోంది. దేశ రక్షణకు, అంతర్గత భద్రతకు సంబంధించిన సీరియస్ కేసు కావడంతో రాష్ట్ర పోలీసులు కేంద్ర ఇంటెలిజెన్స్ బ్యూరో , నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ వంటి కేంద్రీయ భద్రతా సంస్థల అధికారులకు సమాచారాన్ని అందించారు. ఈ నెట్‌వర్క్‌లో మరికొంతమంది ఉన్నారనే అనుమానంతో డిజిటల్ ఆధారాలను విశ్లేషించేందుకు ఫోరెన్సిక్ సైన్స్ బృందం సహాయం కూడా తీసుకుని విచారణను మరింత తీవ్రతరం చేశారు.



# నా బిడ్డే నా ప్రపంచం అవుతుంది: సమంత

నటి సమంత ప్రస్తుతం హ్యాపీ మోడ్‌లో ఉన్నారు. సుదీర్ఘ విరామం తర్వాత ఆమె నటించిన 'మా ఇంటి బంగారం' విజయం సాధించింది. మరోవైపు ఆమె తల్లి కానుందనే వార్తలు కూడా వస్తున్నాయి. ఈ నేపథ్యంలో తనకు పుట్టే పిల్లల గురించి సమంత గతంలో చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు వైరల్ అవుతున్నాయి. కొన్నేళ్ల క్రితం ఓ ఇంటర్వ్యూలో సమంత మాట్లాడుతూ.. ''నా బిడ్డే నా ప్రపంచం అవుతుంది. ఉద్యోగం చేసుకుంటూ పిల్లలను, ఇంటి బాధ్యతలను చూసుకునే మహిళంటే నాకెంతో గౌరవం'' అని అన్నారు. అదే ఇంటర్వ్యూలో తన బాల్యం గురించి కూడా పంచుకున్నారు. ''నా చిన్నప్పుడు ఎన్నో కష్టాలు పడ్డాను. అలాంటి బాల్యం గడిపిన వారంతా వారి పిల్లలకు విలాసవంతమైన, సౌకర్యవంతమైన జీవితాన్ని ఇవ్వాలనుకుంటారు. నేను కూడా అదే నిర్ణయించుకున్నా. నా బిడ్డ పుట్టిన తర్వాత కొన్ని సంవత్సరాల పాటు తనను వదిలి ఎక్కడికీ వెళ్లను. తనే నా సర్వస్వంగా చూసుకుంటా'' అని చెప్పారు.

తాజాగా జరిగిన 'మా ఇంటి బంగారం' సక్సెస్ సెలబ్రేషన్స్‌లో సమంత బేబి బంప్‌తో కనిపించారు. ఈ విషయంపై ఆమె సన్నిహిత వర్గాలను అడగ్గా.. సమంత, రాజ్‌లకు ఇది చాలా ప్రత్యేకమైన సమయం అని.. వాళ్లిద్దరూ కొత్త ప్రయాణానికి సిద్ధమవుతున్నారని వెల్లడించాయి. దీంతో త్వరలోనే సామ్ ఈ గుడ్ న్యూస్‌ను అధికారికంగా వెల్లడిస్తారని ఫ్యాన్స్ భావిస్తున్నారు.

**మిలియన్ డాలర్ల క్లబ్‌లోకి 'మా ఇంటి బంగారం'..**

సమంత నటించిన తాజా చిత్రం 'మా ఇంటి బంగారం' హిట్ టాక్‌తో బాక్సాఫీసు వద్ద దూసుకుపోతోంది. మూడు రోజుల్లో రూ.43 కోట్లు వసూలు చేసింది. నార్త్ అమెరికాలో వన్ మిలియన్ డాలర్ల క్లబ్‌లో చేరింది. సోషల్ మీడియాలోనూ ఈ సినిమాకు సంబంధించిన రీల్స్ వైరల్‌గా మారాయి.

# ఫుల్ స్వింగ్‌లో చిరు -బాబీ మూవీ




అగ్ర కథానాయకుడు చిరంజీవి ఫుల్ జోష్‌లో ఉన్నారు. ఆయన సినిమా మొదలు పెట్టడమే ఆలస్యం పరుగులు పెట్టిస్తున్నారు. చిరు కీలక పాత్రలో బాబీ దర్శకత్వంలో ఓ మూవీ రూపొందుతున్న సంగతి తెలిసిందే. #Mega158 (వర్కింగ్ టైటిల్)గా రానున్న ఈ మూవీ షూటింగ్ శరవేగంగా సాగుతోంది. ఇటీవలే పొల్లాచ్చిలో కీలక షెడ్యూల్‌ని పూర్తి చేసుకుంది. సోమవారం నుంచి హైదరాబాద్‌లో కొత్త షెడ్యూల్ మొదలైంది. చిరుతో పాటు ప్రధాన తారాగణంపై కీలక టాకీ పార్ట్‌ను చిత్రీకరిస్తున్నారు. ఈ క్రమంలో పొల్లాచ్చి షెడ్యూల్‌లో షూటింగ్‌కు సంబంధించిన విశేషాలతో కూడిన వీడియోను చిత్ర బృందం పంచుకుంది. అక్కడ కొంత టాకీతో పాటు, యాక్షన్ సీక్వెన్స్ కూడా తీసినట్లు ప్రచార చిత్రం చూస్తే అర్థమవుతోంది.

'వాల్తేరు వీరయ్య' విజయం తర్వాత చిరు – బాబీ నుంచి వస్తున్న సినిమా కావడంతో దీనిపై ఇప్పటికే ప్రేక్షకుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. దీనికి తగ్గట్టే ఈసారి ఓ చక్కటి భారీ మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రాన్ని ముస్తాబు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమాలో చిరు రెండు కోణాల్లో సాగే పాత్రలో అలరించే అవకాశమున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ చిత్రానికి సంగీతం తమన్, ఛాయాగ్రహణం విజయ్ కార్తీక్ కన్నన్ అందిస్తున్నారు.

# అందుకే సినిమాల విషయంలో జాగ్రత్త పడుతున్నా: సాయి దుర్గా తేజ్



సాయి దుర్గా తేజ్ ప్రధానపాత్రలో తెరకెక్కుతోన్న చిత్రం 'సంబరాల ఏటిగట్టు'. రోహిత్.కె.పి దర్శకత్వంలో రానుంది. ఈ సినిమా విడుదల ఆలస్యం కావడంపై గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో రకరకాల చర్చలు నడుస్తున్నాయి. తాజాగా ఈ ఆలస్యంపై సాయి దుర్గా తేజ్ స్పందించారు. సినిమాల ఎంపికలో తాను ఎందుకు ఇంత సమయం అవసరమవుతోందో వివరించారు.

ప్రస్తుతం ప్రేక్షకులు ఓటీటీల్లో ఎన్నో సినిమాలు, వెబ్‌సిరీస్‌లు వీక్షిస్తున్నట్లు తెలిపారు. అన్ని జానర్లలోని కంటెంట్ గురించి ఎన్నో విషయాలు నేర్చుకుంటున్నట్లు చెప్పారు. ప్రేక్షకుల ఆలోచనల్లో మార్పు వచ్చిందని అందుకే తన సినిమాల విషయంలో మరింత జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వాళ్లను మెప్పించాలంటే కథల ఎంపికలో అత్యంత జాగ్రత్తగా వ్యవహరించక తప్పదన్నారు. అందుకే కాస్త సమయం పడుతోందని స్పష్టం చేశారు. ఈ సినిమా కోసం తన సర్వస్వం ధారపోస్తూ... శాయశక్తులా శ్రమిస్తున్నట్లు గతంలో సాయి దుర్గా తేజ్ తెలిపారు. దర్శకుడు రోహిత్ విజన్ అందరికీ నచ్చేలా ఉంటుందన్నారు. మంచి బృందంతో కలిసి చేస్తున్న ఈ సినిమా తన కెరీర్‌లో ఒక అద్భుతంలా నిలిచిపోతుందని చెప్పారు.

# భారత్ సెమీస్ చేరాలంటే..?

**మహిళల టీ20 వరల్డ్‌కప్ ఆసక్తికర సమీకరణాలు!**

ఐసీసీ మహిళల టీ20 ప్రపంచకప్‌లో సౌతాఫ్రికా చేతిలో ఎదురైన ఓటమి భారత జట్టు సెమీఫైనల్ అవకాశాలను క్లిష్టతరం చేసింది. మాంచెస్టర్‌లోని ఓల్డ్ ట్రాఫోర్డ్ మైదానంలో జరిగిన ఈ గ్రూప్–1 మ్యాచ్‌లో భారత్ 6 వికెట్ల తేడాతో పరాజయం పాలైంది. ప్రస్తుతం పాయింట్ల పట్టికలో ఆస్ట్రేలియా తర్వాతి స్థానంలో భారత్ రెండో స్థానంలో కొనసాగుతున్నప్పటికీ, సెమీస్‌కు చేరాలంటే రాబోయే మ్యాచ్‌ల ఫలితాలు, రన్ రేట్ సమీకరణాలు అత్యంత కీలకంగా మారాయి.



భారత్ తన తదుపరి ఆడబోయే రెండు మ్యాచ్‌ల్లోనూ ఖచ్చితంగా విజయం సాధించాల్సి ఉంటుంది. ఒకవేళ రెండు మ్యాచ్‌లూ గెలిస్తే సెమీస్ రేసులో ముందంజలో ఉంటుంది, అయితే ఆ సమయంలో ఆస్ట్రేలియా లేదా సౌతాఫ్రికాల కంటే మెరుగైన నెట్ రన్ రేట్ సాధించడం అవసరం. ఒకవేళ ఆస్ట్రేలియా, సౌతాఫ్రికా జట్లు తమ రాబోయే మ్యాచ్‌ల్లో ఏదైనా ఒకదానిలో ఓడిపోతే భారత్‌కు సెమీస్ మార్గం నేరుగా సులువు అవుతుంది.

అయితే, ఒకవేళ భారత్ రాబోయే రెండు మ్యాచ్‌ల్లో ఒకదానిలో ఓడిపోతే మాత్రం ఇతర జట్ల ప్రదర్శనపై ఆధారపడాల్సి వస్తుంది. అప్పుడు సౌతాఫ్రికా జట్టు కూడా తన మిగిలిన రెండు మ్యాచ్‌ల్లో ఒకదానిలో పరాజయం పాలుకావాలి. అలాంటి స్థితిలో బంగ్లాదేశ్, సౌతాఫ్రికాల కంటే భారత నెట్ రన్ రేట్ మెరుగ్గా ఉంటేనే సెమీస్‌కు వెళ్లే అవకాశం లభిస్తుంది. ఒకవేళ తదుపరి జరగబోయే బంగ్లాదేశ్ మ్యాచ్‌లోనే భారత్ ఓడిపోతే లేదా రాబోయే రెండు మ్యాచ్‌ల్లోనూ పరాజయం పాలైతే మాత్రం టీమిండియా టోర్నీ నుండి పూర్తిగా నిష్క్రమించాల్సి వస్తుంది.



# హార్దిక్ పాండ్యా స్థానంలో యశస్వి జైస్వాల్?

**ముంబై, రాజస్థాన్ మధ్య భారీ డీల్!**

ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో ఒక భారీ ట్రేడింగ్ ఒప్పందానికి తెరలేవబోతున్నట్లు సమాచారం. ముంబై ఇండియన్స్ కెప్టెన్ హార్దిక్ పాండ్యా ఆ ఫ్రాంచైజీని వీడేందుకు సిద్ధమవగా, అతడి స్థానంలో రాజస్థాన్ రాయల్స్ స్టార్ ఓపెనర్ యశస్వి జైస్వాల్‌ను జట్టులోకి తెచ్చుకునేందుకు ముంబై యాజమాన్యం చర్చలు జరుపుతోంది. గుజరాత్ టైటాన్స్ నుండి ముంబై ఇండియన్స్‌కు తిరిగి వచ్చి కెప్టెన్సీ బాధ్యతలు చేపట్టిన హార్దిక్ పాండ్యా, గత సీజన్‌లో జట్టు ఘోర వైఫల్యం చెందడం మరియు డ్రెస్సింగ్ రూమ్‌లో సహచర ఆటగాళ్లతో విభేదాలు తలెత్తడం వంటి కారణాల వల్ల ఫ్రాంచైజీని వీడాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే హార్దిక్‌ను ట్రేడ్ ద్వారా దక్కించుకునేందుకు రాజస్థాన్ రాయల్స్ ముందంజలో ఉంది.

అటు రాజస్థాన్ రాయల్స్ జట్టులో కూడా గత కొంతకాలంగా సమీకరణాలు మారుతున్నాయి. సంజూ శాంసన్ నిష్క్రమణ తర్వాత జైస్వాల్ ఆ జట్టులో కీలక ఆటగాడిగా ఎదుగుతాడని భావించినప్పటికీ, మేనేజ్‌మెంట్ కెప్టెన్సీ బాధ్యతలను రియాన్ పరాగ్‌కు అప్పగించింది. దీనికి తోడు జట్టులో 15 ఏళ్ల యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ అత్యంత ఆకర్షణీయమైన ఆటగాడిగా దూసుకురావడంతో జైస్వాల్ ప్రాధాన్యతపై ఊహాగానాలు మొదలయ్యాయి. ముంబై రంజీ జట్టుకు ఆడే జైస్వాల్‌కు ముంబై ఇండియన్స్ ఫ్రాంచైజీలోకి మారడం కెరీర్ పరంగా కలిసివచ్చే అంశం కానుంది. హార్దిక్ పాండ్యా బృందం ఇప్పటికే రాజస్థాన్ రాయల్స్‌తో ముందస్తు చర్చలు జరపగా, ఇందుకు బదులుగా ముంబై జట్టు జైస్వాల్‌ను డిమాండ్ చేస్తోంది.

రోహిత్ శర్మ కెరీర్ చివరి దశకు చేరుకోవడం, హార్దిక్ పాండ్యాతో పాటు సూర్యకుమార్ యాదవ్ కూడా కొత్త జట్ల వైపు చూస్తుండటంతో ముంబై ఇండియన్స్ భవిష్యత్తు కోసం కొత్త స్టార్ ఆటగాళ్ల వేటలో పడింది. సూర్యకుమార్ యాదవ్ ఉత్తరాదికి చెందిన కొన్ని ఫ్రాంచైజీల వైపు ఆసక్తి చూపిస్తున్నట్లు సమాచారం, సదరు జట్లు అతనికి కెప్టెన్సీ ఆఫర్ చేయడానికి కూడా సిద్ధంగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో మూడు ఫార్మాట్లలో భారత జట్టులో కీలక సభ్యుడిగా ఉన్న యశస్వి జైస్వాల్‌ను జట్టులోకి తెచ్చుకోవడం ద్వారా ముంబై ఇండియన్స్ తన తదుపరి తరం జట్టును నిర్మించాలని భావిస్తోంది. అయితే జైస్వాల్‌ను తీసుకుంటే అతనికి ముంబై కెప్టెన్సీ బాధ్యతలు కూడా అప్పగిస్తారా అనేది రాబోయే రోజుల్లో ఐపీఎల్ ట్రేడింగ్ మార్కెట్‌లో అత్యంత ఆసక్తికరంగా మారనుంది.

# ఇంగ్లాండ్‌కు డబుల్ షాక్

**భారీ ఓటమితో పాటు 12 డబ్ల్యూటీసీ పాయింట్ల కోత!**



ఐసీసీ ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్‌లో ఇంగ్లాండ్ జట్టుకు ఊహించని షాక్ తగిలింది. ఓవల్ వేదికగా న్యూజిలాండ్‌తో జరిగిన రెండో టెస్టులో ఘోర పరాజయాన్ని చవిచూసిన ఇంగ్లాండ్, ఆ తర్వాత స్లో ఓవర్ రేట్ కారణంగా భారీ మూల్యాన్ని చెల్లించుకుంది. నిర్ణీత సమయానికి 12 ఓవర్లు తక్కువగా వేసినందుకు ఐసీసీ నిబంధనల ప్రకారం ఇంగ్లాండ్ జట్టుపై 12 డబ్ల్యూటీసీ పాయింట్ల కోత విధించారు. దీంతో పాటు ఆటగాళ్ల మ్యాచ్ ఫీజులో 50 శాతం జరిమానా కూడా పడింది. ఈ పెనాల్టీతో పాయింట్ల పట్టికలో ఏడో స్థానంలోనే ఉన్న ఇంగ్లాండ్ పాయింట్ల శాతం ఒక్కసారిగా 34.72 నుండి 26.38 శాతానికి పడిపోయింది.

ఐసీసీ ప్రవర్తనా నియమావళిలోని ఆర్టికల్ 2.22 ప్రకారం.. కేటాయించిన సమయంలో వేయని ప్రతి ఓవర్‌కు 5 శాతం మ్యాచ్ ఫీజు జరిమానాగా విధిస్తారు. అలాగే వరల్డ్ టెస్టు ఛాంపియన్‌షిప్ నిబంధనల ప్రకారం ప్రతి తక్కువ ఓవర్‌కు ఒక పాయింట్ చొప్పున మొత్తం 12 పాయింట్లను కట్ చేశారు. ఇంగ్లాండ్ ఇన్నింగ్స్ ముగిసిన 48 నిమిషాల్లోనే న్యూజిలాండ్ ఆతిథ్య జట్టును ఆలౌట్ చేసి 253 పరుగుల భారీ విజయాన్ని నమోదు చేసింది. లార్డ్స్‌లో జరిగిన మొదటి టెస్టులో ఇంగ్లాండ్ విజయం సాధించగా, తాజా ఫలితంతో సిరీస్ 1–1తో సమమైంది. విజేతను నిర్ణయించే మూడో చివరి టెస్టు గురువారం నుండి నాటింగ్‌హామ్‌లో ప్రారంభం కానుంది.

ఈ మ్యాచ్ ఐదో రోజు 463 పరుగుల భారీ లక్ష్యంతో 182/5 ఓవర్‌నైట్ స్కోరుతో బరిలోకి దిగిన ఇంగ్లాండ్ లోయర్ ఆర్డర్‌ను న్యూజిలాండ్ ఫాస్ట్ బౌలర్ మాట్ హెన్రీ కుప్పకూల్చాడు. చివరి ఐదు వికెట్లను ఆయనే పడగొట్టి, రెండో ఇన్నింగ్స్‌లో 6/29 అద్భుత గణాంకాలు నమోదు చేశాడు. ఈ మ్యాచ్ మొత్తంలో ఆయన 11/109 (తొలి ఇన్నింగ్స్‌లో 5/80) వికెట్లు సాధించి, తన 35 టెస్టుల కెరీర్‌లో మొట్టమొదటిసారిగా 10 వికెట్ల మార్కును అందుకున్నాడు. ఇంగ్లాండ్ గడ్డపై 95 ఏళ్ల టెస్టు చరిత్రలో న్యూజిలాండ్‌కు ఇది కేవలం ఏడో విజయం కాగా, ఓవల్ మైదానంలో 1999 తర్వాత దక్కిన రెండో విజయం కావడం విశేషం.


గంగపుత్రుల రాజకీయ చైతన్యం
క్షత్రియ గంగపుత్ర భీష్మ
సూర్యవంశ
తేదీ : 23-06-2026 (మంగళవారం)
సమయం : 10:00 AM నుండి
రౌండ్ టేబుల్ సమావేశం
సుందరయ్య విజ్ఞాన కేంద్రం
బాగ్ లింగంపల్లి, హైదరాబాద్
రాజకీయ అధికారం
బీసీ పొలిటికల్ ఫ్రంట్
BPF
BC POLITICAL FRONT
చరిత్ర
మన గొప్ప వారసత్వం గౌరవంగా తెలుసుకుందాం
వర్తమాన
మన హక్కుల కోసం సంఘటితంగా పోరాడుదాం
భవిష్యత్తు
మన తరం, మన తరం కోసం రాజకీయ శక్తిగా ఎదుగుదాం
రాజకీయంగా అభివృద్ధి చెందాలంటే
చరిత్ర, వర్తమాన, భవిష్యత్తు అనే మూడు అంశాల కోణాలలో ఆలోచించాలి...
ఈ మూడు అంశాలను
హైలైట్ చేస్తూ మన గంగపుత్రుల భవిష్యత్తు నిర్మాణం వైపు
మీ భైరన్న బీసీ పొలిటికల్ ఫ్రంట్ రాష్ట్ర కన్వీనర్ 8328123722


వృత్తి రక్షణ !
సామాజిక న్యాయం!!
రాజ్యాధికారం !!!
గంగపుత్రుల రాజకీయ చైతన్యం
విద్యా, ఉద్యోగ, వృత్తి, హక్కుల రక్షణకై
రౌండ్ టేబుల్ సమావేశం
క్షత్రియ గంగపుత్ర భీష్మ
సూర్యవంశ
BPF
రాజకీయంగా అభివృద్ధి చెందాలంటే చరిత్ర, వర్తమాన, భవిష్యత్తు అనే మూడు అంశాల కోసంలో ఆలోచించాలి, మన గంగపుత్రుల అభివృద్ధి కోసం.
తేది : 23-06-2026, సమయం : మంగళవారం 10.30 గం॥లకు, స్థలం : సుందరయ్య విజ్ఞాన కేంద్రం, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్.
బీ.సీ పొలిటికల్ ఫ్రంట్ (BPF) భైరు శేఖర్ (భైరన్న)
BPF రాష్ట్ర కన్వీనర్, అమరవీరుల ఆశయ సాధన సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ (8328123722)
స్వాగతం.. సుస్వాగతం..

# టీఎంసీలో నిలువునా చీలిక



- అధినేత్రి పదవి నుండి మమతా బెనర్జీ తొలగింపు
- తిరుగుబాటు జెండా ఎగురవేసిన ప్రతిపక్ష నేత రితబ్రతా బెనర్జీ వర్గం
- సమాంతర కమిటీని ఏర్పాటు చేసి కొత్త చైర్‌పర్సన్‌గా అరూప్ రాయ్ ఎన్నిక
- తిరుగుబాటుదారుల క్యాంపులోకి చేరిన దీదీ ముఖ్య అనుచరుడు ఫిర్హాద్ హకీమ్
- పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన నేతలకు అధికారిక టీఎంసీ షోకాజ్ నోటీసులు

**కోల్‌కతా, వెలుతురు జూన్ 22:**

పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో పెను సంచలనం నమోదైంది. అధికార టీఎంసీ పార్టీలో ఒక్కసారిగా నిలువునా చీలిక ఏర్పడింది. పార్టీ వ్యవస్థాపకురాలు, అధినేత్రి మమతా బెనర్జీని చైర్‌పర్సన్ పదవి నుండి తొలగిస్తున్నట్లు తిరుగుబాటు వర్గం ప్రకటించింది. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీలో నూతన బీజేపీ ప్రభుత్వం తమ తొలి బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన అదే రోజున ఈ అనూహ్య పరిణామాలు చోటుచేసుకోవడం గమనార్హం. కోల్‌కతాలోని న్యూటౌన్ పరిధిలో గల ఒక ఫైవ్ స్టార్ హోటల్‌లో సమావేశమైన అసంతృప్త ఎమ్మెల్యేలు, నేతలు.. మమతా బెనర్జీ స్థానంలో కొత్త చైర్‌పర్సన్‌తో కూడిన సమాంతర నాయకత్వ నిర్మాణాన్ని ప్రకటించి రాజకీయ ప్రకంపనలు సృష్టించారు.

టీఎంసీ అసంతృప్త వర్గానికి నేతృత్వం వహిస్తున్న అసెంబ్లీ ప్రతిపక్ష నేత రితబ్రతా బెనర్జీ మాట్లాడుతూ.. తమకు పార్టీకి చెందిన అత్యధిక శాతం మంది శాసనసభ్యులు, కీలక నేతల మద్దతు ఉందని ప్రకటించారు. ఈ ప్రత్యేక సమావేశానికి ప్రస్తుత, మాజీ ఎమ్మెల్యేలు, జిల్లా అధ్యక్షులు, కౌన్సిలర్లు సహా సుమారు 500 మంది హాజరైనట్లు రెబెల్స్ పేర్కొన్నారు. ఈ వేదికగా మమతా బెనర్జీ అత్యంత ఆప్తుడైన మాజీ కోల్‌కతా మేయర్ ఫిర్హాద్ హకీమ్ సైతం తిరుగుబాటు వర్గంలో చేరిపోవడం మమతకు కోలుకోలేని దెబ్బగా భావిస్తున్నారు. సమావేశంలో ఏకగ్రీవంగా ఎమ్మెల్యే అరూప్ రాయ్‌ను పార్టీ కొత్త చైర్‌పర్సన్‌గా ఎన్నుకున్నారు. వైస్ ప్రెసిడెంట్లుగా ఫిర్హాద్ హకీమ్, అరూప్ బిశ్వాస్, రథిన్ ఘోష్, సబీనా యాస్మిన్.. జనరల్ సెక్రటరీలుగా రితబ్రతా బెనర్జీ, జావేద్ ఖాన్, సందీపన్ సహాలను నియమిస్తూ 30 మందితో కూడిన నూతన జాతీయ వర్కింగ్ కమిటీని ఏర్పాటు చేశారు.

పార్టీ నిబంధనల ప్రకారమే తాము ఈ సమావేశాన్ని నిర్వహించామని, తామే 'అసలైన' టీఎంసీ అని రితబ్రతా బెనర్జీ స్పష్టం చేశారు. ఈ సమావేశ వివరాలను త్వరలోనే కేంద్ర ఎన్నికల సంఘానికి అధికారికంగా అందజేస్తామన్నారు. మమతా బెనర్జీ పార్టీకి 'చీఫ్ అడ్వైజర్'గా ఉండాలనుకుంటే తాము స్వాగతిస్తామని ఆయన వ్యాఖ్యానించారు. అయితే, సమావేశ ప్రాంగణంలో పార్టీ గుర్తును వాడినప్పటికీ.. మమతా బెనర్జీ, ఆమె మేనల్లుడు అభిషేక్ బెనర్జీల చిత్రాలను పూర్తిగా పక్కనబెట్టేశారు. మరోవైపు ఈ తిరుగుబాటుపై అధికారిక టీఎంసీ నాయకత్వం తక్షణమే స్పందించింది. పార్టీ క్రమశిక్షణా కమిటీ రంగంలోకి దిగి.. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినందుకు గాను ఫిర్హాద్ హకీమ్, అరూప్ బిశ్వాస్, అరూప్ రాయ్, జావేద్ ఖాన్ సహా పలువురు సీనియర్ రెబెల్ నేతలకు అత్యవసరంగా షోకాజ్ నోటీసులు జారీ చేసింది.

# పోలీస్ నియామకాలపై ప్రభుత్వాన్ని నిలదీసిన మహేశ్వర్ రెడ్డి

- జీవో 46, వయోపరిమితి నిబంధనలతో నిరుద్యోగ యువతకు అన్యాయం జరిగిందని ఆరోపణ
- 20 వేల పోలీస్ పోస్టులతో కొత్త నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్

**హైదరాబాద్ వెలుతురు జూన్ 22:**

తెలంగాణలో పోలీస్ ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న నిరుద్యోగ యువత తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోందని బీజేపీ శాసనసభాపక్ష నాయకుడు ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఆరోపించారు. ఉద్యోగం యువత హక్కు అయినప్పటికీ ప్రభుత్వాల నిర్లక్ష్యం, లోపభూయిష్ట విధానాల కారణంగా వేలాది మంది అభ్యర్థులు నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు.జీవో 46 కారణంగా గ్రామీణ జిల్లాల అభ్యర్థులకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆయన విమర్శించారు. CDC-I, CDC-II విధానాల వల్ల ఒకే పరీక్ష రాసిన అభ్యర్థులకు వేర్వేరు కటాఫ్ మార్కులు అమలవుతున్నాయని, హైదరాబాద్ కమిషనరేట్లకు ఎక్కువ పోస్టులు వెళ్లడంతో గ్రామీణ జిల్లాల అభ్యర్థులు అధిక మార్కులు సాధించినప్పటికీ ఉద్యోగాలు కోల్పోతున్నారని ఆరోపించారు. అధికారంలోకి రాకముందు జీవో 46ను రద్దు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికీ ఆ హామీని అమలు చేయలేదని విమర్శించారు.వయోపరిమితికి సంబంధించిన జీవో 87పై కూడా ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. ఏళ్ల తరబడి నియామకాలు లేకపోవడంతో అనేక మంది అభ్యర్థులు వయోపరిమితి దాటిపోయారని, ఇతర శాఖల మాదిరిగా పోలీస్ నియామకాల్లోనూ పూర్తి స్థాయిలో వయోపరిమితి సడలింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు.రాష్ట్ర అవసరాలకు 5 వేల కానిస్టేబుల్ పోస్టులు సరిపోవని, కనీసం 20 వేల పోలీస్ పోస్టులతో కొత్త నోటిఫికేషన్ విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉద్యోగాల కోసం శాంతియుతంగా ఆందోళన చేసిన తొమ్మిది మంది విద్యార్థులపై నమోదైన కేసులను బేషరతుగా ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.నారాయణపేట, గద్వాల, ఆదిలాబాద్, నిర్మల్ వంటి వెనుకబడిన జిల్లాల యువత అవకాశాలు కోల్పోతోందని ఆందోళన వ్యక్తం చేసిన మహేశ్వర్ రెడ్డి, దేశవ్యాప్తంగా ఆర్మీ నియామకాల్లో లాంగ్ జంప్ అర్హత 3.8 మీటర్లు ఉండగా తెలంగాణలో 4 మీటర్లుగా నిర్ణయించడం అన్యాయమని విమర్శించారు.ఉద్యోగాల భర్తీ విషయంలో ప్రభుత్వంలోనే స్పష్టత లేదని ఆయన ఆరోపించారు. ఒక మంత్రి 70 వేల ఉద్యోగాలు అంటుంటే, ముఖ్యమంత్రి లక్ష ఉద్యోగాలు అంటున్నారని, మంత్రివర్గంలో ఒక్కొక్కరు ఒక్కో సంఖ్య చెబుతూ నిరుద్యోగులను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు.

దిల్‌సుఖ్‌నగర్‌కు వెళ్లి అక్కడి విద్యార్థులను కలిసి వారి సమస్యలు తెలుసుకుంటామని, నిరుద్యోగ యువతకు న్యాయం జరిగే వరకు బీజేపీ పోరాటం కొనసాగిస్తుందని మహేశ్వర్ రెడ్డి స్పష్టం చేశారు.



# లక్నో కోచింగ్ సెంటర్‌లో ఘోర అగ్ని ప్రమాదం

- 15 మంది దుర్మరణం
- పలువురికి తీవ్ర గాయాలు
- దట్టమైన పొగతో ఊపిరాడక 15 మంది ప్రాణాలు విలవిల
- మృతులకు రూ.2 లక్షలు, క్షతగాత్రులకు రూ.50 వేల ఎక్స్‌గ్రేషియా ప్రకటించిన ప్రధాని మోదీ

**లక్నో, వెలుతురు జూన్ 22:**

ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోలో అత్యంత విషాదకర సంఘటన చోటుచేసుకుంది. నగరంలోని పూర్ణియా ప్రాంతంలో ఉన్న ఒక వాణిజ్య భవనంలో సంభవించిన ఘోర అగ్నిప్రమాదంలో 15 మంది ప్రాణాలు కోల్పోగా, మరో ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ భవనంలోని కింది భాగంలో గేమింగ్ జోన్, పెట్ క్లినిక్ నిర్వహిస్తుండగా.. పై అంతస్తులో విద్యార్థుల కోచింగ్ సెంటర్ నడుస్తోంది. ప్రమాదం జరిగిన సమయంలో అకస్మాత్తుగా మంటలు, దట్టమైన పొగ భవనాన్ని కమ్మేయడంతో లోపల ఉన్న విద్యార్థులు ప్రాణాలు కాపాడుకోవడానికి హాహాకారాలు చేశారు. దారి లేకపోవడంతో పలువురు విద్యార్థులు ఒకటో అంతస్తు నుండి కిందకు దూకారు. మరణించిన వారంతా 20 నుండి 28 సంవత్సరాల లోపు వయసు గలవారని, మెజారిటీ మరణాలు దట్టమైన పొగ కారణంగా ఊపిరాడక సంభవించాయని అధికారులు నిర్ధారించారు. ప్రాథమిక సమాచారం ప్రకారం.. ఈ భవనంలో నడుస్తున్న గేమింగ్ జోన్‌కు ఎలాంటి ఫైర్ నో అబ్జెక్షన్ సర్టిఫికేట్ లేదని తేలింది.

ఈ ఘోర ప్రమాదంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతిని, విచారాన్ని వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తన గాఢ సానుభూతిని తెలియజేశారు. ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధి నుండి మరణించిన వారి కుటుంబాలకు రూ. 2 లక్షలు, గాయపడిన వారికి రూ. 50,000 చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటిస్తున్నట్లు ప్రధాని ఎక్స వేదికగా వెల్లడించారు. బాధితులకు అవసరమైన అన్ని రకాల సహాయక చర్యలు అందించాలని స్థానిక అధికారులను ఆదేశించారు.

మరోవైపు అలిగఢ్ పర్యటనలో ఉన్న ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఈ దారుణ ఘటన గురించి తెలియగానే తన అధికారిక కార్యక్రమాలన్నింటినీ రద్దు చేసుకుని తక్షణమే లక్నో చేరుకున్నారు. నేరుగా ప్రమాద స్థలాన్ని సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. అనంతరం కింగ్ జార్జ్ మెడికల్ యూనివర్సిటీలో చికిత్స పొందుతున్న బాధితులను ఆయన పరామర్శించనున్నారు. ఈ ఘటనపై తీవ్రంగా స్పందించిన సీఎం.. ప్రమాదానికి గల కారణాలపై సమగ్ర విచారణ జరిపి తక్షణమే నివేదిక సమర్పించాలని డీజీపీ, అదనపు ప్రధాన కార్యదర్శి (హోం) లని ఆదేశించారు. ప్రమాదానికి కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.







Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com